

# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు




# కరవు సీమను 'సిరుల సీమ'గా మారుస్తాం

- ఉద్యానరంగ అభివృద్ధితో ఆర్థికాభివృద్ధి
- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు
- రూ.లక్ష కోట్లతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు శ్రీకారం
- రిలయన్స్ సంస్థ భాగస్వామ్యంతో 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్' ఏర్పాటుకు శంకుస్థాపన

2




ఒకప్పుడు కరువు పీడిత ప్రాంతంగా ముద్రపడిన రాయలసీమను 'సిరుల సీమ'గా మారుస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. రూ.లక్ష కోట్ల అంచనా వ్యయంతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్, 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌లకు శుక్రవారం ఆయన అన్నమయ్య జిల్లా మదనపల్లెలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన భారీబహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ 'గ్రామాలే దేశానికి పట్టుగొమ్మలు" అన్న మహాత్మా గాంధీ ఆశయాలకు అనుగుణంగా రాయలసీమలోని 8 జిల్లాలు, ప్రకాశం, మార్కాపురం జిల్లాల ఉద్యాన రైతులకు మేలు చేకూర్చేలా ఈ ప్రాజెక్టును తీసుకొచ్చా మని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రూ.40 వేల కోట్లు, ప్రైవేటు పెట్టుబడుల ద్వారా మరో రూ.60 వేల కోట్లు సమీకరించి... 201 క్లస్టర్ల పరిధిలోని 5,860 గ్రామాల్లో అదనంగా 6లక్షల ఎకరాల్లో ఉద్యాన సాగును విస్తరిస్తామని వెల్లడించారు. ఉత్పాదన నుంచి మార్కెటింగ్, ప్రాసెసింగ్, ఎగుమతుల వరకు రైతులకు సమగ్ర మద్దతు అందిస్తామన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను 'ఉక్కు మహిళ'గా అభివర్ణించిన సీఎం రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీని 'ఆంధ్ర ముద్దుబిడ్డ'గా కొనియాడారు.



సీమ రూపురేఖలు మార్చబోతున్న

## గ్లోబల్ హార్టికల్చర్ హబ్

- రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడమే ప్రభుత్వ లక్ష్యం
- హార్టికల్చర్ హబ్-ఐఎస్‌ఏ శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్

'హైదరాబాద్‌లో ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) వ్యాపార రంగానికి గ్లోబల్ బ్రాండ్‌గా మారింది... అదే రీతిలో మదనపల్లెలో ఏర్పాటు చేస్తున్న ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్' (ఐఎస్‌ఏ) రాయలసీమ వ్యవసాయరంగ స్వరూపాన్నే మార్చివేస్తుందని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ ఉద్ఘాటించారు. 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్' శంకుస్థాపన సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. పోరాటాలకు, త్యాగాలకు పురిటిగడ్డ అయిన మదనపల్లె నేల నుంచి వ్యవసాయ రంగంలో కొత్త అధ్యాయం ప్రారంభమవుతోందన్నారు. యువగళం పాదయాత్రలో ప్రకటించిన 'మిషన్ రాయలసీమ' ఆలోచన నేడు నిజమవుతోందన్నారు. విత్తనం ఎంపిక నుంచి దిగుబడి, కోల్డ్ స్టోరేజ్, ప్యాకేజింగ్, యంత్రాల వినియోగం, జీరో బడ్జెట్ నేచరల్ ఫార్మింగ్ వరకు ఇక్కడ అధునాతన పరిశోధనలు జరుగుతాయని చెప్పారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

5

# స్వచ్ఛతతోనే స్వర్ణాంధ్ర

- నదుల్లో వ్యర్థాలను వదలొద్దు
- పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత, ఆలోచనల్లో శుభ్రత అవసరం
- చెత్త సమస్య కాదు... సంపదగా మార్చే విధానంగా చూడాలి
- స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానోత్సవ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

3




పరిశుభ్రత అనేదికేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, రాష్ట్రంలోని ఐదు కోట్ల మంది ప్రజలు భాగస్వాములై ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగితేనే స్వర్ణాంధ్ర ప్రదేశ్ సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు స్పష్టంచేశారు. విజయవాడలో శుక్రవారం రాత్రి నిర్వహించిన 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' అవార్డుల ప్రదానోత్సవంలో ఆయనముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నదులు కాలుష్యమయమైతే పర్యావరణ సమతుల్యత దెబ్బతిని ఎల్-నినో వంటిప్రతికూల పరిస్థితులు ఏర్పడతాయన్నారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత, ఆలోచనల్లో శుభ్రత అవసరమ న్నారు. చెత్తను వ్యర్థంగా చూడకుండా సంపదగా మార్చే ప్రక్రియను వేగవంతం చేస్తున్నా మని, రాష్ట్రాన్ని 'సర్క్యులర్ ఎకానమీ' దిశగా తీసుకెళ్తున్నామని వెల్లడించారు. స్వచ్ఛతలో చల్లపల్లి గ్రామాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు.









# దేశంలో ఏపీని నెం.1గా నిలపడమే మా లక్ష్యం

- ఇందుకు మీ అందరి సహకారం కావాలి
- విజయవాడలో పాన్-ఐఐటీ కాన్ఫరెన్స్ టీమ్ డిన్నర్ మీటింగ్‌లో మంత్రి లోకేష్

6

## మంగళగిరి చేరుకున్న సేవా సంకల్ప యాత్ర

- టీడీపీ కేంద్ర కార్యాలయం వద్ద రైడర్లకు ఘన స్వాగతం పలికిన పార్టీ నేతలు
- మోదీ ఆయురారోగ్యాల కోసం తిరుమల నుంచి వారణాసి వరకు బైక్ యాత్ర: శాప్ చైర్మన్ రవినాయుడు

12



చైతన్యరథం

# కరవు సీమను సిరుల సీమగా మారుస్తాం

- ఉద్యానరంగ అభివృద్ధితో ఆర్థికాభివృద్ధి
- అగ్రికల్చర్ స్కూల్ ద్వారా వ్యవసాయ రంగంలో నైపుణ్యాలు పెంచుతాం
- కేంద్ర సాయంతో రాష్ట్రాభివృద్ధి
- ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సహకారాన్ని మరువలేం
- గ్లోబల్ హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ శంకుస్థాపన సభలో సీఎం చంద్రబాబు
- రూ.లక్ష కోట్లతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు శ్రీకారం
- రిలయెన్స్ సంస్థ భాగస్వామ్యంతో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటుకు శంకుస్థాపన
- మదనపల్లెలో రెండు బృహత్తర ప్రాజెక్టులకు అంకురార్పణ చేసిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్
- గోదావరి-కావేరి నదుల అనుసంధానికి అనుమతివ్వాలని కేంద్రాన్ని కోరిన సీఎం చంద్రబాబు
- తనను ఆంధ్రప్రదేశ్ బిడ్డగా భావించమని సీఎంను కోరిన అనంత్ అంబానీ
- అనంత్ అంబానీ ఏపీ ముద్దుబిడ్డ అంటూ ముఖ్యమంత్రి ఆలింగనం



మదనపల్లె(చైతన్యరథం): కరవు సీమగా పేరున్న రాయలసీమను సిరుల సీమగా మారుస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించారు. 2024 ఎన్నికల్లో కూటమిని గెలిపించిన మరుక్షణం నుంచే ప్రజలకు మేలు చేయాలనే తలంపుతో ఉన్నామని...దాంట్లో భాగంగానే రాయలసీమలోని ఎనిమిది జిల్లాలు, ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లోని ఉద్యాన రైతులకు మేలు చేసేలా గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు శ్రీకారం చుట్టా మని చెప్పారు. అన్నమయ్యజిల్లా మదనపల్లెలో శుక్రవారం గ్లోబల్ హార్టికల్చర్ హబ్-GHH, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్-ISAకు శంకుస్థాపన ఘనంగా జరిగింది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్,ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ, మంత్రి నారా లోకేష్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. రూ.లక్ష కోట్ల అంచనా వ్యయంతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌ను అభివృద్ధి చేయనున్నారు. కేంద్ర సహకారంతో రూ.40వేలకోట్లు, ప్రైవేటుపెట్టుబడులతో మరో రూ.60 వేల కోట్లను సమీకరించేలా ప్రణాళికలు రూపొందించారు.

ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట్లాడుతూ... గ్రామాలే దేశానికి పట్టుగొమ్మలు అన్న మహాత్మాగాంధీ ఆశయాన్ని సాకారం చేసే దిశగా రాయలసీమలో చారిత్రక కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సహకారంతో కరవుసీమను రూ.లక్ష కోట్లతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ఉద్యాన రంగం ప్రాథమిక రంగం వృద్ధిలో కీలకపాత్ర పోషిస్తోందని, ప్రస్తుతం సుమారు రూ.1.50లక్షల కోట్ల జీవీఏ అందిస్తున్న ఈ రంగం ద్వారా మరో రూ.లక్ష కోట్ల జీవీఏ సాధించాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్నామని తెలిపారు. ఈ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ద్వారా 5,860 గ్రామాలను 201 క్లస్టర్లుగా అభివృద్ధి చేయడంతోపాటు అదనంగా 6లక్షల ఎకరాల్లో ఉద్యాన సాగును విస్తరించేలా కార్యాచరణ చేపడతామన్నారు. రైతులకు ఉత్పత్తి నుంచి మార్కెటింగ్, ప్రాసెసింగ్, ఎగుమతుల వరకు సమగ్ర మద్దతు అందించడమే హార్టికల్చర్ హబ్ ప్రధాన ఉద్దేశమని సీఎం చంద్రబాబు చెప్పారు. పంటల స్థిరీకరణతో పాటు ధరల స్థిరీకరణకు చర్యలు తీసుకుంటామన్నారు. యాపిల్, స్ట్రాబెరీ నుంచి అరటి, ఆవకాడో, కివీ, ఖర్జూరం వరకు వివిధరకాల ఉద్యాన పంటలకు ప్రోత్సహం అందిస్తామని వెల్లడించారు. ఫుడ్ ప్రాసెసింగ్, అగ్రిటెక్, లాజిస్టిక్స్, అగ్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి రంగాలను అభివృద్ధి చేసి రైతులకు మేలు చేసే వ్యవస్థలను అందుబాటులోకి తెస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. సీడ్ టు షిప్‌మెంట్ వ్యవస్థల ద్వారా రైతులకు స్థిరమైన ఆదాయం కల్పించేలా కార్యక్రమాలను అమలు చేస్తామని చెప్పారు.

## సాగునీరందిస్తాం... బంగారం పండించండి

సాగునీరు అందిస్తే రాయలసీమ ప్రజలుబంగారం పండిస్తారని, మార్కెటింగ్ ద్వారా సంపద సృష్టిస్తారని సీఎం పేర్కొన్నారు. హంద్రీ-నీవా, గాలేరు-నగరి తదితర సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నామని, రూ.3,500 కోట్లతో హంద్రీ-నీవా కాలువను పూర్తి చేసి కుప్పం వరకు నీటిని తీసుకెళ్లామని చెప్పారు. వెలిగొండ మొదటి దశను పూర్తి చేసి మార్కాపురానికి, పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి నీటిని అందించామని వివరించారు.మరో రూ.35వేల కోట్లతో 36 ప్రాధాన్య ప్రాజెక్టులను మూడేళ్లలో పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామని సీఎం తెలిపారు. రాయలసీమలో హంద్రీ-నీవా,మడకశిర బ్రాంచ్ కెనాల్, మల్లెమడుగు, బాలాజీసాగర్, అప్పర్ పేరూరు తదితర ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. వాతావరణ మార్పులు, ఎల్-నినో వంటి పరిస్థితుల కారణంగా వ్యవసాయ రంగంలో సవాళ్లు పెరుగుతున్నాయని సీఎం అన్నారు. గోదావరి లో ఈ ఏడాది కూడా సుమారు 1,600 టీఎంసీల నీరు సముద్రంలోకి వెళ్లిందని, పట్టిసీమ ద్వారా పదేళ్ల లో సుమారు 500 టీఎంసీల నీటిని కృష్ణా డెల్టాకు తరలించామని తెలిపారు. కృష్ణా డెల్టాలో పొదుపు చేసిన నీటిని రాయలసీమకు తరలించడం నదుల అనుసంధానం వల్లే సాధ్యమైందన్నారు. వచ్చే ఏడాది పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసి ప్రధాని మోదీ చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తామని సీఎం తెలిపారు. పవర్ గ్రిడ్, రోడ్ గ్రిడ్, డిజిటల్ కనెక్టివిటీ మాదిరిగా వాటర్ గ్రిడ్ అవసరమని చెప్పారు. గోదావరి నుంచి కావేరి వరకు నీటిని అనుసంధానం చేసే అంశాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. గోదావరి-కావేరి అనుసంధానంతో రాయలసీమ కరవు తీరడంతోపాటు... దక్షిణాదిలోని 4 రాష్ట్రాల మధ్య నెలకొనే నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. రిలయన్స్ సంస్థ సహకారంతో మదనపల్లెలో ఏర్పాటు కానున్న ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ద్వారా వ్యవసాయం, ఉద్యానవనం, ఆధునిక సాంకేతికత, పరిశోధన, కృత్రిమ మేధ వంటి రంగాల్లో నైపుణ్యాలను పెంపొందించేలా ఈ సంస్థను తీర్చిదిద్దనున్నట్టు వెల్లడించారు. ఐఐఎంలో మేనేజ్‌మెంట్ నిపుణులు, ఐఐటీలో సాంకేతిక నిపుణులు, ఐఎస్‌బీలో పారిశ్రామిక నైపుణ్యాలు అభివృద్ధి చెందినట్లే... ఐఎస్‌ఏ ద్వారా వ్యవసాయ రంగంలో నాయకత్వ నైపుణ్యాలు కలిగిన నిపుణులను తయారు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యమని సీఎం చంద్రబాబు తెలిపారు.

## ఉక్కు మహిళ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రాష్ట్రానికి, దేశ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు అందిస్తున్న సహకారాన్ని సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా ప్రస్తావించారు. అమరావతి, విశాఖ ఉక్కు, పోలవరం తదితర ప్రాజెక్టులకు కేంద్రం సహకరిస్తోందన్నారు. దేశ నిర్మాణంలో నిర్మలా సీతారామన్ కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. జీఎస్టీ నెక్స్ట్‌జెన్ సంస్కరణలు, డీబీటీ ద్వారా సంక్షేమ పథకాల్లో పారదర్శకత, ఆర్థిక వ్యవస్థలో సంస్కరణల ద్వారా దేశాన్ని బలోపేతం చేస్తున్న ఉక్కు మహిళ నిర్మలా సీతారామన్ అని సీఎం అన్నారు. ఇంటిని చక్కగా తీర్చిదిద్దే సత్తా మహిళకు మాత్రమే ఉంటుందని.. అదే విధంగా దేశ ఆర్థిక వ్యవస్థను నిర్మలా సీతారామన్ తీర్చిదిద్దుతున్నారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఆమెకున్న నాయకత్వ పటిమను గుర్తించే ప్రధాని మోదీ ఆర్థికశాఖ బాధ్యతలు అప్పగించారన్నారు. గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు నిధులు కేటాయించే విషయంలో నిర్మలా సీతారామన్ చూపిన చొరవను.. ఇచ్చిన సహకారాన్ని మరువలేమన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఈస్థాయిలో అభివృద్ధి-సంక్షేమం చేయగలుగుతోందంటే దానికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. మదనపల్లెలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటుకు ముందుకొచ్చిన రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ పెద్ద మనసు చాటుకున్నారన్నారు. వ్యవసాయం, ఉద్యాన రంగాల్లో పరిశోధన, ఆధునిక సాంకేతికత, ఏఐ వినియోగంతో పాటు రైతులకు అవసరమైన మద్దతు వ్యవస్థలను అభివృద్ధి చేయడంలో రిలయన్స్ సంస్థ సహకారం అందించాలని సీఎం చంద్రబాబు కోరారు. సీడ్ టు షిప్‌మెంట్, అగ్రిటెక్, లాజిస్టిక్స్, అగ్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగాల్లో మరింతగా భాగస్వామ్యం కావాలని సూచించారు. తిరుమల శ్రీవారిపై భక్తితో ఈవీ బస్సులను సమకూర్చిన అనంత్ అంబానీసేవలను సీఎం ప్రస్తావించారు. వంతారా వంటి వ్యవస్థను ఏర్పాటుచేసి జంతువులకు సైతం సేవలు అందిస్తున్న గొప్ప పర్యావరణ ప్రేమికుడు అనంత్ అంబానీ అని కొనియాడారు. అనంత్ అంబానీ తన తాత, తండ్రుల వారసత్వాన్ని పుణికి పుచ్చుకుని వారిబాటలో నడుస్తున్నారని సీఎం చంద్రబాబు చెప్పారు.

## ప్రత్యేక ఆకర్షణగా అనంత్ అంబానీ

రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆంధ్రప్రదేశ్‌తో తన అనుబంధాన్ని చాటుకుంటూ భావోద్వేగంగా ప్రసంగించారు. తనను ఆంధ్ర బిడ్డగా భావించాలని, రాష్ట్రానికి తాను ఏం చేయగలనో మార్గనిర్దేశం చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. గ్లోబల్ హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ కార్యక్రమంలో ఆయన ప్రసంగం ఆకట్టుకుంది. అనంత్ అంబానీ ప్రసంగం అనంతరం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేష్ ఆయన్ను అభినందించారు. అనంతరం సీఎం చంద్రబాబు అనంత్ అంబానీని ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. ఆ తర్వాత ప్రసంగించిన ముఖ్యమంత్రి... అనంత్ అంబానీ మాటలకు స్పందించారు. అనంత్ అంబానీని ఆంధ్రప్రదేశ్ ముద్దుబిడ్డగా భావిస్తున్నామని సీఎం వేదికపై ప్రకటించారు. రాష్ట్ర అభివృద్ధిలో రిలయన్స్ సంస్థ మరింతగా భాగస్వామి కావాలని ఆకాంక్షించారు.

సభలో వక్తల ప్రసంగాలకు ముందు ప్రత్యేక వీడియో ప్రజెంటేషన్ ఇచ్చారు. రాయలసీమలో ఉద్యానరంగం అభివృద్ధి, రైతుల ఆదాయ పెంపు, నీటి వనరుల వినియోగం, ఆధునిక సాగు విధానాలు, ప్రాసెసింగ్, మార్కెటింగ్, ఎగుమతుల అవకాశాలను ఈ వీడియోలో వివరించారు. కార్యక్రమం అనంతరం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేష్, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మొక్కలు నాటారు. ఉద్యాన రంగానికి సంబంధించి ఏర్పాటుచేసిన స్టాళ్లను సందర్శించారు. కార్యక్రమంలో మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, బీసీ జనార్దన్‌రెడ్డి, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, వివిధశాఖల ఉన్నతాధికారులు, అన్నమయ్య జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.







చైతన్యరథం

# స్వచ్ఛతతోనే స్వర్ణాంధ్ర

- నదుల్లో వ్యర్థాలు వదలొద్దు
- పరిసరాల పరిశుభ్రతతోపాటు వ్యక్తిగత శుభ్రత, ఆలోచనల్లో శుభ్రత అవసరం
- చెత్త సమస్య కాదు... సంపదగా మార్చే విధానంగా చూడాలి
- రూ.1.30 లక్షల కోట్లతో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి
- స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానోత్సవ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు
- నెట్‌జీరోపై సీఎం సమక్షంలో ఐఐటీ కాన్పూర్‌తో ఎంఓవో కుదుర్చుకున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్

విజయవాడ (చైతన్యరథం): నదులను పరిశుభ్రంగా ఉంచాలని... వాటిల్లో వ్యర్థాలు వదలొద్దని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూచించారు. స్వచ్ఛత అనేది ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని.. ఐదు కోట్ల మంది ప్రజలు భాగస్వాములై ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగితేనే రాష్ట్రంలో శాశ్వత మార్పు సాధ్యమవుతుందన్నారు. విజయవాడలో శుక్రవారం రాత్రి నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర అవార్డ్స్-2026 ప్రదానోత్సవంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛతా వారియర్లు, స్వచ్ఛ గ్రామాలు, పట్టణాలు, పాఠశాలలు, ఆస్పత్రులు, సంస్థలు, ప్రాంగణాలు, ఎన్జీవోలకు అవార్డులు అందజేశారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ... కృష్ణా, గోదావరి నదుల్లోకి వ్యర్థాలు, మురుగునీటిని వదిలేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దిగువ ప్రాంతాల్లో ప్రజలు నదుల నీటినే తాగునీటిగా వినియోగిస్తున్నారని తెలిపారు. నదులు కలుషితమైతే అది ఒక్క ప్రాంతానికే పరిమితం కాకుండా ఇతర ప్రాంతాలకు కూడా అపరిశుభ్రత ద్వారా ఉత్పన్నమయ్యే సమస్యలు వస్తాయన్నారు. నదుల కలుషితం వల్ల పర్యావరణంపై ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. పర్యావరణానికి నష్టం చేసే చర్యల వల్లే ఎల్‌నినో లాంటి పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయని చెప్పారు. ఎల్‌నినో ప్రభావంతో కృష్ణా నదికి నీరు రాని పరిస్థితి ఏర్పడిందని వివరించారు. జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి నీరు అందించడంతో పాటు మురుగునీటి శుద్ధికి రాష్ట్రవ్యాప్తంగా ఎస్టీపీలను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.

## స్వచ్ఛత ద్వారా ఆరోగ్యాంధ్ర

వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యం, ఆలోచనల్లోనూ స్వచ్ఛత ఉండాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతతోపాటు..వ్యక్తిగత శుభ్రత పాటిస్తే అనారోగ్యం దరిచేరదన్నారు. గాంధీజీ స్వాతంత్ర్యం పోరాటంతోపాటు స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇచ్చారని సీఎం పేర్కొన్నారు. కోల్‌కతాలో అపరిశుభ్రంగా ఉన్న మరుగుదొడ్లనుచూసి ఆయనే స్వయంగా శుభ్రం చేశారని గుర్తు చేశారు. పరిశుభ్రత ఏ ఒక్క వర్గానికో సంబంధించిన అంశంకాదని...ఆరోగ్యం కోసం ఎవరి పరిసరాలను వారే శుభ్రంగా ఉంచుకోవాలన్నదే గాంధీజీ సందేశమని చెప్పారు. రాష్ట్రంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఏర్పాటు చేసి స్వచ్ఛతా కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. గత పాలకుల కాలంలో పరిశుభ్రతపై తగిన శ్రద్ధ లేకపోవడంతో టన్నుల కొద్దీ చెత్తరోడ్లపై పేరుకుపోయేదని పేర్కొన్నారు. ఇప్పుడు ప్రతినెలామూడో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ఉద్యమ స్ఫూర్తితో నిర్వహిస్తున్నామని, తానుకూడా ప్రతినెలా స్వయంగా పాల్గొంటున్నానని తెలిపారు. రెండేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా స్పష్టమైన మార్పు కనిపిస్తోందన్నారు.




## నెట్‌జీరో దిశగా ఏపీ

చెత్తను సమస్యగా చూడకుండా సంపద సృష్టించే వనరుగా మార్చుతున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. వ్యర్థాలతో విద్యుత్తు ను ఉత్పత్తి చేయడంతోపాటు ఎరువులు, బయోగ్యాస్ తయారుచేసి రాష్ట్రాన్ని సర్క్యులర్ ఎకానమీ దిశగా తీసుకెళ్తున్నామని చెప్పారు. ఘన వ్యర్థాల సేకరణ కోసం రాష్ట్రవ్యాప్తంగా స్వచ్ఛ రథాలు నిర్వహిస్తున్నామన్నారు. జీరో గార్బేజ్ లక్ష్యంతో ఈ-ఆటోలు,పుష్‌కార్టులు, మెకనైజ్డ్ రోడ్ స్వీపింగ్ యంత్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. కొత్తగా చెత్త పేరుకుపోకుండా ఇంటిగ్రేటెడ్ సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. మ్యాజిక్ డ్రెయిన్లు,సోక్ పిట్లు,కంపోస్ట్ పిట్లు, గోవర్ధన్, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లలో నెట్‌జీరో కాన్సెప్ట్‌తో పనిచేస్తున్నామని సీఎం తెలిపారు.దీన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు ఈ విషయంలో కొత్త విధానాలను అధ్యయనం చేసేందుకు నెట్‌జీరో అంశంపై ఐఐటీ కాన్పూర్‌తో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఒప్పందం కుదుర్చుకుందని వెల్లడించారు. నగరాల్లో సిటీ క్లైమేట్ యాక్షన్ ప్లాన్ అమలు చేయడంతోపాటు మురుగు నీటిని శుద్ధిచేసి తిరిగి వినియోగించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## రూ.1.30 లక్షల కోట్లతో గ్రామీణాభివృద్ధి

పట్టణ ప్రాంతాలతో పాటు 'పల్లె పండుగ' ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పెద్దఎత్తున అభివృద్ధికార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించామని ముఖ్యమంత్రి తెలిపారు. వచ్చే ఐదేళ్లలో గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.30 లక్షల కోట్లు ఖర్చుచేయాలని ప్రణాళిక రూపొందించామని చెప్పారు. చేస్తున్నమంచిని అడ్డుకునేందుకు కొందరు ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. గతంలో రాయలసీమ మొత్తం కరువు పరిస్థితులతో ఉండేదని సీఎం గుర్తుచేశారు. డ్రిప్ ఇరిగేషన్‌తోపాటు సాగునీటి ప్రాజెక్టుల ద్వారా నీటిని అందించగలిగామని తెలిపారు. ఇప్పుడు రూ.లక్ష కోట్ల పెట్టుబడితో రాయలసీమను గ్లోబల్ హార్టీకల్చర్ హబ్‌గా మార్చేందుకు అంకురార్పణ చేశామని చెప్పారు. గ్లోబల్ హార్టీకల్చర్ హబ్ ద్వారా గ్రీన్ కవర్ పెరిగి పర్యావరణంలో మార్పు వస్తుందన్నారు. పరిశుభ్రతతోపాటు పచ్చదనానికి ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించారు. తిరుమలకు వెళ్లిన ప్రతిసారీ శ్రీవారి దర్శనంతోపాటు అక్కడి పచ్చదనంపై తాను ప్రత్యేకంగా దృష్టి పెడతానని సీఎం తెలిపారు. తిరుమల కొండల్లో 80 శాతానికి పైగా పచ్చదనం ఉందని.. ఇతర ప్రాంతాల్లోనూ ఇదేతరహా పరిస్థితి రావాలని ఆకాంక్షించారు. ఎలక్ట్రిక్ వాహనాలు, గ్రీన్ ఎనర్జీ వినియోగాన్ని పెంచుతూ మరింత హరితవిధానాలను అనుసరిద్దామని చెప్పారు. రాష్ట్రంలోని ఐదు కోట్ల మంది బాధ్యత తీసుకుని మొక్కలు నాటి ఆంధ్రప్రదేశ్‌ను హరిత ప్రదేశ్‌గా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.

## స్వచ్ఛ చల్లపల్లి స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు

స్వచ్ఛ చల్లపల్లిని స్ఫూర్తిగాతీసుకుని రాష్ట్రవ్యాప్తంగా స్వచ్ఛతా కార్యక్రమాలను అమలుచేయాలని సీఎం పిలుపునిచ్చారు. చల్లపల్లిలో ప్రజల్లోస్వచ్ఛతపై చైతన్యం వచ్చి, అదిఅలవాటుగా మారడంతో పరిసరాల్లో చెత్త వేసే పరిస్థితి లేకుండా పోయిందని తెలిపారు. ఇదే తరహా స్వచ్ఛతా అలవాట్లు రాష్ట్రవ్యాప్తంగా రావా లని ఆకాంక్షించారు. ప్రతిఏటా అక్టోబరు 2న నెట్ జీరో, స్వచ్ఛతపై పనిచేసిన వ్యక్తులు,సంస్థలకు అవార్డులు అందించే కార్యక్రమాలను అన్ని ప్రాంతాల్లోనూ నిర్వహించాలని సూచించారు. స్వచ్ఛతా కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచినవారిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వపరంగా 22 విభాగాల్లో 130 రాష్ట్రస్థాయి అవార్డులు, 2,044 జిల్లా స్థాయి అవార్డులు అందిస్తున్నట్లు సీఎం తెలిపారు. స్వచ్ఛ మున్సిపాలిటీలు, స్వచ్ఛ గ్రామ పంచాయతీలు, పాఠశాలలు, ఆస్పత్రులు, బస్టాండ్లు, పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు.పారిశుధ్య కార్మికులు, గ్రీన్ అంబాసిడర్ల సేవలను కూడా గుర్తిస్తున్నామన్నారు. దేశవ్యాప్తంగా 12వేల మంది క్రీడాకారులు, రన్నర్లు స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి సంఘీభావం తెలపడం అభినందనీయమన్నారు.ఈ విధంగా స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సీఎం కోరారు. ప్రస్తుతం ఇస్తున్న స్వచ్ఛతా అవార్డులతోపాటు.. ప్రతి పాఠశాల, పంచాయతీ, మున్సిపాలిటీకి స్వచ్ఛత ర్యాంకులు ఇచ్చేలా కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. దీనిపై ప్రజాభిప్రాయాన్ని కూడా తీసుకుని మరింత మెరుగైన విధానాలు అమలు చేస్తామని చెప్పారు.

## స్వచ్ఛాంధ్ర అవార్డుల విజేతలు

స్వచ్ఛతా రంగంలో విశేషంగా సేవలందించిన స్వచ్ఛతా వారియర్లు, ఎన్జీవో సంస్థలకు సీఎం చంద్రబాబు స్వచ్ఛాంధ్ర-2026 అవార్డులు అందజేశారు. స్వచ్ఛ కాలనీలు, అసోసియేషన్లు, వివిధ సంస్థలకు కూడా అవార్డులను ప్రదానం చేశారు. హోటళ్ల కేటగిరీలో విశాఖ నోవోటెల్‌కు స్వచ్ఛతా అవార్డు లభించింది. ఇక పరిశుభ్రత పాటిస్తున్న వివిధరైతు బజార్లకు అవార్డులు ప్రకటించారు. విజయవాడ-పాయకాపురం, కర్నూలు-సీక్యాంప్, శ్రీకాకుళం-విల్లిస్ రైతు బజార్లకు స్వచ్ఛతా అవార్డులు అందాయి. తెనాలి, చిలకలూరిపేట, మంగళగిరి, పొన్నూరు, బొబ్బిలి, రాజాం, యలమంచిలి,పలమనేరు, గిద్దలూరు మున్సిపాలిటీలకు స్వచ్ఛతా అవార్డులు లభించాయి. కె.మూలపేట, రావులపాలెం, పత్తికొండ, దుప్పాడ, నంబూరు, ఆర్‌ఎల్ పురం గ్రామ పంచాయతీలకు స్వచ్ఛ గ్రామ పంచాయతీ కేటగిరీలో అవార్డులు దక్కాయి. పాఠశాలల కేటగిరీలో నిడమర్రు జడ్పీ హైస్కూల్, నెల్లూరులోని దేవిరెడ్డి శారదా హైస్కూల్, చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్‌లకు స్వచ్ఛతా అవార్డులు వచ్చాయి. ఆస్పత్రుల కేటగిరీలో పెందుర్తి,ఇబ్రహీం పట్నం, ఆస్పరి, కొనకనమిట్ల పీహెచ్‌సీలకు అవార్డులు లభించాయి. మంగళగిరి ఇందిరానగర్, తిరుపతి, చిన్నవాడ, విశాఖ యూపీహెచ్‌సీలకు కూడా స్వచ్ఛతా అవార్డులు అందాయి. చిత్తూరు ప్రభుత్వ బాలుర హాస్టల్‌కు స్వచ్ఛతా అవార్డు లభించింది. కడపలోని బీసీ బాలుర హాస్టల్, అనకాపల్లిలోని ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్‌కు అవార్డులు అందాయి.పల్నాడులోని అంబేద్కర్ గురుకులం, ఏలూరులోని బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, బాపట్ల బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలకు స్వచ్ఛతా అవార్డులుదక్కాయి.విశాఖ ద్వారకా నగర్ బస్టాండ్,చిత్తూరు ఎస్పీ కార్యాలయం, జీవీఎంసీ కార్యాలయం స్వచ్ఛతా అవార్డులను సాధించాయి. ఆలయాల కేటగిరీలో తిరుమల-తిరుపతి ఆలయం, విజయవాడ శ్రీదుర్గామల్లేశ్వరస్వామి ఆలయం, సింహాచలం శ్రీవరాహ లక్ష్మీ నరసింహస్వామి ఆలయాలకు స్వచ్ఛతా అవార్డులు అందించారు. వ్యర్థాల నిర్వహణలో అత్యుత్తమంగా పనిచేసిన స్టార్టప్‌లకు కూడా స్వచ్ఛతా అవార్డులను సీఎం చంద్రబాబు అందజేశారు.స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన ప్రదర్శనను ముఖ్యమంత్రి తిలకించారు. కార్యక్రమంలో పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి, వివిధశాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.















# హార్టికల్చర్ హబ్ ఏర్పాటుపై రాయలసీమ రైతులు, ప్రజల హర్షాతిరేకాలు

మదనపల్లె (చైతన్యరథం): రాయలసీమను దేశంలోనే ప్రముఖ ఉద్యాన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం ప్రతిపాదించిన 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్' సభ మదనపల్లెలో అత్యంత వైభవంగా జరిగింది. రాయలసీమలోని అన్ని జిల్లాల నుంచి వేలాదిగా తరలివచ్చిన రైతులు,ప్రజలతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. తమ ప్రాంత అభివృద్ధికి, వ్యవసాయ రంగాన్ని నిలబెట్టేందుకు రూ.లక్ష కోట్ల ప్రాజెక్టును కేటాయించడంపై రాయలసీమ రైతులు కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. హార్టికల్చర్ హబ్ ద్వారా ఉద్యాన పంటలకు మెరుగైన గిట్టుబాటు ధరలు లభిస్తాయని, దేశ, విదేశాలకు ఎగుమతి అవకాశాలు అందుబాటులోకి వస్తాయని రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. హార్టికల్చర్ రంగానికి ప్రభుత్వం ఇచ్చే ఈ భారీ ఊతం రాయలసీమ గ్రామీణ ప్రాంతాల స్వరూపాన్నే మార్చివేస్తుందని నిపుణులు, రైతు నాయకులు అభిప్రాయపడ్డారు. ప్రాసెసింగ్ యూనిట్లు, వాల్యూ ఎడిషన్ పరిశ్రమల ఏర్పాటుతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగడమే కాకుండా రైతుల తలసరి ఆదాయం గణనీయంగా పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

రెండు ప్రాజెక్టులకు శంకుస్థాపన అనంతరం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేష్, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మొక్కలు నాటారు. ఉద్యాన రంగానికి సంబంధించి ఏర్పాటుచేసిన స్టాళ్లను వారు సందర్శించి సంబంధిత అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు.














## సీమ రూపురేఖలు మార్చబోతున్న

# గ్లోబల్ హార్టికల్చర్ హబ్

- రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడమే హబ్ లక్ష్యం
- యువగళంలో రైతుల కష్టాలు చూశాకే హార్టికల్చర్ హబ్ ఆలోచన
- ఇతర రాష్ట్రాలకు కాదు... ఇతర దేశాలకు కావాల్సిన వెరైటీలు పండిద్దాం
- రాయలసీమ రైతు సత్తా ప్రపంచానికి తెలిసేలా చేద్దాం
- హార్టికల్చర్ హబ్-ఐఎస్ఏ శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్

మదనపల్లె (చైతన్యరథం): 'హైదరాబాద్‌లో ఐఎస్‌బీ తరహా మ్యాజిక్ ఇప్పుడు రాయలసీమలో జరగబోతోంది. ఇక్కడకు రాబోయే గ్లోబల్ హార్టికల్చర్ హబ్ (GHH)–ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ (ISA) వ్యవసాయరంగ రూపురేఖలు మార్చబోతోంది' అని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మదనపల్లెలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్–ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ శంకుస్థాపనకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లతో కలసి మంత్రి లోకేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... విత్తనం దగ్గర నుంచి ఉత్పాదకత, కోల్డ్ స్టోరేజ్, ప్యాకేజింగ్, యాంత్రీకరణ, జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్‌వరకు ఇక్కడ రీసెర్చ్ జరుగుతుంది. ఇక్కడ పండించిన పండ్ల ఉత్పత్తులను ఇతరదేశాలకు ఎగుమతిచేసినప్పుడే మన రైతులకు లాభం వస్తుంది. హార్టికల్చర్ హబ్ లక్ష్యం రైతుల ఆదాయం రెట్టింపు చేయడమే. మనం కేవలం ఇతర రాష్ట్రాలకు కావాల్సినవెరైటీలనే కాకుండా ఇతర దేశాలకు అవసరమైన రకాల పంటలు కూడా పండించాలి. అందుకు అనుగుణంగా మామిడి, అరటి, టమాటా,దానిమ్మ, ఖర్జూరం, డ్రాగన్ ఫ్రూట్, పుచ్చకాయ, నిమ్మ, స్వీట్ ఆరెంజ్, అవకాడో, ఆపిల్, బెర్రీస్ వంటి ప్రతి వెరైటీకి సంబంధించి రీసెర్చ్ జరగాలని మంత్రి లోకేష్ ఆకాంక్షించారు.

### పోరాటాల పుట్టినిల్లు మదనపల్లె

త్యాగానికి, పోరాటానికి పుట్టినిల్లు మదనపల్లె. స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో గాంధీజీ మదనపల్లె వచ్చారు. ఉమ్మడి చిత్తూరుజిల్లాలోనే అత్యధిక విరాళాలు ఇచ్చింది మదనపల్లె ప్రజలే. బ్రిటిష్‌వారి అరాచకానికి వ్యతిరేకంగా పోరాడి లాఠీ దెబ్బలు తిన్నది బీటీ కాలేజీ విద్యార్థులు. రవీంద్రనాథ్ ఠాగూర్ రాసిన జనగణమన గేయాన్ని బెంగాలీ నుంచి ఇంగ్లీషులోకి అనువదించింది బీటీ కాలేజీలోనే. జనగణమనకు ట్యూన్ కట్టింది కూడా మన బీటీ కాలేజీలోనే. ఎంతో గొప్ప చరిత్ర ఉన్న పుణ్యభూమి మదనపల్లె.

### రైతుల తరపున పోరాడిన గాంధీజీ

అక్టోబరు 2 గాంధీజీ పుట్టినరోజు. మనకు స్వాతంత్ర్యం, స్వేచ్ఛ ఇచ్చిన గొప్ప వ్యక్తికి నివాళులు అర్పిద్దాం. గాంధీజీ స్వాతంత్ర్యం కోసం చేసిన పోరాటాల గురించే మనం ఎక్కువ మాట్లాడతాం. కానీ ఆయన రైతుల కోసం చేసిన పోరాటాల గురించి మనం మాట్లాడం. చంపారన్ సత్యాగ్రహం, ఖేడా సత్యాగ్రహం, స్వదేశీ ఉద్యమం, గ్రామ స్వరాజ్యం.. ఇలా రైతుల తరపున అనేక పోరాటాలు చేశారు గాంధీజీ. రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని బలంగా నమ్మింది గాంధీజీ. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎలా బతకాలో ప్రజలకు నేర్పింది గాంధీజీ.

### యువగళంలోనే మిషన్ రాయలసీమ ఆలోచన

నేను యువగళం పాదయాత్ర ప్రారంభించిన గడ్డ రాయలసీమ గడ్డ. ఆనాడు గొడ్డలి పార్టీ వాళ్లు నా మైక్ లాక్కున్నారు, నా స్టూల్ లాక్కున్నారు, సోడా బాటిళ్లు, రాళ్లు, గుడ్లతో దాడి చేశారు. అయినా రాయలసీమలో 124 రోజులు, 44 అసెంబ్లీ నియోజకవర్గాలు, 1,587 కి.మీ. పాదయాత్ర చేశానంటే దానికి కారణం సీమ ప్రజలు నాపై చూపించిన ప్రేమ, అభిమానం. ప్రతిరోజూ రైతుల్ని కలిశాను, వాళ్లు పడుతున్న కష్టాలను నేరుగా చూశాను. మామిడి, అరటి, టమాటా, దానిమ్మ, ఖర్జూరం, డ్రాగన్‌ఫ్రూట్, పుచ్చకాయ, నిమ్మ, అవకాడో పండిస్తున్న అనేక మంది రైతులతో మాట్లాడాను. వారి నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్నాను. యువగళం పాదయాత్ర 119వ రోజైన 2023 జూన్ 7న కడపలో 'మిషన్ రాయలసీమ' ప్రకటించాను.

### హార్టికల్చర్ హబ్ కల నిజం కాబోతోంది

అందులో ప్రధానమైనది రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మార్చడం. విత్తనం దగ్గర నుంచి ప్రపంచానికి కావాల్సిన వెరైటీలను మనం పండించడమే మిషన్ రాయలసీమ లక్ష్యం. రైతుల ఆదాయం పెంచాలన్న అజెండాతో ఆనాడు మిషన్ రాయలసీమ ప్రకటించాను. ఇప్పుడు మన గౌరవ ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో హార్టికల్చర్ హబ్ కల నిజం కాబోతోంది. ఒక రైతు కుటుంబంలో పుట్టిన చంద్రబాబుకి రైతుకష్టం తెలుసు. ఇప్పుడు అందరం డ్రిప్ ఇరిగేషన్ గురించి మాట్లాడుతున్నాం. నీటి విలువ తెలిసిన వ్యక్తి మన చంద్రబాబు. అందుకే 1997లోనే సీమకు ఇజ్రాయెల్ డ్రిప్ ఇరిగేషన్ పరిచయంచేశారు. ఆ బిందు సేద్యమే కరువు నేలను బంగారు భూమిగా మార్చింది. సబ్సిడీలో డ్రిప్ ఇరిగేషన్ అందించిన వ్యక్తి చంద్రబాబు.

### అందుకే చంద్రబాబు వాటర్ మ్యాన్!

మొన్న ఒక ఇంగ్లీష్ పేపర్లో చంద్రబాబు గురించి వాటర్ మ్యాన్ అని రాశారు. అది చూసి గొడ్డలి పార్టీ వాళ్లు ఏడుస్తున్నారు. నేను వాళ్లని మూడు ప్రశ్నలు అడగాలి అనుకుంటున్నా. సీమ రైతుకి వరంలాంటి డ్రిప్ ఇరిగేషన్ సబ్సిడీ ఎత్తేసింది ఎవరు? పట్టిసీమ ప్రాజెక్టుతో ఎటువంటి ఉపయోగం లేదన్నది ఎవరు? పోలవరం ప్రాజెక్టు అర్థం కాలేదు–మీకు ఏం అర్థమవుతుంది అన్నది ఎవరు? గొడ్డలి పార్టీ కాదా? నీటిని దేవుడిలా–ఇరిగేషన్ ప్రాజెక్టులను దేవాలయంలా భావించేది చంద్రబాబు. సీమ ప్రాజెక్టులను ప్రారంభించింది మనమే, పూర్తి చేయబోయేదీ మనమే. తెలుగు గంగ, ఎస్ఆర్బీసీ, హంద్రీ–నీవా, గాలేరు–నగరి, వెలిగొండ, పోలవరం మన ట్రేడ్ మార్క్. ఈ ప్రాజెక్టుల వల్లే రాయలసీమ అరటి వరల్డ్ ఫేమస్ అయ్యింది. ఈ ప్రాజెక్టుల వల్లే కరువు నేలపై కియా కార్లను మనం తయారు చేస్తున్నాం. అందుకే ఆయన్ని అందరూ వాటర్ మ్యాన్ అంటున్నారు.

### బాబు ముందుచూపునకు నిదర్శనం ఐఎస్‌బీ

హార్టికల్చర్ అయినా, క్వాంటం అయినా చంద్రబాబు ముందుంటారు. మనం ఈ రోజు గురించి ఆలోచిస్తే... చంద్రబాబు వచ్చే 20 ఏళ్ల గురించి ఆలోచిస్తారు. దానికి ఒక ఉదాహరణే–ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్. దేశంలో ఉన్న గొప్ప పారిశ్రామికవేత్తలు అందరూ కలిసి వరల్డ్ క్లాస్ బిజినెస్ స్కూల్ పెట్టాలి అనుకున్నారు. ఆ విషయం బాబుకి తెలిసింది. వాళ్లు దేశం మొత్తం తిరుగుతున్నారు. హైదరాబాద్ రావాలనే ఆలోచనలో అసలు లేరు. కానీ ఐఎస్బీని ఏపీకి తీసుకురావాలని ఆయన ఫిక్స్ అయ్యారు. ఐఎస్బీ బోర్డుని అప్రోచ్ కాగా, వాళ్లు ఏపీ అసలు మా కన్సిడరేషన్‌లోనే లేదన్నారు. అప్పుడు చంద్రబాబు వాళ్లని ఒకసారి హైదరాబాద్ రమ్మని ఆహ్వానించారు. సీఎం, మంత్రులు ఎయిర్‌పోర్టుకి వెళ్లి ఆహ్వానం పలికారు. స్వయంగా సీఎం ప్రజెంటేషన్ ఇచ్చారు. ముంబయి, హైదరాబాద్, చెన్నై, కర్ణాటక అన్నిచోట్లకీ వాళ్లు వెళ్లారు. ఫైనల్‌గా హైదరాబాద్‌నే సెలెక్ట్ చేసుకున్నారు. దటీజ్ బ్రాండ్ సీబీఎన్. ఇప్పుడు ఐఎస్బీ ప్రపంచంలోనే వన్ ఆఫ్ ది బెస్ట్ బిజినెస్ స్కూల్.

### చంద్రబాబుతో అంబానీలది మూడు తరాల అనుబంధం

'చంద్రబాబుకి, అంబానీ కుటుంబానికి మధ్య ఉన్న సంబంధం మూడు దశాబ్దాల నాటిది. ధీరూభాయ్ అంబానీతో ఆయనకున్న అనేక పరిచయాల నుంచి, ముఖేష్ అంబానీతో ఉన్న బంధం వరకు, ఇప్పుడది తర్వాతి తరంతో కొత్త భాగస్వామ్యంగా ఎదిగింది. ఐఎస్బీ వ్యాపార రంగానికి ప్రపంచ స్థాయి సంస్థగా ఎలా మారిందో, మీ నాయకత్వంలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ మన రైతుల కోసం ప్రపంచ స్థాయి సంస్థగా మారుతుంది. ఈ సంస్థను నిర్మించడానికి మీరు ఇచ్చిన కట్టుబాటుకు, అంతకంటే ముఖ్యంగా ఆంధ్రా రైతుల సామర్థ్యంపై మీరు ఉంచిన నమ్మకానికి నేను ధన్యవాదాలు తెలుపుతున్నాను. రాయలసీమ రైతును ఆంధ్రప్రదేశ్ పొలాల నుంచి ప్రపంచ మార్కెట్లకు తీసుకెళ్దాం. రాయలసీమ రైతు సత్తా ప్రపంచానికి తెలిసేలా చేద్దాం' అని మంత్రి లోకేష్ పిలుపునిచ్చారు.



చైతన్యరథం




# దేశంలో ఏపీని నెం.1గా నిలపడమే మా లక్ష్యం






- ఇందుకు మీ అందరి సహకారం కావాలి
- దశాబ్ద కాలంలోనే భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చగలం
- ఈ మార్పునకు ఏపీ నాయకత్వం వహించాలని కోరుకుంటోంది
- దేశం గర్వపడేలా రాజధాని అమరావతిని తీర్చిదిద్దుతాం
- విజయవాడలో పాన్-ఐఐటీ కాన్ఫరెన్స్ టీమ్ డిన్నర్ మీటింగ్‌లో మంత్రి లోకేష్

విజయవాడ(చైతన్యరథం): దేశంలో ఏపీని నెం.1 గా నిలపడమే తమ లక్ష్యమని, ఇందుకు మీ అందరి సహకారం కావాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.విజయవాడ నోవాటెల్ హోటల్‌లో పాన్-ఐఐటీ కాన్ఫరెన్స్ టీమ్‌తో జరిగిన డిన్నర్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... 'సీఎం చంద్రబాబు గురించి మీ అందరికీ తెలుసు. ఆపరేటింగ్ సిస్టమ్‌లు ఒక్కో వెర్షన్‌తో మరింత మెరుగుపడుతుంటాయి. అదే విధంగా మన ముఖ్యమంత్రి కూడా ప్రతి వెర్షన్‌తో మరింత మెరుగవుతున్నారు. ఇది ఆయన నాలుగో వెర్షన్. ప్రజా ప్రభుత్వంలో 50శాతం మంది శాసన సభ్యులు తొలిసారి ఎన్నికైనవారే. 25మంది మంత్రుల్లో 17మంది తొలిసారి మంత్రులుగా బాధ్యతలు చేపట్టారు. నేను ఇప్పుడుసీనియర్ మంత్రిని. రాష్ట్రాభివృద్ధి కోసం మేమంతా కసితో, పట్టుదలతో పనిచేస్తున్నాం.' అన్నారు.

### ఏపీలో అందరం కలిసి నూతన చరిత్రను సృష్టిస్తున్నాం

ఈ రోజు సీఎం చంద్రబాబు... కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, అనంత్ అంబానీలతో కలిసి ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్, హార్టికల్చర్ మిషన్‌ను ప్రారంభించారు. ఈ మిషన్‌లో ప్రభుత్వ, ప్రైవేట్ రంగం కలిసి దాదాపు 10 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టనున్నాయి. ప్రపంచంలోనే ఉద్యాన వన రంగంలో భారత్‌ను నెం.1 స్థానానికి తీసుకెళ్లడమే ఈమిషన్ లక్ష్యం. ఏపీలో హార్టికల్చర్ నుంచి స్పేస్ వరకు, డ్రోన్ల నుంచి క్వాంటమ్ టెక్నాలజీ వరకు, డేటా సెంటర్ల వరకు ఎన్నో రంగాల్లో ముందుకు సాగుతున్నాం. ఏపీలో మనం నూతన చరిత్రను సృష్టిస్తున్నాం. అంతా కలిసి మన లక్ష్యాలను కార్యరూపంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది.

### దశాబ్ద కాలంలోనే భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చగలం

ఏపీ మీకు ఒక అద్భుతమైన వేదిక అందిస్తోంది. ఇక్కడ కొత్త ఆలోచనలు, కొత్త విధానాలతో వాటికి ఒక బెంచ్ మార్క్ సృష్టించాలనుకుంటున్నాం. పోటీతో కూడిన సమాఖ్య వ్యవస్థలో ఒక రాష్ట్రం ఒక మంచి పనిచేస్తే, మిగతా రాష్ట్రాలు కూడా దానిని అనుసరిస్తాయి. అందువల్ల ఏపీ మార్గదర్శకంగా నిలవగలదని విశ్వసిస్తున్నా. యూరప్, అమెరికా అభివృద్ధి చెందిన దేశాలుగా మారడానికి 100 నుంచి 120 సంవత్సరాలు పట్టింది. దుబాయ్‌కు సుమారు 30 నుంచి 35 సంవత్సరాలు పట్టింది. సింగపూర్ కేవలం 25 సంవత్సరాల్లో అభివృద్ధి చెందిన దేశంగా ఎదిగింది. ఇక్కడ ఉన్న మేధోశక్తి, ప్రతిభ, సంకల్పం, సానుకూల నాయకత్వాన్ని గమనిస్తే... భారత్‌ను కేవలం 10 సంవత్సరాల్లో అభివృద్ధి చెందిన దేశంగా మార్చగలమని నేను నమ్ముతున్నా. ఒక దశాబ్దంలోనే మనం అభివృద్ధి చెందిన దేశంగా మారగలం. ఒక రాష్ట్రంగా ఏపీ ఈ మార్పునకు నాయకత్వం వహించాలని భావిస్తోంది.

### దేశం గర్వపడేలా రాజధాని అమరావతిని తీర్చిదిద్దుతాం

దేశంలో 'నమో' అంటే ప్రధాని నరేంద్ర మోదీ. ఏపీలో 'నమో' అంటే నాయుడు జీ, మోదీ జీ కా జోడీ. ఇతరరాష్ట్రాల్లో డబుల్ ఇంజిన్ సర్కార్ ఉంటే.. ఏపీలో మాత్రం డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ ఉంది. మనం పనిచేసే వేగం అలాంటిది. దేశంలో ఏపీ నెం.1గా నిలవాలనేదే మా లక్ష్యం. ఇందుకు మీ అందరి సహకారం కావాలి. మీ సూచనలు, ఆలోచనలు వినడానికి మేం ఎంతో ఆసక్తిగా ఉన్నాం. మేం నేర్చుకోవడానికి సిద్ధంగా ఉన్నాం. ఇక్కడికి వచ్చిన మీ అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. మీరు ప్రస్తుతం విజయవాడలో ఉన్నారు.నది అవతలే అమరావతి ఉంది. మీకు సమయం ఉంటే తప్పకుండా అక్కడికి వచ్చి చూడాలి. మనం షాంఘై, బీజింగ్, సింగపూర్ వంటి నగరాల గురించి మాట్లాడతాం. మన ముఖ్యమంత్రి నాయకత్వంలో దేశం, ప్రపంచం మొత్తం అమరావతి గురించి మాట్లాడే రోజువస్తుంది. ప్రపంచ స్థాయి రాజధాని నగరాన్ని నిర్మించాలనేది మా లక్ష్యం. దేశం గర్వపడేలా అమరావతిని తీర్చిదిద్దుతాం. ఒక్కసారి అమరావతిలో జరుగుతున్న అభివృద్ధిని చూస్తే.. ముఖ్యమంత్రి విజన్ ఏంటో స్పష్టంగా అర్థమవుతుందని మంత్రి చెప్పారు.

కార్యక్రమంలో పాన్-ఐఐటీ చైర్మన్ ప్రభాత్ సింగ్‌తోపాటు పాన్-ఐఐటీ సభ్యులు, దేశవ్యాప్తంగా ఉన్న ఐఐటీల డైరెక్టర్లు, పూర్వ విద్యార్థులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.










# నాటి యువగళం హామీ... నేడు నెరవేరింది ఇలా

- పాదయాత్రలో రైతుల కష్టాలు చూసి అండగా నిలుస్తానని హామీ ఇచ్చిన లోకేష్
- కడప వేదికగా నాడు మిషన్ రాయలసీమ ప్రకటన
- మదనపల్లెలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు శ్రీకారం
- ప్రపంచానికి 'ఫ్రూట్ బౌల్'గా మారబోతున్న ఆంధ్రప్రదేశ్









అమరావతి (చైతన్యరథం): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలో మరే ఇతర నాయకుడూ చేయని విధంగా యువ నేత నారా లోకేష్ రాయలసీమలో 124 రోజులు, 44 అసెంబ్లీ నియోజకవర్గాలు, 1,587 కి.మీ. మేర పాదయాత్ర చేసి రికార్డు సృష్టించారు. అ సమయంలో లక్షలాది మంది రాయలసీమ రైతులను నేరుగా కలిసి వారు పడుతున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా చూసి చలించిపోయారు. కష్టాలు చూశాను... కన్నీళ్లు తుడుస్తానని ఆనాడు సీమ రైతాంగానికి ఆయన భరోసా ఇచ్చారు. పాదయాత్ర 119వ రోజున 2023 జూన్ 7న కడప వేదికగా 'మిషన్ రాయలసీమ'ను ప్రకటించారు. హార్టీకల్చర్ హబ్‌గా రాయలసీమను మారుస్తామని, సీమ సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేసి ప్రతి ఎకరాకూ సాగునీరు అందిస్తామని చెప్పారు. మామిడి, బొప్పాయి, దానిమ్మ, చీనీ, అరటి తదితర పంటలు వేసేందుకు ప్రోత్సాహం కల్పిస్తామని, 90శాతం సబ్సిడీతో డ్రిప్ ఇరిగేషన్ అందిస్తామని తెలిపారు. దేశానికి, అంతర్జాతీయ స్థాయిలో ఎక్స్‌పోర్ట్ చేసే విధంగా కొత్త రకం విత్తనాలు, మొక్కలు సృష్టించేందుకు హార్టికల్చర్ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేస్తానని ఆనాడు ప్రకటించారు. ఏపీని సీడ్ హబ్‌గా మార్చడం ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామన్నారు. రాయలసీమలో ఫుడ్ ప్రాసెసింగ్, పల్పింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తామని నాడు రైతులకు హామీ ఇచ్చారు.

యువగళం పాదయాత్ర సందర్భంగా ఆనాడు రాయలసీమ రైతాంగానికి యువ నేత లోకేష్ ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం ఈరోజుసాకారం చేసింది. ఉమ్మడి ప్రకాశం సహా రాయలసీమలో రూ.లక్ష కోట్ల పెట్టుబడి ప్రణాళికతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్-GHHకు శ్రీకారం చుట్టింది. గ్లోబల్ హార్టికల్చర్ హబ్ అభివృద్ధి కోసం రాబోయే మూడేళ్లలో ప్రభుత్వం రూ.40,352 కోట్లు వెచ్చిస్తుంది. ప్రైవేట్ రంగం నుంచి రూ.60వేల కోట్లు పెట్టుబడులు రాబట్టేలా ప్రణాళికలు రూపొందించారు. సీడ్ టు షిప్‌మెంట్ విధానంలో ఉద్యాన రైతులకు అండగా నిలిచేలా ప్రతిష్టాత్మక GHHకు రూపకల్పన చేశారు. ఇందులో భాగంగా ఉద్యాన రైతులకు మేలు కలిగేలా పెద్ద ఎత్తున సాగునీరు, డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనులను ప్రభుత్వం చేపడుతుంది. రహదారులు, లాజిస్టిక్స్ అభివృద్ధి పనులకూ GHHలో ప్రాధాన్యత ఇస్తారు.

వ్యవసాయ, ఉద్యాన, ఆర్థిక, ఇరిగేషన్ సహా వివిధ కీలక శాఖలతో వరుస సమీక్షలతో పాటు ముఖ్యమంత్రి కేంద్రంతో నిరంతరం సంప్రదింపులు జరిపారు. రాయలసీమ పరిస్థితులను అర్థం చేసుకుని గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు నిధులు సమకూర్చేందుకు కేంద్రం అంగీకారం తెలిపింది. దీనిద్వారా ఉద్యాన సాగు విస్తరణ, పంట దిగుబడి మొదలుకుని ఎగు మతుల వరకు జరిగే వివిధ ప్రక్రియలను బలోపేతం చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ద్వారా రాయలసీమ దేశానికే కాక ప్రపంచానికే "ఫ్రూట్ బౌల్"గా మారుతుంది. ఉద్యానవన రంగం రైతుల ఆదాయాన్ని పెంచడం, గ్రామీణ ఉపాధిని సృష్టించడం, స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాలను సాధించ డంలో కీలక చోదక శక్తిగా నిలుస్తుంది. ఒకప్పుడు కరువుకు పర్యాయపదంగా ఉన్న రాయలసీమ... మామిడి, అరటి, టమాటా, దానిమ్మ, ఖర్జూరం, డ్రాగన్‌ఫ్రూట్, పుచ్చకాయ, నిమ్మ, స్వీట్ ఆరెంజ్, అవకాడో, ఆపిల్, బెర్రీస్ వంటి ఉద్యాన పంటల్లో దేశంలోనే అగ్రగామిగా నిలవబోతోంది.

## మహనీయుల బాటలో దేశాభివృద్ధికి కృషి చేద్దాం

**గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రిలకు నివాళులర్పించిన సీఎం**




అమరావతి (చైతన్యరథం): 'సత్యం, అహింస, స్వచ్ఛత, గ్రామ స్వరాజ్యం వంటి గాంధీజీ ఆశయాలు నేటికీ మనకు మార్గదర్శకం. దేశ స్వాతంత్ర్యం కోసం ఆయన చేసిన త్యాగాలు, ప్రజలను ఏకం చేసి నడిపించిన తీరు చిరస్మరణీయం. గాంధీజీ కలలుగన్న స్వచ్ఛమైన, స్వావలంబనతో కూడిన, పేదరికం లేని సమాజం కోసం ప్రతి ఒక్కరం పనిచేద్దాం. భారతదేశ నిర్మాణంలో భాగంగా వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర కోసం గాంధీజీ చూపిన బాటలో నడుద్దాం. నిరాడంబరతకు ప్రతిరూపం, దేశభక్తి, నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం లాల్ బహుదూర్ శాస్త్రి. దేశ రక్షణలో సైనికుల పాత్రను, దేశ ఆహార భద్రతలో రైతుల పాత్రను గుర్తించి ఆయన ఇచ్చిన 'జై జవాన్-జై కిసాన్' నినాదం దేశ ప్రజల్లో ఎప్పటికీ స్ఫూర్తి రగిలిస్తూనే ఉంటుంది. కష్టకాలంలోనూ దేశ ప్రయోజనాలకే ప్రాధాన్యతనిస్తూ లాల్ బహుదూర్ శాస్త్రి చూపిన నాయకత్వం, కర్తవ్యనిష్ఠ మనందరికీ ఆదర్శం. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని దేశ అభివృద్ధికి అంకితభావంతో పనిచేద్దాం' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు. భారత జాతిపిత మహాత్మా గాంధీ 157వ జయంతి, మాజీ ప్రధాని లాల్ బహుదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో వారి చిత్రపటాలకు చంద్రబాబు పుష్పమాలలు వేసి నివాళు లర్పించారు.

## రాయలసీమను 'రతనాల సీమ'గా మారుస్తాం

**కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్**



మదనపల్లె (చైతన్యరథం): కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రైతులకు పంట సాగుకు కావలసిన పెట్టుబడి సాయాన్ని సకాలంలో అందిస్తున్నామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. మదనపల్లెలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ శంకుస్థాపన సభలో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. రాయలసీమ ప్రాంతాన్ని ఉద్యాన అభివృద్ధి ద్వారా 'రతనాల సీమ'గా మారుస్తామని వెల్లడించారు. రైతులకు ఎరువుల కొరత లేకుండా కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందన్నారు. మార్కెట్‌లో యూరియా ఒక్కో బ్యాగ్‌కు రూ.300 కంటే ఎక్కువ వసూలు చేయవద్దని గట్టి ఆదేశాలు జారీ చేశామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గోవర్ధన్ స్కీమ్ ద్వారా బయో గ్యాస్ ఉత్పాదక వ్యవస్థలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ప్రకృతి వైపరీత్యాలు, అకాల వర్షాల వల్ల రైతులకు ఎలాంటి పంట నష్టం వాటిల్లకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం కిసాన్ ఇన్సూరెన్స్ స్కీమ్‌ను అమల్లోకి తెచ్చిందని స్పష్టం చేశారు. వ్యవసాయ రంగానికి పునరుత్పాదక ఇంధనాన్ని అనుసంధానిస్తూ 'సూర్య ఘర్ యోజన', 'పీఎం కుసుమ్ యోజన' ద్వారా సోలార్ పంపు సెట్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వీటి ద్వారా రైతులకు ఉచిత విద్యుత్ పంపిణీకి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్మలా సీతారామన్ చెప్పారు.

'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో

## 'స్వచ్ఛ పాఠశాల'

**విద్యార్థులకు మంత్రి లోకేష్ అభినందనలు**

మంగళగిరి (చైతన్యరథం): 'మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో స్వచ్ఛ పాఠశాల కార్యక్రమం కింద 170 పాఠశాలల్లోని 35వేల మంది విద్యార్థులు పాల్గొని దాదాపు 75వేల కిలోల పొడి చెత్త సేకరించారు. ఇది 'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో నమోదైంది. రికార్డు సాధనకు కృషి చేసిన అందరికీ శుభాభినందనలు. విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛత, శ్రమదానంపై అవగాహన కల్పించేందుకు ఒక యజ్ఞంలా అంతా కలిసి చేపట్టిన ఈ 'స్వచ్ఛ పాఠశాల' కార్యక్రమం నిరంతరం కొనసాగాలని ఆకాంక్షిస్తున్నాను.' అంటూ రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్,సామాజిక మాధ్యమం వేదికగా పేర్కొన్నారు.

## మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రిలకు మంత్రి లోకేష్ నివాళి

అమరావతి (చైతన్యరథం): 'మన దేశ స్వేచ్ఛా స్వాతంత్ర్యం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ధన్యజీవి బాపూజీ. ఆయన చూపిన శాంతి, సహన, సత్య మార్గంలో పయనిద్దాం. గాంధీజీ కలలుగన్న సమానత్వం, గ్రామ స్వరాజ్యం, స్వావలంబన, స్వచ్ఛత సాధించి, ఆ మహాత్ముని ఆశయాల సాకారానికి కృషి చేద్దాం.' అంటూ గాంధీ జయంతి సందర్భంగా రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ నివాళి అర్పించారు. 'జై జవాన్-జై కిసాన్' నినాదంతో ప్రజల్లో స్ఫూర్తి నింపారు స్వాతంత్ర్య సమర యోధులు, మాజీ ప్రధాని లాల్ బహ దూర్ శాస్త్రి. నిరాడంబరతకు మారు పేరుగా నిలిచారు. దేశానికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయం అని శాస్త్రీజీ జయంతి సందర్భంగా ఆ మహనీయుని చిత్రపటానికి మంత్రి లోకేష్ పుష్పాంజలి ఘటించారు.






# రాయలసీమను నీటి సంరక్షణ రీజియన్‌గా తీర్చిదిద్దుతాం

## ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్



మదనపల్లె (చైతన్యరథం): రాయలసీమ రైతులకు శ్రమించే తత్వంతో పాటు అపారమైన పట్టుదల ఎక్కువ అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కొనియాడారు. మదనపల్లెలో 'రాయలసీమ హార్టికల్చర్ హబ్'కు శంకుస్థాపన సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఒకప్పుడు కరువు పీడిత ప్రాంతంగా ఉన్న రాయలసీమ నేడు వేగంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు. రాయలసీమ ఉద్యాన హబ్ ద్వారా ఉద్యాన సాగులో సరికొత్త అవకాశాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. రాయలసీమ ను భవిష్యత్తులో పూర్తిస్థాయి నీటి సంరక్షణ రీజియన్‌గా మార్చుతామని హామీ ఇచ్చారు. నీటి సంరక్షణ చర్యలతో రాయలసీమలో భూగర్భ జలమట్టాలు సగటున 3.6 మీటర్ల మేర పెరిగాయని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన 'పల్లె పండుగ' ద్వారా రాయలసీమ వ్యాప్తంగా గత రెండేళ్ల వ్యవధిలోనే రూ.8 వేల కోట్లకు పైగా అభివృద్ధి పనులు పూర్తి చేశామని స్పష్టం చేశారు. సీమ ప్రాంతం నుంచి రికార్డు స్థాయిలో పంట ఉత్పత్తులను మార్కెట్‌కు తీసుకెళ్లేలా రైతులకు ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని పవన్ కల్యాణ్ పునరుద్ఘాటించారు.






















# హార్టికల్చర్ హబ్‌గా రాయలసీమ మంత్రి సవిత

- రూ.లక్ష కోట్లతో ఉద్యానవన రంగ అభివృద్ధికి ప్రణాళిక
- ఆధునిక యంత్ర పరికరాలతో రైతులకు సాగు ఖర్చులు తగ్గించేలా చర్యలు
- పుట్టపర్తిలో సీహెచ్‌సీ ప్రారంభ కార్యక్రమంలో మంత్రి సవిత




పుట్టపర్తి (చైతన్యరథం): విజన్ 2047లో భాగంగా రాయలసీమ ప్రాంతాన్ని సమగ్ర హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతోందని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత పేర్కొన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని సాయిరామంలో శుక్రవారం నిర్వహించిన కస్టమ్ హైరింగ్ సెంటర్ (సీహెచ్‌సీ) ప్రారంభ కార్యక్రమంలో సహచర మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డితో కలిసి మంత్రి సవిత పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ ఆశీస్సులతో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్‌తో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందన్నారు. వ్యవసాయ రంగాన్ని ఆధునిక సాంకేతికతతో అనుసంధానం చేసి రైతులకు అవసరమైన యంత్ర పరికరాలను అందుబాటులోకి తీసుకురావడమే కస్టమ్ హైరింగ్ సెంటర్ల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. రైతులు ఖరీదైన వ్యవసాయ యంత్రాలను వ్యక్తిగతంగా కొనుగోలు చేయాల్సిన అవసరం లేకుండా, ఈ కేంద్రాల ద్వారా అవసరమైన పరికరాలను అద్దె ప్రాతిపదికన వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. దీనివల్ల సాగు ఖర్చులు తగ్గడంతో పాటు సమయం ఆదా అవుతుందని, వ్యవసాయ పనులు సులభతరం అవుతాయని వివరించారు.

రాయలసీమ ప్రాంతం ఒకప్పుడు కరువు, వెనుకబాటుతనంతో ఇబ్బందులు ఎదుర్కొందని, ప్రస్తుతం సాగునీటి ప్రాజెక్టులు, పారిశ్రామిక అభివృద్ధి, ఉద్యానవన రంగాల విస్తరణతో అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందని మంత్రి తెలిపారు. హంద్రీ-నీవా సుజల స్రవంతి, వెలుగొండ వంటి ప్రాజెక్టులతో పాటు కుప్పం, మడకశిర వంటి ప్రాంతాలకు సైతం సాగునీరు అందించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. విజన్ 2047లో భాగంగా సుమారు రూ.లక్ష కోట్ల అంచనా వ్యయంతో రాయలసీమను సమగ్ర హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. ఇందులో సుమారు రూ.20 వేల కోట్లు సాగునీటి ప్రాజెక్టులకు, రూ.5,500 కోట్లు గ్రామీణ రహదారుల అభివృద్ధికి కేటాయించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వివరించారు. శ్రీసత్యసాయి జిల్లాలో సైతం సుమారు రూ.1,600 కోట్లతో ఉద్యానవన రంగ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

రాయలసీమలో మామిడి, దానిమ్మ, డ్రాగన్ ఫ్రూట్‌తో పాటు వివిధ రకాల ఉద్యాన పంటలు, పూల సాగును ప్రోత్సహిస్తున్నామని మంత్రి తెలిపారు. రైతులు సమూహాలుగా ఏర్పడి ఫార్మ్ పాండ్స్ ఏర్పాటు చేసుకుంటే 75 శాతం వరకు, వ్యక్తిగతంగా ఏర్పాటు చేసుకుంటే 50 శాతం వరకు సబ్సిడీ అందించే విధానం అమల్లో ఉందన్నారు. అదేవిధంగా కోల్డ్ స్టోరేజీలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, రవాణా వాహనాలకు సబ్సిడీలు కల్పించడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తులకు ఎగుమతి అవకాశాలు మెరుగుపరచడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. వ్యవసాయ రంగంలో ఆధునిక యంత్ర పరికరాల వినియోగం, ఉద్యానవన పంటల విస్తరణ, ప్రాసెసింగ్, మార్కెటింగ్, ఎగుమతులను ప్రోత్సహించడం ద్వారా రైతులకు మెరుగైన ఆదాయ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సవిత పేర్కొన్నారు. కస్టమ్ హైరింగ్ సెంటర్లు రైతులకు అందుబాటులోకి రావడం ద్వారా వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ మరింత విస్తరించి, రైతులకు ప్రయోజనం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎక్స్‌లో మొదటిస్థానంలో 'రాయలసీమ విజయీభవ'!

*'రాయలసీమ విజయీభవ' ఎక్స్‌లో మొదటి స్థానంలో ట్రెండింగ్ అయింది. రాయలసీమ చరిత్రలో శుక్రవారం ఒక సువర్ణ అధ్యాయం. కరవు సీమను సిరుల సీమగా మార్చే రూ.లక్ష కోట్ల గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు సీఎం చంద్రబాబు, కేంద్ర ఆర్థిశాఖ మంత్రి నిర్మలా సీతారాం, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్, రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ మదనపల్లెలో శ్రీకారం చుట్టారు. రైతుల భవిష్యత్‌కు అండగా నిలిచే ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ప్రతి పొలంలో పంట...ప్రతి పంటకూ ధర....ప్రతి రైతుకూ ఆదాయం...ప్రతి ఊళ్ళో సంపద...ఇదే రాయలసీమ రైజింగ్ లక్ష్యం. ఈ నేపథ్యంలో 'రాయలసీమ విజయీభవ' హ్యాష్ ట్యాగ్ ఎక్స్‌లో మొదటిస్థానంలో ట్రెండింగ్ కావటం విశేషం.*




## హాస్టల్స్ డైట్ చార్జీల పెంపు హర్షణీయం

**- పేద విద్యార్థులకు మరింత నాణ్యమైన భోజనం అందించడమే ప్రభుత్వ లక్ష్యం**

**- మంత్రి గుమ్మిడి సంధ్యారాణి**



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలోని గిరిజన, సాంఘిక, వెనుకబడిన తరగతులు, మైనారిటీ సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో విద్యార్థులకు అందిస్తున్న డైట్ చార్జీలను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై రాష్ట్ర గిరిజన సంక్షేమ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి గుమ్మిడి సంధ్యారాణి హర్షం వ్యక్తం చేశారు. డైట్ చార్జీల పెంపుతో సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో చదువుతున్న పేద విద్యార్థులకు మరింత నాణ్యమైన, పౌష్టికాహారం అందించేందుకు అవకాశం కలుగుతుందని మంత్రి తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం, చదువు, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకున్న ఈ నిర్ణయానికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

పేద, వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని మంత్రి సంధ్యారాణి పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, మెరుగైన వసతులు, విద్యా సౌకర్యాలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

**కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా సంక్షేమ హాస్టళ్లు**

సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దేందుకు మంత్రి నారా లోకేష్ చేస్తున్న కృషి అభినందనీయమని మంత్రి సంధ్యారాణి అన్నారు. విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాలు, నాణ్యమైన విద్య, క్రీడా సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా చర్యలు చేపడుతోందని తెలిపారు.

**విద్యార్థుల భవిష్యత్తే ప్రాధాన్యం**

పేద విద్యార్థుల మౌలిక సదుపాయాలు, విద్య, క్రీడలు, ఆరోగ్యం, సమగ్ర అభివృద్ధి కోసం అవసరమైన నిధులను ఖర్చు చేసేందుకు ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ వెనుకాడదని మంత్రి స్పష్టం చేశారు. విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించి, వారు ఉన్నత స్థాయికి ఎదిగేలా అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు.

# రైతును దగా చేసి ఇప్పుడు నీతులా జగన్?

- గొడ్డలి పార్టీ హయాంలో కుంటుపడిన వ్యవసాయ రంగం
- డ్రిప్ ఇరిగేషన్ రద్దు చేసి రైతులకు జగన్ ద్రోహం
- సాగునీటి ప్రాజెక్టులను విధ్వంసం చేసిన జగన్
- మాజీ మంత్రి నిమ్మకాయల చినరాజప్ప



అమరావతి (చైతన్యరథం): రైతులను రాజును చేసేందుకు సీఎం చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తుంటే గొడ్డలి పార్టీ నిత్యం విషం చిమ్మడమే పనిగా పెట్టుకుందని మాజీ మంత్రి, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప మండిపడ్డారు. అబద్ధాలు, అసత్యాలు చెప్పడం, వాటినే ప్రచారం చేయడం గొడ్డలి పార్టీ నైజమని ధ్వజమెత్తారు. రాయలసీమ రైతులకు ఉపయోగపడే డ్రిప్ ఇరిగేషన్‌ను ఐదేళ్లు అమలు చేయకుండా రద్దు చేసిందే జగన్. నేడు రాయలసీమ హార్టికల్చర్ హబ్‌పై మాట్లాడటం సిగ్గుచేటు. ఐదేళ్ల పాలనలో రైతుల ఆత్మహత్యల్లో దేశంలోనే ఏపీని 3వ స్థానంలో నిలబెట్టిన చరిత్ర జగన్‌ది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ను సీఎం చంద్రబాబు ప్రారంభిస్తే... వైఎస్ఆర్ ప్రారంభించినట్టు వైసీపీ నాయకుడు కన్నబాబు వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు. చంద్రబాబు ను తిట్టిన వాళ్లందరికి జగన్ మంత్రి పదవులు ఇచ్చారు. ఆ కోవలో మంత్రి పదవి తెచ్చుకొని... మూడేళ్ల పాటు మంత్రిగా పనిచేసిన కురసాల కన్నబాబు వ్యవసాయ శాఖను భ్రష్టుపట్టించాడు. ఇంత తెలివితక్కువ వాళ్లు గొడ్డలి పార్టీలో ఉన్నారు. జగన్ హయాంలో మామిడి మార్కెట్ కుప్పకూలింది. కూరగాయలు సాగు చేసే రైతులకు ఇచ్చే రాయితీని జగన్ రద్దు చేశాడు. జగన్ హయాంలో కూరగాయల ఉత్పత్తి 20 లక్షల టన్నులు తగ్గింది. పండ్ల ఉత్పత్తిలో 74 లక్షల టన్నులు తగ్గింది. జగన్ పాలనలో మైక్రో ఇరిగేషన్ 14.20 లక్షల ఎకరాల్లో సాగు విస్తీర్ణం తగ్గింది. అన్ని రంగాలను భ్రష్టుపట్టించి రాష్ట్రాన్ని, రాష్ట్రాభివృద్ధిని కుంటుపడేలా చేశారు. రైతులను, ప్రజలను నట్టేట ముంచారు కాబట్టే 11 సీట్లకు పరిమితం చేశారు. నేడు రాయలసీమ హార్టికల్చర్ హబ్ ద్వారా 10 లక్షల మంది రైతులకు, లక్షలాది కుటుంబాలకు ఉపాధి అవకాశాలు రాబోతున్నాయి. రాష్ట్రంలో 36 సాగునీటి ప్రాజెక్టులను రూ.35 వేల కోట్లతో పూర్తిచేయబోతున్నాం. మామిడి, ఉల్లి, టమోట, పొగాకు, మిర్చి, ఇతర పంటలకు మద్దతు ధర కల్పించి ఆదుకున్నాం. తప్పుడు ప్రచారాలు మాని రైతులకు ఉపయోగపడే కార్యక్రమాలను గొడ్డలి పార్టీ స్వాగతించాలని శుక్రవారం ఒక ప్రకటనలో చినరాజప్ప హితవు పలికారు.

# అనునిత్యం ప్రజాసేవలోనే కూటమి ప్రభుత్వం

- గత రెండేళ్లలో బందరు రూపు రేఖలు మార్చేశాం
- ప్రజలకు అన్ని సదుపాయాలు కల్పించే లక్ష్యంతో పాలన
- మచిలీపట్నంలో మూడో రోజు వార్డు పర్యటనల్లో మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం (చైతన్యరథం): అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పాలన సాగుతోందని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. వార్డు సందర్శన కార్యక్రమంలో భాగంగా మూడో రోజు శుక్రవారం కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని వార్డుల్లో పర్యటించిన మంత్రి రవీంద్ర మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని ప్రజలకు వివరించారు. గత రెండు సంవత్సరాల్లో సాధించిన అభివృద్ధిపై ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం.



సూపర్ సిక్స్ హామీలను సూపర్ హిట్ చేశాం.

గత ప్రభుత్వం పెన్షన్లపై హామీలను తుంగలో తొక్కి ఏటా పెంపు పేరుతో దగా చేసింది. కూటమి ప్రభుత్వం మాత్రం హామీ మేరకు ఒకేసారి రూ.1000 పెంచి రూ.4000 పెన్షన్ అందించింది. దీర్ఘకాలిక వ్యాధులున్న వారికి ఏకంగా రూ.15వేల సాయం అందిస్తున్నాం. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, స్త్రీ శక్తి పథకంలో భాగంగా ఉచిత బస్సు, ఉచిత గ్యాస్ అందిస్తున్నాం. అదే సమయంలో నేతన్నలకు, మత్స్యకారులకు, నాయి బ్రాహ్మణులకు, ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం అందిస్తున్నామని మంత్రి రవీంద్ర పేర్కొన్నారు.

సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్ద పేట వేసాం. దశాబ్దాలుగా బందరు వాసులు కోరుకుంటున్న బందర్ పోర్టు పనుల్ని వేగవంతం చేశాం. మరో ఆరు నెలల్లో బందరు పోర్టుకు ఓడలు తీసుకొస్తాం. మరోవైపు బందరు పోర్టుకు అనుసంధానంగా గోవా షిప్ యార్డ్ కంపెనీ రూ.8000 కోట్లతో ఏర్పాటు కాబోతోంది.

సుమారు పదివేల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయి. బందరు ఫిషింగ్ హార్బర్ కూడా పూర్తి చేస్తున్నాం. రూ.52 కోట్ల హామ్ నిథులతో పనులు చేపట్టాం. గ్రామీణ ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వం నుండి మంజూరైన రూ.80 కోట్లతో పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రజలకు సంక్షేమంతో పాటుగా అభివృద్ధి కూడా అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం. బందరు ప్రాంతానికి నూతన శోభ తీసుకు రావాలనే లక్ష్యంతోనే మంగినపూడి తీరంలో 63 అడుగుల మహాగణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేశాం. దాన్ని కూడా వైసీపీ నేతలు విమర్శించడం సిగ్గుచేటు. మహాగణపతి ఆశీస్సులతో ఈప్రాంతానికి మేలు జరగాలన్నదే తన లక్ష్యం అని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, బీజేపీ నాయకులు పంతం గజేంద్ర, తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

# అవినీతి వేళ్లన్నీ జగన్ వైపే చూపిస్తున్నా, ఇంకా మౌనమా!

- రూ.3,500 కోట్ల మద్యం కుంభకోణానికి జగనే అసలు సూత్రధారి
- మేజిస్ట్రేట్ ముందు రజత్ భార్గవ్, సత్యప్రసాద్ ఇచ్చిన వాంగ్మూలాలే తిరుగులేని సాక్ష్యం
- తాడేపల్లి ప్యాలెస్‌కే చేరిన ముడుపుల సొమ్ము.. సిట్ దర్యాప్తులో అన్నీ బహిర్గతం
- అంతిమ లబ్ధిదారు జగన్‌ను అరెస్టు చేయడానికి సిట్ ఎందుకు వెనుకాడుతోంది?
- బాబాయ్ వివేకా హత్యలో రూ.40 కోట్ల సుపారీ వెనుక ఉన్నదెవరో జగన్ నోరు విప్పాలి
- ఎమ్మెల్సీ వర్ల రామయ్య డిమాండ్



అమరావతి (చైతన్యరథం): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన రూ.3,500 కోట్ల మద్యం కుంభకోణానికి అసలు సూత్రధారి, అంతిమ లబ్ధిదారు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ వర్ల రామయ్య తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మద్యం కుంభకోణంపై ఏర్పాటైన సిట్ దర్యాప్తు వేగవంతం కావడంతో అవినీతి వేళ్లన్నీ జగన్ వైపే చూపిస్తున్నాయని, అయినప్పటికీ ఆయన ఇంకా నేరపూరిత మౌనం వీడకపోవడం దేనికి సంకేతమని సూటిగా ప్రశ్నించారు.

**రజత్ భార్గవ్ వాంగ్మూలమే తిరుగులేని సాక్ష్యం**

వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో సాగిన మద్యం కుంభకోణంపై తాము చేస్తున్నవి రాజకీయ ప్రేరేపిత ఆరోపణలు ఎంతమాత్రం కావని, నాటి ఎక్సైజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ్ న్యాయస్థానంలో స్వయంగా ఇచ్చిన వాంగ్మూలమే ఇందుకు తిరుగులేని నిదర్శనమని వర్ల రామయ్య స్పష్టం చేశారు. నాటి ఎక్సైజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రజత్ భార్గవ్, జగన్ స్వయంగా నియమించుకున్న ప్రత్యేకాధికారి డి. సత్యప్రసాద్‌లు మేజిస్ట్రేట్ ముందు 164 సీఆర్పీసీ (నూతన బీఎన్ఎస్ఎస్ 183) ప్రకారం ఇచ్చిన అధికారిక వాంగ్మూలాలే జగన్ అవినీతికి నిలువెత్తు సాక్ష్యాలు. కోర్టులో తిరుగులేని చట్టబద్ధత ఉండే ఈ వాంగ్మూలాల్లో నాటి అక్రమాలన్నింటినీ రజత్ భార్గవ్ పూసగుచ్చినట్లు వెల్లడించారు. కేవలం భారీగా ముడుపులు దండుకోవడానికే మద్యం మూల ధరలను అమాంతం పెంచారని, ఇందుకు సంబంధించిన జీవోలను జారీ చేయాలని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగనే స్వయంగా తనపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెచ్చారని రజత్ భార్గవ్ స్పష్టంగా పేర్కొన్నారు. ముఖ్యమంత్రి హోదాలో ఉండి అధికార దుర్వినియోగానికి పాల్పడిన తీరు ఈ వాంగ్మూలంతో స్పష్టమైంది. నాటి సీఎంవో అధికారులైన ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, ప్రవీణ్ ప్రకాశ్‌ల ప్రత్యక్ష పర్యవేక్షణలోనే ఈ మద్యం దందా మొత్తం సాగిందని రజత్ భార్గవ్ బట్టబయలు చేశారు. రాష్ట్ర ఖజానాకు, పేద ప్రజల జేబులకు చిల్లు పెట్టి వేల కోట్లు కొల్లగొట్టిన ఈ వ్యవహారంలో జగన్ ఏ ముఖం పెట్టుకుని తప్పించుకుంటారు? న్యాయస్థానం ముందు స్వయంగా నాటి ఉన్నతాధికారులే నిజాన్ని అంగీకరించిన తర్వాత జగన్ అండ్ కో చేస్తున్న బుకాయింపులు ఇక సాగవని, మద్యం మాఫియాతో వేల కోట్లు దోచుకున్న సూత్రధారులు, పాత్రధారులు ఎంతటి వారైనా చట్టం నుంచి తప్పించుకోలేరని వర్ల రామయ్య హెచ్చరించారు.

**తాడేపల్లి ప్యాలెస్‌కే రూ.3,500 కోట్ల మద్యం దోపిడీ సొమ్ము**

వైసీపీ పాలనలో సాగిన మద్యం దోపిడీ ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే అతిపెద్ద కుంభకోణమని వర్ల రామయ్య తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వ పెద్దల కనుసన్నల్లో దాదాపు రూ.3,500 కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేసి, నేరుగా తాడేపల్లి ప్యాలెస్‌కు చేర్చారని ఆయన ఆరోపించారు. రూ.3,500 కోట్ల మద్యం దోపిడీ సొమ్మును నేరుగా తాడేపల్లి ప్యాలెస్‌కు తరలించేందుకు నాటి ఐటీ సలహాదారు రాజ్ కసిరెడ్డే పూర్తి స్థాయి రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. అక్రమ మద్యం సొమ్మును దారిమళ్లించడానికి భారీ ఎత్తున హవాలా మార్గాలు, డొల్ల (షెల్) కంపెనీలను ఉపయోగించారు. ఈ దోపిడీ నెట్‌వర్క్‌తో చెన్నైలో ఉండే జగన్ బంధువు వైఎస్ అనిల్ రెడ్డి, భారతీ సిమెంట్ ఫ్యాక్టరీ డైరెక్టర్ గోవిందప్ప బాలాజీ, వాసుదేవరెడ్డి వంటి వారికి ప్రత్యక్ష సంబంధాలున్నాయి. వైసీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డికి చెందిన 'పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్' ఖాతాలోకి ప్రతి నెలా క్రమం తప్పకుండా రూ.5 కోట్ల వాటా జమ అయ్యింది. మద్యం సరఫరాదారుల నుంచి వసూలు చేసిన లంచాల సొమ్మే ఈ ఖాతాల్లోకి మళ్లింది. లంచాలు తీసుకున్నట్లు ఎటువంటి ఆధారాలు దొరకకూడదనే ఉద్దేశంతో మద్యం సరఫరా ఆర్డర్లకు సంబంధించిన కీలకమైన నోట్ ఫైళ్లను సైతం ఉద్దేశపూర్వకంగా ధ్వంసం చేశారు. ఈ విధంగా మద్యం మాఫియా ద్వారా దోచుకున్న వేల కోట్ల రూపాయలను 2024 ఎన్నికల్లో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ద్వారా యథేచ్ఛగా ఖర్చు చేశారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు మద్యం దోపిడీ సొమ్మునే వినియోగించారు. రాష్ట్ర ప్రజల రక్తాన్ని పిండి, మద్యం వ్యాపారాన్ని గుప్పిట్లో పెట్టుకుని సాగించిన ఈ భారీ దోపిడీపై సమగ్ర దర్యాప్తు జరిపించి, సూత్రధారులు, పాత్రధారులందరినీ చట్టం ముందు నిలబెట్టాలని వర్ల రామయ్య డిమాండ్ చేశారు.

**అసలైన లబ్ధిదారుడిపై తాత్సారమెందుకు?**

ఐదేళ్ల వైఎస్సార్సీపీ పాలనలో ప్రజల రక్తాన్ని పిండుకుని, అత్యంత నాసిరకం, కల్తీ మద్యంతో వ్యాపారం చేసి దాదాపు 30 వేల మంది అమాయకుల ప్రాణాలను బలిగొన్నారని వర్ల రామయ్య తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇది సాధారణ నేరం కాదని, గత ప్రభుత్వం చేసిన పచ్చి మారణహోమమని మండిపడ్డారు. రాష్ట్రంలో అధికారికంగా విషాన్ని అమ్మి 30 వేల మంది పేదల ప్రాణాలను గాల్లో కలిపేశారు. మరో 35 లక్షల మంది కాలేయాలు (లివర్), మూత్రపిండాలు (కిడ్నీలు) పాడైపోయి, అనారోగ్యంతో మంచానికే పరిమితమయ్యారు. ఎన్నో కుటుంబాలు పెద్ద దిక్కును కోల్పోయి రోడ్డున పడ్డాయి. ఈ మహాపాపం జగన్‌మోహన్‌రెడ్డి ధనదాహానికి నిదర్శనం కాదా? దీనికి ఆయన సమాధానం చెప్పాలి. లిక్కర్ కుంభకోణంలో ఇప్పటికే సంబంధమున్న వాసుదేవరెడ్డి, చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, ముప్పడి అవినాష్ రెడ్డి, సజ్జల శ్రీధర్ రెడ్డి, అనిల్ చొక్కర, తదితరులను ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారిస్తూ అరెస్టులు చేస్తోంది. కింది స్థాయి వ్యక్తులను, సహకరించిన వారిని అరెస్టు చేస్తున్నప్పుడు.. ఈ దందా మొత్తానికి సూత్రధారి, వేల కోట్ల దోపిడీకి అసలైన 'అంతిమ లబ్ధిదారుడు' జగన్‌మోహన్‌రెడ్డి కాదా? మరి ఆయనను విచారించడానికి, అరెస్ట్ చేయడానికి సిట్ ఎందుకు తాత్సారం చేస్తోంది? తాడేపల్లి ప్యాలెస్ తలుపులు తట్టడానికి అధికారులకు ఇంకా ఏం అడ్డంకులు ఉన్నాయి? పేదల ప్రాణాలను పణంగా పెట్టి వేల కోట్ల రూపాయల అక్రమ సంపాదన వెనకేసుకున్న జగన్‌మోహన్‌రెడ్డిని చట్టం ముందు నిలబెట్టాల్సిందే. ఈ మద్యం కుంభకోణంలో ఎంతటి పెద్దలున్నా వదిలే ప్రసక్తే లేదు. బాధితులకు న్యాయం జరిగే వరకు, దోషులను జైలుకు పంపించే వరకు కూటమి ప్రభుత్వం వెనకడుగు వేయదని వర్ల రామయ్య స్పష్టం చేశారు.

**వివేకా హత్యకు రూ.40 కోట్ల సుపారీ ఎక్కడిది?**

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి దారుణ హత్యోదంతం వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరో తేలాల్సి ఉందని, ఈ కేసులో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాత్రపై ప్రజల్లో ఉన్న అనుమానాలు ఇప్పటికీ నివృత్తి కాలేదని వర్ల రామయ్య స్పష్టం చేశారు. వివేకానందరెడ్డిని అత్యంత పాశవికంగా హతమార్చడానికి ఏకంగా రూ.40 కోట్ల సుపారీ చేతులు మారినట్లు స్పష్టమైంది. అంత పెద్ద మొత్తాన్ని సమకూర్చే దమ్ము, ఆర్థిక స్థోమత దస్తగిరికో, సునీల్ యాదవ్‌కో ఉన్నాయా? ఆ రూ.40 కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయి? ఎవరు సమకూర్చారో జగన్ ప్రజలకు సమాధానం చెప్పాలి. వివేకా హత్య తరువాత హైదరాబాద్ నుంచి పులివెందులకు జగన్‌ను తీసుకెళ్లిన డ్రైవర్ ఎలా చనిపోయాడో ఇప్పటికీ మిస్టరీగానే ఉంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వివేకా హత్యపై సీబీఐ విచారణ కావాలని డిమాండ్ చేసి హైకోర్టులో పిటిషన్ వేసిన జగన్, అధికారంలోకి రాగానే ఆ పిటిషన్‌ను ఎందుకు ఉపసంహరించుకున్నారో రాష్ట్ర ప్రజలకు చెప్పగలరా? నిష్పాక్షికంగా విచారణ జరుపుతున్న సీబీఐ అధికారి రామ్‌సింగ్‌పైనే తప్పుడు కేసులు బనాయించి, వ్యవస్థలను దుర్వినియోగం చేస్తూ అడ్డంకులు సృష్టించడానికి ఎందుకు ప్రయత్నించారు? ఎవరిని కాపాడటానికి ఈ దమనకాండ సాగించారు? ఒకవైపు వేల కోట్ల రూపాయల మద్యం కుంభకోణం, మరోవైపు సొంత బాబాయ్ రక్తచరిత్ర హత్య కేసు.. ఈ రెండింటిలోనూ అన్ని వేళ్లూ జగన్ వైపే చూపిస్తున్నాయి. ఇంత తీవ్రమైన ఆరోపణలు వస్తున్న తరుణంలో ఆయన ఇంకా మౌనం దాల్చడం తన నేరాన్ని తానే అంగీకరించినట్లు కాదా? ఇప్పటికైనా వైఎస్ జగన్ తన మౌనాన్ని వీడి, వివేకా హత్య కేసుపై ప్రజల ముందుకొచ్చి వాస్తవాలను వెల్లడించాలని వర్ల రామయ్య డిమాండ్ చేశారు.

# బీసీ రిజర్వేషన్లను అడ్డుకునేందుకు జగన్ కుట్రలు

- 34 శాతం కోటా కోసం కూటమి ప్రభుత్వం చట్టబద్ధ పోరాటం
- హైకోర్టు తీర్పును గౌరవిస్తూనే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తున్నాం
- బీసీలను రాజకీయంగా ముందుకు తీసుకెళ్లింది టీడీపీనే
- వైసీపీ హయాంలో 24 శాతానికి రిజర్వేషన్లు తగ్గించారు
- బీసీల ప్రయోజనాలను రాజకీయాలకు వాడుకోవద్దు
- ఎమ్మెల్యే గళ్లా మాధవి ధ్వజం



అమరావతి (చైతన్యరథం): బీసీలకు స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం నిబద్ధతతో ముందుకు వెళ్తుంటే, దీనిని రాజకీయంగా అడ్డుకునేందుకు వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి, ఆ పార్టీ నాయకులు కుట్రలు చేస్తున్నారని గుంటూరు వెస్ట్ ఎమ్మెల్యే గళ్లా మాధవి విమర్శించారు. బీసీ రిజర్వేషన్ల అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేందుకు కూటమి ప్రభుత్వం చట్టబద్ధమైన మార్గంలో పోరాటం కొనసాగిస్తోందని స్పష్టం చేశారు. శుక్రవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలని సంకల్పించిందని తెలిపారు. బీసీలకు మరింత రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలనే నిబద్ధతతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. కూటమి ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలుస్తున్న ప్రభుత్వం అన్నది రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు తెలిసిన విషయమేనని మాధవి అన్నారు. బీసీలకు న్యాయం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఎంతో నిబద్ధతతో ముందుకు వెళ్తోందని తెలిపారు. అందులో భాగంగానే బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు చట్టపరమైన చర్యలు చేపట్టామని చెప్పారు. అయితే 34 శాతం రిజర్వేషన్లను సవాల్ చేస్తూ కొందరు కోర్టులను ఆశ్రయించారన్నారు. దీనిపై హైకోర్టు విచారణ జరిపి, ప్రస్తుతం ఉన్న 50 శాతం రిజర్వేషన్ల పరిమితి నేపథ్యంలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశంపై న్యాయపరమైన ఇబ్బందులు ఉన్నందున ప్రభుత్వం ఇచ్చిన జీవోలను కొట్టేశాయన్నారు.

## న్యాయపోరాటంతో సాధిస్తాం

న్యాయస్థానంలో వచ్చిన తీర్పును ఆధారంగా చేసుకుని జగన్ రెడ్డి, గొడ్డలి పార్టీ నాయకులు కూటమి ప్రభుత్వంపై బురదజల్లే కార్యక్రమాన్ని ప్రారంభించారని ఎమ్మెల్యే మాధవి విమర్శించారు. 34 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం సాధ్యం కాదని తెలిసినప్పటికీ ఎందుకు కోర్టులకు వెళ్లారని, ఎందుకు హామీ ఇచ్చారని, అది కోర్టులో కొట్టివేస్తారని తెలిసే ఈ ప్రయత్నం చేశారని జగన్‌మోహన్‌రెడ్డి ప్రశ్నిస్తున్నారని ఆమె తప్పుబట్టారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం కేవలం ప్రజలను మభ్యపెట్టడానికే అయితే, హైకోర్టు తీర్పు వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం సుప్రీంకోర్టును ఎందుకు ఆశ్రయిస్తుందని మాధవి ప్రశ్నించారు. హైకోర్టులో వాదనలు వినిపించినప్పుడు రాష్ట్రంలోని వాస్తవ పరిస్థితులను, బీసీల సామాజిక పరిస్థితులను, వారి రాజకీయ వెనుకబాటుతనాన్ని వివరించామని చెప్పారు. రాష్ట్రంలో బీసీలు 50 శాతానికి పైగా ఉన్న నేపథ్యంలో వారికి తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరాన్ని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఎప్పటి నుంచో రాజకీయంగా వెనుకబడిపోయిన బీసీలను రాజకీయంగా చైతన్యపరిచి ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని మాధవి అన్నారు. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలనే అంశంపై కూటమి ప్రభుత్వం తన వైఖరిని స్పష్టంగా వెల్లడించిందని చెప్పారు. హైకోర్టులో సరైన వాదనలు వినిపించినప్పటికీ తీర్పును గౌరవిస్తూ తదుపరి న్యాయపరమైన మార్గంలో ముందుకు వెళ్తున్నామని తెలిపారు. కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఉందని, చట్ట సవరణలు చేసుకోవడం కూటమి ప్రభుత్వానికి సులభమే కదా అని జగన్ రెడ్డి ప్రశ్నిస్తున్నారని మాధవి పేర్కొన్నారు. అయితే చట్టాలు, న్యాయవ్యవస్థ పట్ల గౌరవం ఉన్న నాయకత్వం రాష్ట్రంలో ఉందని చెప్పారు. న్యాయస్థానం ఇచ్చిన తీర్పును గౌరవిస్తూనే, సుప్రీంకోర్టును ఆశ్రయిస్తున్నామన్నారు. చట్ట సవరణ చేయాల్సిన అవసరం ఏర్పడితే అందుకు కూడా ఒక నిర్దిష్టమైన ప్రక్రియ ఉంటుందని మాధవి వివరించారు. సుప్రీంకోర్టు స్థాయిలో కూడా అవసరమైన చర్యలు తీసుకున్న తర్వాత, చట్ట సవరణ అవసరమైతే దాని కోసం కూడా 100 శాతం ప్రయత్నిస్తామని స్పష్టం చేశారు. తదుపరి న్యాయపరమైన అవకాశాలను ఉపయోగించుకుంటూ బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు.

## రాజకీయం చేయొద్దు

గతంలో జగన్ రెడ్డి ప్రభుత్వం మాత్రం 24 శాతానికే రిజర్వేషన్లను పరిమితం చేసి, అంతకంటే ఎక్కువ ఇవ్వలేమన్నట్టుగా వ్యవహరించిందని విమర్శించారు. జగన్ రెడ్డి విధానాలను, మాటలను, నాయకత్వాన్ని, పాలనను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వంతో పోల్చడం కూడా సమంజసం కాదని మాధవి అన్నారు. బీసీలకు సంబంధించిన ప్రతి అంశాన్ని రాజకీయంగా ఉపయోగించుకోవడానికి వైసీపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. బీసీలకు ద్రోహం చేస్తున్నారని, కేవలం వారిని మభ్యపెట్టేందుకే కూటమి ప్రభుత్వం రిజర్వేషన్ల పేరుతో నాటకం ఆడుతోందని జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలను మాధవి తప్పుబట్టారు. బీసీల విషయంలో గత వైసీపీ ప్రభుత్వ పాలనను ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చింది ఎవరు, ఏ ప్రభుత్వంలో బీసీలకు నిజమైన రాజకీయ ప్రాతినిధ్యం లభించిందో ఆలోచించాలన్నారు. దేశవ్యాప్తంగా బీసీలకు రాజకీయ చైతన్యం కల్పించి, వారికి రాజకీయ నాయకత్వాన్ని అందించేందుకు తెలుగుదేశం పార్టీ చేసిన కృషిని మాధవి గుర్తుచేశారు. బీసీలకు రాజకీయంగా ప్రాతినిధ్యం కల్పించాలనే ఆలోచనతోనే నందమూరి తారకరామారావు హయాంలో స్థానిక సంస్థల్లో 20 శాతం రిజర్వేషన్లు కల్పించారని తెలిపారు. బీసీలను రాజకీయంగా ముందుకు తీసుకెళ్లేందుకు అప్పట్లోనే ఎన్టీఆర్ చారిత్రక నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. ఆ తర్వాత చంద్రబాబు నాయుడు నాయకత్వంలో బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం మరింత పెరిగిందని మాధవి తెలిపారు. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంలో టీడీపీ మొదటి నుంచి నిబద్ధతతో పనిచేస్తోందని చెప్పారు. వైసీపీ పాలనలో బీసీలకు సంబంధించిన కార్పొరేషన్లను తొలగించారని, బీసీ సంక్షేమానికి సంబంధించిన నిధులు, పథకాల విషయంలోనూ అన్యాయం జరిగిందని ఆరోపించారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం గతంలో బీసీల కోసం అమలు చేసిన అనేక పథకాలను కూడా వైసీపీ ప్రభుత్వం కొనసాగించలేదని మాధవి విమర్శించారు. కేవలం చంద్రబాబు నాయుడికి క్రెడిట్ దక్కకూడదనే ఉద్దేశంతోనే బీసీలకు ఉపయోగపడే పథకాలను, కార్యక్రమాలను నిలిపివేశారని ఎమ్మెల్యే మాధవి ఆరోపించారు.

## బీసీలకు మేలు చేసిందెవరో అందరికీ తెలుసు

బీసీలను కేవలం ఓటర్లుగా ఉపయోగించుకునేది ఎవరు, వారికి రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేది ఎవరు అన్నది ప్రజలు గమనిస్తున్నారని మాధవి అన్నారు. తాను రజక సామాజిక వర్గానికి చెందిన మహిళగా ప్రత్యక్ష సాక్షిగా ఉన్నానని చెప్పారు. తన సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి గతంలో రాజకీయ ప్రాతినిధ్యం లభించిందా అని ప్రశ్నించారు. రజక సామాజిక వర్గానికి చెందిన తనకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడం చంద్రబాబు నాయుడు నాయకత్వం వల్లే సాధ్యమైందని అన్నారు. వడ్డెర, నాయీబ్రాహ్మణ, చేనేత తదితర బీసీ సామాజిక వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడం వల్ల ఆయా వర్గాల్లో ఆనందం వ్యక్తమవుతోందని మాధవి తెలిపారు. ఎవరి పాలనలో ఏ సామాజిక వర్గానికి ఎంత ప్రాతినిధ్యం లభించిందో ప్రజలే గమనిస్తున్నారని చెప్పారు. సామాజిక వర్గాలను, మతాలను ఓట్ల కోసం ఉపయోగించుకున్నది ఎవరో ప్రజలకు తెలుసని మాధవి అన్నారు. ప్రతి అంశాన్ని రాజకీయంగా మార్చి లబ్ధి పొందాలనే విధానం సరికాదన్నారు. ఇతర పార్టీలపై బురదజల్లి, నిందలు వేస్తూ రాజకీయంగా లబ్ధి పొందాలనే ఆలోచన చేతగానితనానికి ప్రతిరూపమని విమర్శించారు. ఒక అంశంపై నిజంగా చర్చించవచ్చని, అన్యాయం జరిగితే గళం విప్పవచ్చని, తప్పు జరిగితే ప్రశ్నించవచ్చని మాధవి అన్నారు. అయితే దందాలు, అక్రమాలు, హత్యలు, కుంభకోణాలను చిన్న తప్పులుగా చూపించి మాట్లాడే వైసీపీ నాయకులు, బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే అంశంలో మాత్రం ప్రశ్నలు లేవనెత్తడం సరికాదన్నారు.

## బీసీలపై ప్రేమ ఉంటే సహకరించాలి

గొడ్డలి పార్టీ పాలనలో బీసీ రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించడం వల్ల దాదాపు 16,800 మంది బీసీలకు స్థానిక సంస్థల్లో రావాల్సిన రాజకీయ అవకాశాలు దూరమయ్యాయని అన్నారు. బీసీల కోసం నేడు కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నానికి వైసీపీ అండగా నిలబడుతుందా అని మాధవి ప్రశ్నించారు. కేవలం ఒక అంశం దొరికిందని దానిని రాజకీయంగా ఉపయోగించుకోవడం కాకుండా, బీసీలు నిజంగా పైకి రావాలనే ఉద్దేశం ఉంటే కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నానికి సహకరించాలని కోరారు. రాజ్యసభలో అవసరమైన సమయంలో బీసీ రిజర్వేషన్ల కోసం వైసీపీ అండగా నిలిచి ఉంటే మరింత ముందుకు వెళ్లే అవకాశం ఉండేదని మాధవి అన్నారు. బీసీల కోసం కూటమి ప్రభుత్వం చేస్తున్న పోరాటాన్ని రాజకీయంగా వాడుకోవద్దని మాధవి విజ్ఞప్తి చేశారు. కేవలం రాజకీయ కుర్చీ కోసం బీసీలను, ఎస్సీలను, ఎస్టీలను ఉపయోగించుకోవడం సరికాదన్నారు. రాజకీయ ప్రాతినిధ్యం అనేది అన్ని సామాజిక వర్గాల భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని చెప్పారు. ప్రతి అంశాన్ని చంద్రబాబు నాయుడిని విమర్శించేందుకు మాత్రమే ఉపయోగించుకోవాలనే వైసీపీ విధానాన్ని ప్రజలు గమనిస్తున్నారని మాధవి అన్నారు. వైసీపీ పాదయాత్రలు చేస్తామని చెబుతున్న నేపథ్యంలో, ఏ అంశాలను ఆధారంగా చేసుకుని ప్రజల్లోకి వెళ్తారో చెప్పాలని ప్రశ్నించారు. బీసీలకు గొడ్డలి పార్టీ చేసిన మేలేమిటో ముందుగా వివరించాలని సూచించారు. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంలో తెలుగుదేశం పార్టీకి స్పష్టమైన విధానం ఉందని మాధవి అన్నారు. బీసీలే పార్టీకి వెన్నెముకగా భావించే టీడీపీ, బీసీలను రాజకీయంగా ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తోందన్నారు. బీసీల ప్రయోజనాల కోసం ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు అడ్డంకులు సృష్టించకుండా సహకరించాలని కోరారు. ఇప్పటికే వైసీపీ పాలనను చూసి ప్రజలు ఆ పార్టీకి దూరమయ్యారని, ఇప్పుడు బీసీల అంశాన్ని కూడా రాజకీయంగా వాడుకుంటే మరింత ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతాయని హెచ్చరించారు. బీసీల హక్కులు, రాజకీయ ప్రాతినిధ్యం, సంక్షేమం వంటి అంశాలను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవద్దని స్పష్టం చేశారు. బీసీల ప్రయోజనాల కోసం కూటమి ప్రభుత్వం చేస్తున్న న్యాయపరమైన పోరాటానికి సహకరించాలని ఎమ్మెల్యే మాధవి కోరారు.



చైతన్యరథం

# సేవా సంకల్ప యాత్రకు ఘన స్వాగతం



- మంగళగిరికి చేరుకున్న యాత్ర
- టీడీపీ కేంద్ర కార్యాలయం వద్ద రైడర్లకు ఘన స్వాగతం పలికిన పార్టీ నేతలు, శ్రేణులు
- ప్రజాసేవకే అంకితమైన నాయకుడు నరేంద్ర మోదీ: ఎమ్మెల్యే నజీర్ అహ్మద్
- మోదీ ఆయురారోగ్యాల కోసం తిరుమల నుంచి వారణాసి వరకు బైక్ యాత్ర: శాప్ ఛైర్మన్ రవినాయుడు
- ప్రధాని మోదీ క్షేమం కోరుతూ నారా లోకేష్ మార్గదర్శకంలో సేవా సంకల్ప బైక్ యాత్ర: వీఎంఆర్డీఏ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్





అమరావతి (చైతన్యరథం): దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజాప్రతినిధిగా, ప్రజా నాయకుడిగా 25 ఏళ్ల సుదీర్ఘ ప్రజా జీవితాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని టీఎన్ఎస్ఎఫ్, తెలుగుయువత ఆధ్వర్యంలో చేపట్టిన 'సేవా సంకల్ప యాత్ర' అత్యంత ఉత్సాహభరితంగా సాగుతోంది. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ సూచనల మేరకు రాష్ట్రవ్యాప్తంగా యువత, విద్యార్థి విభాగం ఈ యాత్రను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. తిరుపతిలో బయలుదేరిన యాత్ర శుక్రవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ జాతీయ కేంద్ర కార్యాలయానికి చేరుకున్న సందర్భంగా సేవా సంకల్ప బైక్ రైడర్లకు పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. పూలవర్షం కురిపించి, నినాదాలతో రైడర్లలో నూతనోత్తేజాన్ని నింపారు.

ఈ సందర్భంగా గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నజీర్ అహ్మద్ మాట్లాడుతూ.. దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా 25 ఏళ్ల పాటు నిరంతరాయంగా ప్రజలకు అందించిన నిస్వార్థ సేవలు దేశ చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించదగ్గవని కొనియాడారు. ఈ 25 ఏళ్ల ప్రజా జీవితాన్ని ఘనంగా స్మరించుకుంటూ, ఆయన చేసిన అభివృద్ధి, సేవా కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చేపట్టిన 'సేవా సంకల్ప యాత్ర' అభినందనీయమని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, యువ నాయకుడు నారా లోకేష్ ఆలోచనల మేరకు ఈ 'సేవా సంకల్ప యాత్ర'కు శ్రీకారం చుట్టారన్నారు. 25 ఏళ్ల ప్రధాని ప్రజాసేవకు ప్రతీకగా, 25 సంవత్సరాల వయసున్న 25 మంది యువతీ యువకులు తిరుపతి నుంచి ప్రధాని ప్రాతినిధ్యం వహిస్తున్న వారణాసి వరకు ఈ యాత్రను చేపట్టడం విశేషం. గుజరాత్ ముఖ్యమంత్రిగా మొదలై, నేడు ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశ ప్రధానిగా మోదీ ప్రతీ క్షణాన్ని ప్రజా సంక్షేమానికే అంకితం చేశారు. 'విజన్ 2047' లక్ష్యంతో భారతదేశాన్ని అగ్రరాజ్యంగా నిలబెట్టేందుకు ఆయన వేస్తున్న అడుగులు నేడు అంతర్జాతీయ సమాజం సైతం గర్వించేలా చేస్తున్నాయి. చంద్రబాబు నాయుడు అనుభవం, నారా లోకేష్ చొరవ, మోదీ దూరదృష్టి, సమన్వయంతో రాష్ట్రం, దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నాయి. రాబోయే తరాలకు స్ఫూర్తిదాయకమైన సుపరిపాలన అందిస్తున్న మోదీ నాయకత్వంలో భారతదేశం మరింత ఉన్నత శిఖరాలకు చేరుకుంటుంది. తిరుపతి నుంచి వారణాసి వరకు సాగే ఈ 'సేవా సంకల్ప యాత్ర' విజయవంతం కావాలని, దేశ సమగ్రతకు, సేవా భావానికి ఇది మరింత ఊతం ఇవ్వాలని ఆకాంక్షించారు.



అనంతరం శాప్ ఛైర్మన్ అనిమిని రవి నాయుడు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా వరుసగా 25 సంవత్సరాల పాటు నిరంతరాయంగా ప్రజాసేవలో కొనసాగుతూ, ఇటీవల 75వ జన్మదిన వేడుకలు పూర్తి చేసుకున్న మహోన్నత నాయకుడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దేశ సమగ్రత, ఔన్నత్యం, సమగ్ర అభివృద్ధి కోసం తన జీవితాన్నే అంకితం చేసిన మోదీపై గౌరవంతో ఈ బృహత్తర బైక్ యాత్ర చేపట్టినట్లు తెలిపారు. కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామివారి దివ్య ఆశీస్సులు నరేంద్ర మోదీకి నిరంతరం ఉండాలని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, వర్కింగ్ ప్రెసిడెంట్, యువనేత నారా లోకేష్ ఇచ్చిన పిలుపు మేరకు తిరుపతి నుంచి వారణాసి వరకు ఈ 'సేవా సంకల్ప బైక్ యాత్ర'ను ప్రారంభించాం. మోదీ ప్రజాసేవలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని సరిగ్గా 25 బైకులతో ఈ ప్రయాణం మొదలైంది. ఇందులో టీఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత, నారా లోకేష్ యువ బృందం నుంచి 25 మంది ప్రధాన రైడర్లు, మరో 25 మంది సహాయక బృందం కలిపి మొత్తం 50 మంది పాల్గొంటున్నారు. తిరుపతిలో ప్రారంభమైన ఈ యాత్ర విజయవంతంగా మూడో రోజుకు చేరుకుంది. మార్గమధ్యంలో తిరుమల శ్రీవారిని, శ్రీకాళహస్తిని దర్శించుకున్నాం.. విజయవాడ కనకదుర్గమ్మ తల్లి దర్శనం కూడా చేసుకుంటున్నాం. పెన్నా, కృష్ణా, గోదావరి నదుల పవిత్ర జలాలను సేకరిస్తూ యాత్ర సాగిస్తున్నాం. శనివారం తెలంగాణలోని భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకుని, అక్కడి తీర్థప్రసాదాలను, పవిత్ర గోదావరి జలాలను స్వీకరిస్తాం. ఈ యాత్ర ఈ నెల 6వ తేదీ రాత్రికి వారణాసి చేరుకుంటుంది. 7వ తేదీ ఉదయం దక్షిణ భారత పవిత్ర నదీ జలాలతో కాశీ విశ్వనాథుడికి ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహిస్తాం. నరేంద్ర మోదీ నిండు నూరేళ్ల సంపూర్ణ ఆయురారోగ్యాలతో వర్ధిల్లి, దేశాన్ని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లాలనే ఏకైక సంకల్పంతో నారా లోకేష్ సూచనల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమం అత్యంత ఉత్సాహంగా, దిగ్విజయంగా ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు.

వీఎంఆర్డీఏ ఛైర్మన్ మానం వెంకట ప్రణవ్‌గోపాల్ మాట్లాడుతూ.. దేశ ఔన్నత్యాన్ని విశ్వవ్యాప్తం చేస్తూ ప్రజలకు అంకితభావంతో సేవ చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిండు నూరేళ్ల సంపూర్ణ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, దేశాన్ని మరింత ప్రగతి పథంలో నడిపించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ లోకేష్ మార్గదర్శకంలో ఈ యాత్రను చేపట్టారు. తిరుపతి అలిపిరి వేదికగా ప్రారంభమైన ఈ ప్రయాణంలో మార్గమధ్యంలో ఉన్న ప్రముఖ దివ్య క్షేత్రాలన్నింటినీ దర్శించుకుంటున్నాం. ఆయా ఆలయాల దైవ ఆశీస్సులు, తీర్థ ప్రసాదాలను స్వీకరిస్తూ ముందుకు సాగుతున్నాం. ప్రయాణ మార్గంలోని వివిధ పవిత్ర పుణ్య నదుల జలాలను సేకరిస్తున్నాం. ఈ పవిత్ర జలాలతో కాశీ విశ్వనాథుడి సన్నిధికి చేరుకుని స్వామివారికి విశేష అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నాం. బైక్ రైడర్స్ అందరం ఎంతో ఉత్సాహంతో, ఆధ్యాత్మిక భక్తిభావంతో, దేశ నాయకుడి క్షేమం కోసం ఈ బృహత్తర సంకల్ప యాత్రలో అడుగులు వేస్తున్నాం. యువతంతా ఒక్కటై నారా లోకేష్ నాయకత్వంలో చేపట్టిన ఈ బైక్ యాత్ర నిర్విఘ్నంగా పూర్తయి, కాశీ విశ్వనాథుని అనుగ్రహంతో దేశం, రాష్ట్రం మరింత సుభిక్షంగా వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ డూండి రాకేష్, ఏపీ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఛైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, ఏపీ లిడ్ క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు, ఏపీ బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయకుమార్, మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ కేంద్ర కార్యాలయ కార్యదర్శి పర్చూరి అశోక్ బాబు, ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చి రాంప్రసాద్, మీడియా కోఆర్డినేటర్ ధారపనేని నరేంద్రబాబు, పార్టీ శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.





# బీసీలకు 34 శాతం.. వెనక్కి తగ్గం

## బీసీ హక్కులకు అండగా కూటమి.. రిజర్వేషన్లపై టీడీపీ కట్టుబాటు

బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక న్యాయం, ఆర్థిక అభివృద్ధి కల్పించడంలో తెలుగుదేశం పార్టీకి ప్రత్యేకమైన చరిత్ర ఉంది. బీసీలకు మరింత రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలనే ఉద్దేశంతో అన్న ఎన్టీఆర్ 20 శాతం రిజర్వేషన్లు అమలు చేశారు. అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆ 20 శాతం రిజర్వేషన్లను 34 శాతానికి పెంచి బీసీలకు మరింత రాజకీయ ప్రాతినిధ్యం కల్పించారు. బీసీలకు హక్కులు, అవకాశాలు కల్పించడంలో తెలుగుదేశం పార్టీ అనుసరించిన విధానం ఇదే. వైసీపీ అధికారంలోకి రాకముందు ఉన్న 34 శాతం బీసీ రిజర్వేషన్లను 24 శాతానికి కుదించడం ద్వారా 16,800 మంది బీసీలను రాజ్యాంగబద్ధమైన పదవులకు దూరం చేశారు. వైసీపీ హయాంలో.. హైకోర్టులో బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా తీర్పు వచ్చిన సమయంలో సుప్రీంకోర్టును ఎందుకు ఆశ్రయించలేదన్న ప్రశ్న కూడా ఉంది. ఇంప్లీడ్ అయ్యే అవకాశం ఉన్నప్పటికీ ఆ దిశగా ముందడుగు వేయలేదు.

**జగన్‌రెడ్డి పాలనలో బీసీల అణచివేత:**

జగన్‌రెడ్డి పాలనలో రూ.75,740 కోట్ల బీసీ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించారు. బీసీ సామాజికవర్గాలకు చెందిన చేతివృత్తులపై ఆధారపడిన వారికి చంద్రబాబు ప్రభుత్వం తీసుకువచ్చిన ఆదరణ పథకంవంటి 30 బీసీ సంక్షేమ పథకాలను రద్దు చేశారన్న విమర్శలున్నాయి. జగన్‌రెడ్డి పాలనలో కబ్జాకు గురైన భూముల్లో అత్యధికంగా బీసీలకు చెందిన భూములే ఉన్నాయి. అన్యాయాలను ప్రశ్నించిన బీసీ నేతలపై దాడులు, హత్యలకు సంబంధించిన ఘటనలు కూడా తీవ్ర ఆందోళన కలిగించాయి.

జగన్ పాలనలో 300 మంది బీసీలు హత్యకు గురయ్యారు. పల్నాడులో చంద్రయ్యను నడిరోడ్డుపై గొంతుకోసి చంపడం, నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆయన బిడ్డకు ఉద్యోగం కల్పించబోతే అడ్డుకోవడం వంటి ఘటనలు బీసీలపై జరిగిన అన్యాయాలకు ఉదాహరణలుగా నిలుస్తున్నాయి. రేపల్లెలో అమర్నాథ్ గౌడ్‌ను పెట్రోల్ పోసి కాల్చి చంపిన ఘటన, పొద్దుటూరులో నందం సుబ్బయ్యను పిలిపించి హత్య చేసిన ఘటనలు కూడా బీసీ వర్గాల్లో తీవ్ర ఆవేదనకు కారణమయ్యాయి.

బీసీ సామాజికవర్గానికి చెందిన జిక్క వెంకట నరసయ్యను హత్య చేసి ఆయన బైరైటీస్ గనులను స్వాధీనం చేసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆ గనుల ద్వారా వైఎస్ కుటుంబ వైభోగం కొనసాగిందన్న విమర్శలు వచ్చాయి. కడప జిల్లాలో ఒక్క బీసీకి కూడా ఎమ్మెల్యే సీటు ఇవ్వలేదన్న అంశం కూడా బీసీల రాజకీయ ప్రాతినిధ్యంపై ప్రశ్నలను లేవనెత్తింది.

**బీసీలకు అండగా ఎన్టీఆర్ నుంచి చంద్రబాబు వరకు:**

బీసీలకు రాజకీయంగా అండగా నిలిచిన చరిత్ర తెలుగుదేశం పార్టీది. బీసీలకు మరింత రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేందుకు అన్న ఎన్టీఆర్ 20 శాతం రిజర్వేషన్లు అమలు చేశారు. ఆ తర్వాత చంద్రబాబు నాయుడు వాటిని 34 శాతానికి పెంచారు. బీసీల రాజకీయ సాధికారతకు ఇది కీలకమైన అడుగుగా నిలిచింది. ఎస్వీ యూనివర్సిటీలో 1977లో మొట్టమొదటి చైర్మన్‌గా గీతానాథ్ అనే బీసీని గెలిపించడం నుంచి బీసీలకు రాజకీయ అవకాశాలు కల్పించడంలో చంద్రబాబు నాయుడు తనదైన పాత్ర పోషించారు. 2014-19 మధ్య కాలంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం పాలనలో 4.20 లక్షల మందికి 'ఆదరణ' పరికరాలు అందించడం, బీసీ కార్పొరేషన్ల ద్వారా రూ.3,700 కోట్లు ఖర్చు చేయడం, 13 బీసీ భవనాలు, 1,187 కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం చేయడం వంటి కార్యక్రమాలు బీసీ సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చిన విధానాన్ని తెలియజేస్తాయి. 16 యూనివర్సిటీల్లో 9మంది బీసీలను ఉపకులపతులుగా నియమించడం, రాజధాని అమరావతిలో 10 ఎకరాల్లో జ్యోతిరావు పూలే స్మృతివనం నిర్మాణానికి ప్రణాళిక రూపొందించడం కూడా బీసీలకు గౌరవం, అవకాశాలు కల్పించే దిశగా తీసుకున్న చర్యలుగా నిలిచాయి. బీసీల నిధుల వినియోగాన్ని చట్టబద్ధం చేస్తూ గెజిట్‌లో ప్రకటించిన తొలి ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు నిలిచారు. 2014-19 కాలంలో బీసీల సంక్షేమానికి సబ్‌ప్లాన్ ద్వారా రూ.40,000 కోట్లు ఖర్చు చేయగా, ఎన్టీఆర్ విదేశీ విద్య పథకం కింద 2,234 మందికి రూ.244 కోట్లు ఖర్చు చేశారు.




**కూటమి పాలనలో బీసీ సంక్షేమానికి ప్రాధాన్యం:**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుంచి బీసీల కోసం వివిధ సంక్షేమ పథకాలు, కార్యక్రమాల ద్వారా రూ.32,534 కోట్లు ఖర్చు చేసినట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. బీసీలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా కాకుండా అభివృద్ధిలో భాగస్వాములుగా చూడటమే కూటమి ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. వడ్డెర్లకు 10 శాతం మైనింగ్ లీజులు, కల్లుగీత కార్మికులకు 10 శాతం ఎక్సైజ్ దుకాణాలు కేటాయించారు. 'నేతన్న సేవలో' పథకం ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.25 వేల ఆర్థిక సాయం అందిస్తున్నారు. చేనేత మగ్గాలకు నెలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్ మగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నారు. వేట నిషేధ సమయంలో మత్స్యకార కుటుంబాలకు రూ.20 వేల ఆర్థిక సాయం అందించడంతో పాటు సబ్సిడీపై బోట్లు, డీజిల్ అందిస్తున్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ నంబర్ 217ను రద్దు చేసి వేటపై ఆంక్షలను ఎత్తివేశారు. నాయీ బ్రాహ్మణుల భృతిని రూ.15 వేల నుంచి రూ.25 వేలకు పెంచారు. బీసీ విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉపకార వేతనాలు, ఫీజు సహాయం వంటి పథకాలను కొనసాగిస్తున్నారు. ఇది కేవలం సంక్షేమానికి సంబంధించిన విధానం మాత్రమే కాదు. బీసీలకు హక్కులు, అవకాశాలు, రాజకీయ ప్రాతినిధ్యం, ఆర్థిక అభివృద్ధి కల్పించడంపై ప్రత్యేక దృష్టి పెట్టిన విధానం. బీసీలను ఓటు బ్యాంకుగా కాకుండా అభివృద్ధిలో భాగస్వాములుగా చూడాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం.

**34 శాతం రిజర్వేషన్లపై స్పష్టమైన సంకల్పం:**

బీసీల రాజకీయ సాధికారతకు స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు కీలకమైన అంశంగా మారాయి. ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లకు తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉంది. బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేయాలన్న ఉద్దేశంతో అసెంబ్లీలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ ఇస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుని జీఓ నంబర్ 105, 1065 జారీ చేసింది. అయితే వైసీపీ నేతలు కోర్టుకు వెళ్లి అడ్డుకున్నారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించి న్యాయం చేసేందుకు కృషి చేస్తోంది. ఎన్నికలు జరగకూడదు, బీసీలకు రిజర్వేషన్ దక్కకూడదనే ఉద్దేశంతో వైసీపీ నేతలు అడ్డుకుంటున్నారు. స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న సంకల్పం మారి సుప్రీంకోర్టును ఆశ్రయిస్తుంది. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం అంటే కేవలం పదవులు ఇవ్వడం మాత్రమే కాదు. నిర్ణయాలు తీసుకునే వ్యవస్థలో బీసీలకు తగిన స్థానం కల్పించడం, వారికి హక్కులు, అవకాశాలు అందించడం, ఆర్థికంగా ఎదిగే పరిస్థితులు కల్పించడం కూడా అంతే ముఖ్యం. అందుకే 34 శాతం రిజర్వేషన్ల అమలును సామాజిక న్యాయంతో ముడిపెడుతూ తెలుగుదేశం పార్టీ ముందుకు సాగుతోంది. బీసీల రాజకీయ సాధికారత కోసం ఎన్టీఆర్ ప్రారంభించిన ప్రయాణాన్ని చంద్రబాబు కొనసాగిస్తున్నారన్నది తెలుగుదేశం పార్టీ స్పష్టమైన వైఖరి. బీసీల సంక్షేమం, రాజకీయ ప్రాతినిధ్యం, ఆర్థిక అభివృద్ధి, హక్కుల పరిరక్షణకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. 34 శాతం రిజర్వేషన్ల విషయంలోనూ బీసీలకు న్యాయం జరిగే వరకు కృషి చేస్తామన్న సంకల్పాన్ని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది.

# మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి త్యాగాలు చిరస్మరణీయం

- **మాజీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్‌బాబు**
- **టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా మహనీయుల జయంతి వేడుకలు**



అమరావతి (చైతన్యరథం): మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో జాతిపిత మహాత్మా గాంధీ, మాజీ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నజీర్, మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ కేంద్ర కార్యాలయ కార్యదర్శి పర్చూరి అశోక్ బాబు, ఏపీ బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయంపాలెం విజయకుమార్, మీడియా కోఆర్డినేటర్ ధారపనేని నరేంద్రబాబు వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా అశోక్ బాబు మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి వంటి మహోన్నత నాయకుల త్యాగాలు, ఆదర్శాలు నేటి సమాజానికి ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. భారతదేశ స్వాతంత్ర్య సాధన కోసం జరిగిన కష్టనష్టాలకు గాంధీజీ, శాస్త్రి ప్రత్యక్ష సాక్షులుగా నిలిచారు. దేశ ప్రతిష్ఠను ఇనుమడింపజేయడంలో శాస్త్రి చూపిన పటిమ అద్వితీయమైనది. నేటి యువతకు స్వాతంత్ర్య ఉద్యమ చరిత్ర, నాడు నాయకులు చేసిన ప్రాణ త్యాగాలు, ఆస్తుల త్యాగాల గొప్పతనాన్ని తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉంది. కేవలం అహింసా మార్గంలోనే దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందనే విషయాన్ని స్పష్టం చేయాలి. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారకరామారావు నాడు 'కూడు, గూడు, గుడ్డ' నినాదంతో ప్రజా సంక్షేమానికి బాటలు వేశారు. నేడు నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ గాంధీజీ నమ్మిన అహింసావాదం, సమానత్వం, రాజ్యాంగ స్ఫూర్తితో కూడిన లౌకికవాదం ఆధారంగా అభివృద్ధి సంక్షేమాలను ముందుకు తీసుకెళ్తోంది. మహనీయుల త్యాగాలను స్మరిస్తూ, వారు చూపిన శాంతి, అభివృద్ధి మార్గంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు నేతలు, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# గురజాలలో ఘనంగా ఎన్టీఆర్ కాంస్య విగ్రహావిష్కరణ!

**- తెలుగువారి ఆత్మగౌరవానికి నిదర్శనంగా ఎన్టీఆర్ విగ్రహం**

**- మంత్రి గొట్టిపాటి చేతుల మీదుగా ఆవిష్కరణ.. 15 వేల మందికి అన్నదానం**

గురజాల: గురజాల పట్టణ నడిబొడ్డున స్వర్గీయ నందమూరి తారక రామారావు కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమం శుక్రవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ చేతుల మీదుగా విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ.. స్వర్గీయ నందమూరి తారక రామారావు తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించడమే తమ లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో జిల్లా, నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధులు, వివిధ హోదాల్లోని రాజకీయ నాయకులు, మండల, గ్రామ స్థాయి నాయకులు, కూటమి నేతలు, కార్యకర్తలు, ఎన్టీఆర్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం సుమారు 15 వేల మందికి విందు ఏర్పాటు చేశారు.

# రాయలసీమ రైజింగ్ ప్రాజెక్టుతో ప్రకాశం జిల్లాకు మేలు

**- మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి**



ఒంగోలు (చైతన్యరథం): రాయలసీమ సమగ్ర ఉద్యాన అభివృద్ధి కార్యక్రమం ద్వారా ప్రకాశం జిల్లాలోని ఉద్యాన రంగానికి కూడా ఎంతో మేలు జరుగుతుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి చెప్పారు. శుక్రవారం మదనపల్లిలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఇతర మంత్రులు ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ కు శంకుస్థాపన చేసి, రూ. లక్ష కోట్ల వ్యయంతో ఈ అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రారంభించగా ఒంగోలులోని ప్రకాశం భవనం నుంచి మంత్రితో పాటు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన రావు, కలెక్టర్ పి.రాజాబాబు, ఒంగోలు పట్టణ అభివృద్ధి సంస్థ చైర్మన్ షేక్ రియాజ్ ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు.

అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో ప్రస్తుతం 32,702 హెక్టార్ల ఉద్యాన విస్తీర్ణం ఉండగా ఈ కార్యక్రమం ద్వారా అదనంగా 27,156 హెక్టార్ల విస్తీర్ణాన్ని అభివృద్ధి చేయటం లక్ష్యంగా ప్రభుత్వం పెట్టుకుందన్నారు. పంటల వైవిధ్యం, నీటి వినియోగ సామర్థ్యం పెంపు, తోటల ఉత్పాదకత పెంపు, నాణ్యత అభివృద్ధి, పంట కోత అనంతర కష్టాలు తగ్గింపు, ప్రాసెసింగ్, విలువ జోడింపు, మార్కెటింగ్, రైతు ఉత్పత్తిదారుల సంఘాల బలోపేతంపై ఈ కార్యక్రమంలో ద్వారా ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు తెలిపారు. మిరప పంటలో నాణ్యత, మంచి వ్యవసాయ పద్ధతులు, అవశేషాల నియంత్రణ, ఉత్పత్తి గుర్తింపు, ఎగుమతులకు అనుకూలమైన ఉత్పత్తి విధానాలను ప్రోత్సహించడంతోపాటు మామిడి, ఇతర తోటల్లో ఆధునిక పర్యవేక్షణ, నాణ్యమైన ఉత్పత్తి, మార్కెట్ అనుసంధానాన్ని అభివృద్ధి చేయటం వంటి కార్యక్రమాలను ఇందులో ప్రతిపాదించినట్లు మంత్రి వివరించారు. వీటికోసం రూ.601 కోట్ల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం చేస్తుందన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మొత్తం 10 ఉద్యాన క్లస్టర్లు, 35 మండలాలు ఈ కార్యక్రమంలో లబ్ధి పొందుతాయన్నారు. వెలుగొండ ప్రాజెక్టు ద్వారా ఇప్పటికే మార్కాపురం, ప్రకాశం జిల్లాలకు నీటి సౌలభ్యాన్ని అందుబాటులోకి తెచ్చిన ప్రభుత్వం, తాజాగా ఉద్యాన పంటల విస్తీర్ణాన్ని మరింతగా పెంచి సుస్థిరం చేసేందుకు ఈ పథకం ద్వారా దృష్టి పెట్టిందని మంత్రి తెలిపారు.

# ఐఎస్‌బీ తరహాలో ఐఎస్ఏ!

మదనపల్లె వేదికగా చారిత్రక అడుగుపడింది. నాడు హైదరాబాద్‌కు అంతర్జాతీయ వ్యాపార విద్యా సంస్థ ఐఎస్‌బీ వస్తే, నేడు మదనపల్లెకు అంతర్జాతీయ వ్యవసాయ విద్యా సంస్థ (ఐఎస్ఏ) వస్తుంది. అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందిస్తూ, వ్యాపార రంగానికి ప్రతిభావంతులను అందించే ఐఎస్‌బీ తరహాలోనే, వ్యవసాయ రంగానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి రైతుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలనే లక్ష్యంతో ప్రతిపాదిత ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ (ఐఎస్ఏ)కు మదనపల్లెలో శ్రీకారం చుట్టింది కూటమి ప్రభుత్వం. ఐఎస్‌బీ, ఐఎస్ఏ రెండు సంస్థల లక్ష్యాలు వేర్వేరు. ఐఎస్‌బీ నిర్వహణ విద్య, వ్యాపార నాయకత్వంపై దృష్టి పెడితే, ఐఎస్ఏ వ్యవసాయ పరిశోధన, సాంకేతిక పరిజ్ఞానం, వ్యవసాయ వ్యాపార అభివృద్ధిపై దృష్టి పెట్టనుంది. అందువల్ల ఐఎస్‌బీ తరహా సంస్థాగత నమూనా నుంచి స్ఫూర్తి పొందడమే కాకుండా, వ్యవసాయ రంగానికి తగిన ప్రత్యేక విద్యా ప్రమాణాలు, పరిశోధనా స్వేచ్ఛ, అంతర్జాతీయ భాగస్వామ్యాలు, పారదర్శక పాలనను నిర్మించడం కీలకం కానున్నాయి. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ కార్యక్రమంతో పాటు, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. చరిత్రలో ఎప్పుడూ కరువుకు చిరునామాగా ఉన్న రాయలసీమ ఇకపై అద్భుతాల నిలయంగా మారనుంది. ఈ బృహత్తర యజ్ఞం కేవలం రైతుల కోసమే కాదు, భావి తరాల భవిష్యత్తుకు వేసిన బంగారు బాట. కార్పొరేట్ నైపుణ్యం, ప్రభుత్వ సంకల్పం, రైతన్న కష్టపడే తత్వం కలిస్తే తిరుగులేదనే సత్యానికి ఈ ప్రాజెక్ట్ నిలువెత్తు నిదర్శనంగా నిలవనుంది. రాయలసీమను అంతర్జాతీయ ఉద్యానవన కేంద్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌ను అభివృద్ధి చేయాలనే ప్రభుత్వ ప్రణాళికకు ఐఎస్ఏను అనుసంధానించడం ప్రాధాన్యం గల అంశం. ప్రభుత్వ ప్రణాళికల ప్రకారం, సుమారు రూ.లక్ష కోట్లతో ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడులతో ఉద్యానవన రంగానికి సంబంధించిన కార్యకలాపాలను విస్తరించనున్నారు. కరువు నేలను కల్పవృక్షంగా మార్చే చారిత్రక ప్రయాణం ఇది.




ప్రభుత్వ చొరవ, కార్పొరేట్ దిగ్గజాల భాగస్వామ్యంతో రూపుదిద్దుకొంటున్న ఈ సరికొత్త ప్రణాళిక రాయలసీమ రూపమే మార్చనుంది. వ్యవసాయాన్ని కేవలం సంప్రదాయ వృత్తిగా కాకుండా, విజ్ఞానం, సాంకేతికత, పరిశ్రమలు, వాణిజ్యం మిళితమైన ఆధునిక ఆర్థిక రంగంగా అభివృద్ధి చేసే అవకాశం ఉంది. ఈ ప్రాంతంలో ఉద్యానవన పంటలకు గణనీయమైన అవకాశాలున్నాయి. మదనపల్లె పరిసర ప్రాంతాల్లో టమాటా, కూరగాయల సాగుకు అధిక ప్రాధాన్యముంది. ఈ పంటలకు మెరుగైన నిల్వ సదుపాయాలు, శాస్త్రీయ సాగు పద్ధతులు, విలువ జోడింపు, ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, ఎగుమతుల అనుసంధానం అందుబాటులోకి వస్తే రైతుల ఆదాయ అవకాశాలు విస్తరిస్తాయి. ఐఎస్ఏ పరిశోధనలకు కేంద్రంగా, హార్టికల్చర్ హబ్ ఉత్పత్తి–పెట్టుబడి–మార్కెటింగ్‌కు కేంద్రంగా పనిచేస్తే రెండింటి మధ్య పరస్పర ప్రయోజనకరమైన సంబంధం ఏర్పడుతుంది. ప్రయోగశాలలో అభివృద్ధి చేసిన సాంకేతిక పరిజ్ఞానం రైతు పొలానికి చేరాలి. రైతు పొలంలో ఎదురయ్యే సమస్యలు తిరిగి పరిశోధనకు అంశాలుగా మారాలి. ఈ పరస్పర అనుసంధానమే వ్యవసాయ రంగంలో నిజమైన మార్పుకు పునాది. ప్రపంచం సాంకేతిక విప్లవం దిశగా వేగంగా అడుగులు వేస్తున్న తరుణంలో వ్యవసాయ రంగం కూడా ఆ మార్పులకు అనుగుణంగా ముందుకు సాగాలి. ఐఎస్ఏలో జరిగే పరిశోధనలు రైతుల వాస్తవ అవసరాలకు అనుగుణంగా ఉండాలి. చిన్న, సన్నకారు రైతులు సైతం ఉపయోగించుకోగల చౌకైన సాంకేతిక పరిష్కారాలను అభివృద్ధి చేయాలి. స్థానిక భాషల్లో సలహాలు అందించాలి. వ్యవసాయ విస్తరణ సేవలను బలోపేతం చేయాలి. పరిశోధనా ఫలితాలు పుస్తకాలకే పరిమితం కాకుండా పొలాల్లో ఆచరణలోకి రావాలి.

అంతర్జాతీయ వ్యాపార విద్యకు గుర్తింపుగా నిలిచిన ఐఎస్‌బీ తరహాలోనే, మదనపల్లెలో వ్యవసాయ పరిశోధనకు ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకురావాలనే ఐఎస్ఏ ఆలోచనకు కూడా అపారమైన అవకాశాలున్నాయి. ప్రధానంగా వాతావరణ మార్పులు, నీటి కొరత, సాగు వ్యయాలు, ధరల అస్థిరతవంటి సవాళ్లను ఎదుర్కొంటున్న రైతాంగానికి శాస్త్రీయ పరిజ్ఞానాన్ని చేరువ చేయగలిగితే ఈ ప్రయత్నం మరింత విజయవంతమవుతుంది. నాడు బిజినెస్ విద్యలో కొత్త ఆలోచన. నేడు వ్యవసాయ విజ్ఞానంలో కొత్త ప్రయోగం. నేడు మదనపల్లెలో వేసిన పునాది రాయలసీమ వ్యవసాయ భవిష్యత్తుకు బలమైన పునాది కావాలి. అప్పుడే ఐఎస్‌బీ స్ఫూర్తితో ప్రారంభమైన ఐఎస్ఏ ఆలోచన వ్యవసాయ రంగంలో సరికొత్త అధ్యాయానికి నాంది పలకనుంది. రాయలసీమ ఉద్యాన రంగాన్ని ప్రపంచస్థాయికి తీసుకెళ్లేందుకు మూడేళ్లలో దాదాపు రూ.లక్ష కోట్ల పెట్టుబడుల ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందులో సుమారు రూ.40,352 కోట్లు ప్రభుత్వ పెట్టుబడిగా, మరో రూ.60 వేల కోట్ల వరకు ప్రైవేటు పెట్టుబడులను సమీకరించాలన్నది లక్ష్యం. ఈ ప్రణాళిక కేవలం ఒక ప్రాంతానికో, ఒక పంటకో పరిమితం కాకుండా 10 జిల్లాల్లో 201 క్లస్టర్లుగా అమలు చేయాలని, 9.6 లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూర్చాలని నిర్ణయించి, పెట్టుబడులను మూడు కీలక రంగాలకు భారీగా కేటాయించారు. సాగునీటి రంగానికి సుమారు రూ.20,884 కోట్లు, ఉద్యాన రంగానికి రూ.14,906 కోట్లు, గ్రామీణ రహదారుల అభివృద్ధికి రూ.4,562 కోట్లకుపైగా ప్రతిపాదించారు. ఇది నీరు, రహదారి, ఉత్పత్తి, నిల్వ, రవాణా, మార్కెటింగ్ వరకు మొత్తం వ్యవస్థను అనుసంధానించే ప్రయత్నమని చెప్పాలి. వలసల ప్రాంతాలుగా పేరున్న రాయలసీమ జిల్లాలను ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఇండియాగా, అంతర్జాతీయ ఉద్యాన ఎగుమతుల కేంద్రంగా మార్చడమే ఈ భారీ ప్రణాళిక ప్రధాన లక్ష్యం. సంప్రదాయ సాగు పద్ధతులకు చరమ గీతం పాడి, ఆధునిక సాంకేతికత, వ్యాపార దృక్పథం జోడైతేనే రైతన్న తలరాత మారుతుంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ భాగస్వామ్యంతో ఏర్పాటుకానున్న అంతర్జాతీయ వ్యవసాయ విద్యా సంస్థ కేవలం చదువుల కేంద్రమే కాదు, రాయలసీమ యువతకు, రైతులకు సరికొత్త భవిష్యత్తును నిర్మించే ఉపాధి కర్మాగారం. కష్టాలను కన్నీళ్లుగా మార్చుకున్న సీమ రైతన్న ఇకపై పండ్ల ఎగుమతులతో ప్రపంచ మార్కెట్‌ను శాసించే స్థాయికి ఎదగాలి. ఈ మూడింటి కలయికతో కరువు సీమ కల్పవృక్షంగా మారుతుందనడంలో ఏమాత్రం సందేహం లేదు. ఈ బృహత్తర ప్రయత్నం దిగ్విజయంగా పూర్తి కావాలని, రాయలసీమ నేలపై సిరులు పండాలని, రైతన్నలు ప్రపంచ వేదికలపై తలెత్తుకునే రోజులు త్వరలోనే రావాలని ఆకాంక్షిద్దాం. ఏది ఏమైనా ఐఎస్‌బీ స్ఫూర్తి, ఐఎస్ఏ లక్ష్యం, రైతు సంక్షేమమే గమ్యం కావాలి.

**- నీరుకొండ ప్రసాద్**

## గాంధీజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛభారత్‌లో భాగస్వాములు కావాలి



శ్రీకాకుళం (చైతన్యరథం): జాతిపిత మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రిల జయంతి వేడుకల్లో శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఆయన మున్సిపల్ కార్యాలయంలోని గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ తర్వాత దేశాల్ల వీధిలో ఉన్న బాపూజీ విగ్రహానికి కూడా పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తదుపరి స్థానికంగా ఏర్పాటు చేసిన జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ... ఒకే రోజు ఇద్దరు మహనీయుల జయంతి రావడం ఎంతో విశేషమని పేర్కొన్నారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడమే కాకుండా, స్వచ్ఛతే సేవగా భావించి గ్రామ స్వరాజ్య సాధనకు ఆనాడే స్వయంగా వీధులు ఊడ్చి బాపూజీ మార్గదర్శకత్వం వహించారని గుర్తుచేశారు. స్వచ్ఛభారత్ ఆలోచన గాంధీజీ ఎంతటి ముందుచూపుతో చేశారో నేటికీ స్పష్టమవుతోందని చెప్పారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకున్నప్పుడే వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యం, ఆనందం సాధ్యమవుతాయని, తద్వారా సమాజం, దేశం సమగ్ర అభివృద్ధి సాధిస్తాయని ఆయన అన్నారు.

## మహాత్మునికి నివాళి సమష్టి బాధ్యత : ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి



రంపచోడవరం (చైతన్యరథం): జాతిపిత మహాత్మునికి నివాళులర్పించడం యావత్తు జాతి బాధ్యతే అని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. రాజవొమ్మంగి మండలం గడువోకుర్తి పంచాయతీ చీడిపాలెంలో శుక్రవారం జాతిపిత మహాత్మా గాంధీజీ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన ఆమెకు స్థానిక కూటమి శ్రేణులు సాదర స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆమె మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... సత్యం, అహింస, స్వచ్ఛత, గ్రామ స్వరాజ్యం, సేవాభావం వంటి గాంధీజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలోకి తీసుకురావాలన్నారు. సర్వమత సమ్మేళనానికి ఆయన చూపిన బాటలు నేటికీ ఆదర్శమన్నారు. స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన గ్రామాల నిర్మాణానికి ప్రజల భాగస్వామ్యం ఎంతో ప్రాముఖ్యమన్న విషయాన్ని ఆనాడే మహాత్ముడు గుర్తించినట్లు పేర్కొన్నారు. సేవా సంకల్ప్ అభియాన్ పథకం ప్రయోజనకర కార్యక్రమం అని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. రాజవొమ్మంగి మండలం చీడిపాలెం గ్రామంలో సేవా సంకల్ప్ అభియాన్ – సేవా మేరా యోగ్‌దాన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. నాటిన మొక్కలను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా సాగాలన్నారు. పల్లెపండుగ కార్యక్రమాల ద్వారా గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, ప్రజలకు అవసరమైన సౌకర్యాల కల్పనకు బాటలు వేసుకోవచ్చన్నారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడంపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గాంధీజీ ఆశయాల స్ఫూర్తితో ప్రజాసేవ, పర్యావరణ పరిరక్షణ, గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు.

## గాంధీజీ సత్యనిరతి, అహింసా మార్గం ప్రపంచానికే ఆదర్శం

●పార్వతీపురంలో మహాత్మా గాంధీ విగ్రహానికి అంజలి ఘటించిన ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర



పార్వతీపురం (చైతన్యరథం): మహాత్మా గాంధీ బోధించిన అహింసా మార్గం, స్వేచ్ఛా సిద్ధాంతాలు ప్రపంచవ్యాప్తంగా ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచాయని పార్వతీపురం శాసనసభ్యులు బోనెల విజయచంద్ర అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా పార్వతీపురంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయచంద్ర మాట్లాడుతూ... భారతదేశానికి ఒంటిచేత్తో, అహింసావాదంతో స్వాతంత్ర్యం తెచ్చిపెట్టిన గొప్ప నాయకుడు మహాత్మా గాంధీ అని కొనియాడారు. సహాయనిరాకరణ ఉద్యమం, క్విట్ ఇండియా ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం వంటి అనేక శాంతియుత పోరాటాల ద్వారా బ్రిటిష్ సంకెళ్లను తెంపి దేశానికి స్వేచ్ఛను ప్రసాదించిన మహనీయుడని పేర్కొన్నారు. గాంధీజీ సిద్ధాంతాలను ప్రపంచవ్యాప్తంగా ఐక్యరాజ్యసమితితో సహా అనేక దేశాలు గౌరవిస్తున్నాయని, పలు విశ్వవిద్యాలయాల్లో 'గాంధీయిజం'పై ప్రత్యేక కోర్సులు కూడా నిర్వహిస్తున్నారని తెలిపారు. గాంధీజీ ఆశయాలకు అనుగుణంగానే ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం 'స్వచ్ఛ భారత్' కార్యక్రమాన్ని తీసుకువచ్చిందని, దీని ద్వారా రాష్ట్రంలో 'స్వచ్ఛాంధ్ర' దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, గాంధీజీ మార్గంలో నడుస్తూ భావితరాలకు ఆయన ఆశయాలను అందించాలని పిలుపునిచ్చారు. తదుపరి కొత్తవలసలో గల దుర్గగుడి చెరువు గట్టుపై మొక్కలు అటవీ శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటి పర్యావరణ ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను అలవరచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రభుత ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## మహాత్మా గాంధీ చూపిన మార్గం ఆచరణీయం : దొన్నుదొర



అరకు (చైతన్యరథం): ఈ ప్రపంచానికి మహాత్మా గాంధీ చూపిన మార్గం ఆచరణీయమని, అహింసా మార్గంలో కూడా హక్కులను సాధించుకోవచ్చు అనే సరికొత్త మార్గాన్ని చూపిన మహనీయుడు గాంధీ అని తెలుగుదేశం పార్టీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్, ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం ప్రాంతీయ జోన్ చైర్మన్ సియ్యారి దొన్ను దొర పేర్కొన్నారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం అరకువేలీలోని ఆయన చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దేశ స్వతంత్ర సాధనలో ఆయన చూపిన స్ఫూర్తి ఆయన అనుసరించిన అహింస మార్గాలను గుర్తు చేసుకున్నారు. హింస ద్వారా మాత్రమే మన హక్కులను సాధించుకోవచ్చని ఈ ప్రపంచానికి తెలిసిన తరుణంలో అహింస ద్వారా కూడా వాటిని సాధించుకోవచ్చని తెలియజేసిన మహనీయుడు అన్నారు. ప్రార్థన, అభ్యర్థన, నిరసన అనే ఆయుధాలతో ఈ ప్రపంచానికి సరికొత్త పోరాట మార్గాన్ని చూపిన మహనీయుడు మహాత్మా గాంధీ అని అన్నారు. ఆయన చూపిన తెగువ, ఆయన చూపిన మార్గం భవిష్యత్ తరాలకు ఆచరణీయమన్నారు. ప్రభుత్వాల మెడలు వంచేందుకు సత్యాగ్రహము కూడా ఒక బలమైన ఆయుధమని నిరూపించారన్నారు. ఒక అన్యాయాన్ని వ్యతిరేకించి మరొక అన్యాయాన్ని సహించడం అతని దృష్టిలో నేరమని అందుకే స్వాతంత్రోద్యమంలో ఆయన వినూత్న పంథా అలవర్చుకున్నారన్నారు.

## స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలి: ఎంపీ శ్రీభరత్

●మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రిల జయంతి సందర్భంగా విశాఖలో ఘనంగా సేవా సంకల్ప్ అభియాన్..



విశాఖపట్నం (చైతన్యరథం): మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పెదవాల్తేరులోని శ్రీ కరకచెట్టు పోలమాంబ అమ్మవారి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన 'ఖాదీ సంతలో'ని విశాఖపట్నం ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్ సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీభరత్ మాట్లాడుతూ... స్వాతంత్ర్య సమరంలో మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి అందించిన సేవలు, దేశానికి వారు చూపిన మార్గం స్ఫూర్తిదాయకమని అన్నారు. గాంధీజీ ప్రోత్సహించిన ఖాదీ, స్వదేశీ భావనలను ప్రజల్లో మరింతగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఖాదీతో పాటు దేశీయ ఉత్పత్తులు, స్థానిక కళాకారులు, చేతివృత్తుల వారికి ప్రోత్సాహం అందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ శాస్త్రవేత్త, వైద్య పరిశోధకుడు డాక్టర్ యెల్లాప్రగడ సుబ్బారావు సేవలను ఎంపీ శ్రీభరత్ స్మరించుకున్నారు. ప్రతికూల పరిస్థితులను అధిగమించి ప్రపంచ స్థాయి వైద్య పరిశోధనల్లో ఆయన అందించిన సేవలు భారతీయులందరికీ గర్వకారణమని అన్నారు. వైద్య రంగంలో ఆయన పరిశోధనలు ప్రపంచవ్యాప్తంగా ఎంతో ప్రభావం చూపాయని పేర్కొన్నారు. దేశ సంస్కృతి, సంప్రదాయాలు, స్వదేశీ ఉత్పత్తుల విలువలను కాపాడుతూ, దేశానికి విశిష్ట సేవలందించిన మహనీయుల స్ఫూర్తితో ముందుకు సాగాలని శ్రీభరత్ పిలుపునిచ్చారు. అనంతరం ఖాదీ సంతలో ఏర్పాటు చేసిన స్వదేశీ వస్తువులు, చేతివృత్తి కళాకారుల ఉత్పత్తుల స్టాళ్లను ఆయన సందర్శించారు. ఈ కార్యక్రమంలో విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, బీజేపీ నగర అధ్యక్షుడు పరశురామరాజు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## 34 శాతం రిజర్వేషన్‌కు కట్టుబడి ఉన్నాం : చోడే



విశాఖపట్నం (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34శాతం రిజర్వేషన్ అమలు చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని అందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని విశాఖపట్నం పార్లమెంట్ అధ్యక్షుడు చోడే వెంకట పట్టాభిరాం వెల్లడించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పట్టణ స్థానిక ఎన్నికల్లో బీసీలకు 33.33 శాతం, గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల్లో 34శాతం రిజర్వేషన్ ఇవ్వాలని ప్రభుత్వం దృఢమైన సంకల్పంతో ఉందన్నారు. బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో అసెంబ్లీలో బీసీలకు 34% రిజర్వేషన్ ఇస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుని జీవో నెంబర్ 105, 1065 జారీ చేస్తే వైసీపీ నేతలు కోర్టుకు వెళ్లి అడ్డుకున్నారని అన్నారు. ఎన్నికలు జరగకూడదు బీసీలకు రిజర్వేషన్ దక్కకూడదనే కుట్రతో గొడ్డలి పార్టీ నేతలు అడ్డుకున్నారని, బీసీలకు న్యాయం జరిగేలా సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని, న్యాయపరంగా ఉన్న ప్రతి అవకాశాన్ని ఉపయోగించి బీసీలకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. బీసీలను రాజకీయంగా, ఆర్థికంగా అన్ని విధాలా ముందుకు నడిపించిన ఘనత తెలుగుదేశంపార్టీదేనని, నాడు ఎన్టీఆర్ బీసీలకు రాజకీయాల్లో 24శాతం రిజర్వేషన్ ఇచ్చి ప్రోత్సహించారని, అనంతరం చంద్రబాబునాయుడు బీసీల రాజకీయ రిజర్వేషన్‌ను 34శాతానికి పెంచి బీసీలకు అండగా నిలుస్తున్నారని అన్నారు.

## క్రీడా రంగంలో దేశీయ సంప్రదాయ విద్యలకు ప్రోత్సాహం అవసరం : ప్రభుత్వ విప్ గణబాబు



విశాఖపట్నం (చైతన్యరథం): విశాలాక్షినగర్‌లోని పి.టి.వి.ఎస్.రావు, బి.వి.కె. హైస్కూల్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో 'విద్యాభారతి అఖిల భారతీయ శిక్షా సంస్థాన్' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 37వ జాతీయ స్థాయి మల్లఖంబ్ ఛాంపియన్‌షిప్ పోటీలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు ఎం. శ్రీభరత్ ముఖ్య అతిథిగా హాజరుకాగా, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ పి.జి.వి.ఆర్. నాయుడు (గణబాబు) విశిష్ట అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ పి.జి.వి.ఆర్. నాయుడు (గణబాబు) మాట్లాడుతూ, భారతదేశ ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందిస్తూ విద్యాభారతి దేశవ్యాప్తంగా అనేక విశేష కార్యక్రమాలు నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. కుస్తీ, యోగా, జిమ్నాస్టిక్స్ కలయికగా సాగే మల్లఖంబ్ మన నేల సంప్రదాయ క్రీడ అని కొనియాడారు. చిన్నతనం నుంచే సాధన చేస్తేనే ఇలాంటి క్రీడల్లో రాణించగలరని, విద్యాభారతి పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను ప్రోత్సహించడం గర్వకారణమని పేర్కొన్నారు.

## టీడీపీ జిల్లా కార్యాలయంలో "సేవా మేరా యోగదాన్" మొక్కలు నాటే కార్యక్రమం



కాకినాడ (చైతన్యరథం): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజాజీవితంలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా "సేవా సంకల్ప్ అభియాన్"లో భాగంగా అక్టోబర్ 2, 2026న "సేవా మేరా యోగదాన్" పేరుతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా టీడీపీ జిల్లా కార్యాలయం వద్ద నాయకులు వేప మొక్కలు నాటారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడం, అర్థవంతమైన సామాజిక సేవ ద్వారా ప్రజలు మరియు పార్టీ నాయకులు సమాజానికి తమ వంతు సేవ అందించే అవకాశం కల్పించడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని వారు పేర్కొన్నారు. అలాగే నరేంద్ర మోదీ, నారా చంద్రబాబునాయుడు లాంటి నాయకులు ప్రజాసేవ పట్ల చూపుతున్న నిబద్ధతను వారు ప్రజలకు వివరించారు. నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీరు పోయడం, రక్షణ కల్పించడం మరియు సంరక్షించడం వంటి బాధ్యతలను స్థానిక నాయకులు, కార్యకర్తలకు అప్పగించి, అవి నిరంతరం పెరిగేలా పర్యవేక్షించాలని సూచించారు.

## ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే ముప్పిడి



కొవ్వూరు (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజల వారి సమస్యలు తెలుపుతూ వినతిపత్రాలను అందించారు. అనంతరం మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రజాసేవలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా 'సేవా మేరా యోగ్ దాన్ కార్యక్రమం నిర్వహించి కొవ్వూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎన్డీయే కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం : ఎమ్మెల్యే తెనాలి



తాడికొండ (చైతన్యరథం): ప్రజా సమస్య పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, అందులో భాగంగానే ప్రతి శుక్రవారం ప్రజాగ్రీవెన్స్ కార్యక్రమం ప్రత్యేకంగా నిర్వహిస్తున్నామని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ వ్యాఖ్యానించారు. గుంటూరు నగరంలోని జేకేసీ కాలేజీ రోడ్డులోని తన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి అర్జీని పరిశీలించి, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెనాలి శ్రావణ్ కుమార్ పేర్కొన్నారు. అనంతరం ముఖ్య నాయకులతో క్యాడర్ మీటింగ్ నిర్వహించి పార్టీ కార్యక్రమాలు, స్థానిక సంస్థల ఎన్నికలు తదితర విషయాలపై చర్చించారు.

## గాంధీ మార్గం నేటితరానికి అనుసరణీయం : ఎమ్మెల్యే యార్లగడ్డ



విజయవాడ (చైతన్యరథం): దేశానికి స్వాతంత్ర్యం సాధించి పెట్టిన మహాత్మాగాంధీ చూపిన మార్గం నేటితరానికి అనుసరణీయమని ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని విజయవాడలో ఆయన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సత్యం, అహింసలను ఆయుధాలుగా చేసుకుని శాంతియుతంగా పోరాడిన గాంధీజీ దేశానికి స్వాతంత్ర్యం సాధించడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. సహాయ నిరాకరణోద్యమం, విదేశీ వస్త్ర బహిష్కరణ, క్విట్ ఇండియా ఉద్యమం వంటి పోరాటాలకు ఆయన ఇచ్చిన పిలుపునకు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారని పేర్కొన్నారు. రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన మహాత్మాగాంధీని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

## గ్రామ స్వరాజ్యం దిశగా కూటమి ప్రభుత్వ పరిపాలన : ఎమ్మెల్యే నెహ్రూ



జగ్గంపేట (చైతన్యరథం): రావులమ్మ నగర్‌లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జగ్గంపేట శాసనసభ్యులు, టీటీడీ బోర్డు సభ్యులు, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ హాజరై, గాంధీజీ, శాస్త్రీజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ... "సత్యం, అహింసలతో దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహనీయుడు గాంధీజీ అయితే, 'జై జవాన్ – జై కిసాన్' నినాదంతో దేశ రైతు, సైనికులకు భరోసా ఇచ్చిన గొప్ప నాయకుడు లాల్ బహదూర్ శాస్త్రి. వారిద్దరి ఆశయాలను కొనసాగించడమే మనందరి బాధ్యత. స్వతంత్ర వచ్చి 75 సంవత్సరాలు గడిచినా గత పాలకుల లాంటి రాక్షస పరిపాలన వల్ల గ్రామాల్లో ప్రగతి కుంటిపడిందని రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోంది" అని ఇటువంటి ప్రభుత్వాలు దేశంలో అన్ని రాష్ట్రాల్లో ఉంటే గాంధీజీ కలలుగన్న నిజమైన గ్రామ స్వరాజ్యం దిశగా అడుగులు వేస్తామని ఎమ్మెల్యే నెహ్రూ అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి అధికారులకు ఎమ్మెల్యే కోళ్ల లలిత ఆదేశాలు



శృంగవరపుకోట (చైతన్యరథం): స్థానిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎల్.కోట క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి తరలివచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చి అర్జీలు సమర్పించారు. బాధితుల నుంచి వినతులను స్వీకరించిన ఆమె, సంబంధిత సమస్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి మొత్తం 11 వినతులు అందాయి. వీటిలో అత్యధికంగా రెవెన్యూ విభాగానికి సంబంధించి 7 అర్జీలు రాగా, వ్యవసాయ రంగానికి సంబంధించి 2, దేవాదాయ (ఎండోమెంట్స్) శాఖకు సంబంధించి 1, సమాచార పౌర సంబంధాల (ఐ అండ్ పీఆర్) శాఖకు సంబంధించి 1 అర్జీ నమోదయ్యాయి. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజల నుంచి అందిన ప్రతి వినతిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## చారిత్రాత్మక గౌతమీ సత్యాగ్రహ ఆశ్రమాన్ని సందర్శించిన దేవినేని ఉమా



రాజమహేంద్రవరం (చైతన్యరథం): తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గ పరిధిలోని సీతానగరం వద్ద గోదావరి నది ఒడ్డున ఉన్న చారిత్రాత్మక గౌతమీ సత్యాగ్రహ ఆశ్రమాన్ని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు జిల్లా టీడీపీ అధ్యక్షులు, రాజానగరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి, పార్టీ నేతలతో కలిసి ఆశ్రమాన్ని సందర్శించారు. 'దక్షిణ భారత లాలా లజపతిరాయ్'గా పేరుగాంచిన బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యం స్థాపించిన గౌతమీ సత్యాగ్రహ ఆశ్రమానికి స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో ప్రత్యేక స్థానం ఉందని ఉమ పేర్కొన్నారు. మహాత్మా గాంధీ ఆశ్రమాన్ని రెండుసార్లు సందర్శించారని, 1933లో కస్తూర్బా గాంధీతో కలిసి రెండున్నర రోజులు ఇక్కడ బస చేశారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో ఏర్పాటు చేసిన స్వాతంత్ర్యోద్యమ చరిత్రకు సంబంధించిన ఫోటో గ్యాలరీని తిలకించారు. మహాత్మా గాంధీ, కస్తూర్బా గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం ఆశ్రమ సందర్శన రిజిస్టర్లో సంతకం చేసి, చారిత్రక వారసత్వాన్ని పరిరక్షిస్తూ ఆశ్రమాన్ని నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను భావితరాలకు అందించేందుకు ఇటువంటి చారిత్రక ప్రదేశాలను పరిరక్షించాల్సిన అవసరం ఉందని ఉమ పేర్కొన్నారు.

## గాంధీజీ ఆశయాలే దేశ ప్రగతికి మార్గదర్శకం : ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం (చైతన్యరథం): గాంధీజీ ఆశయాలే దేశ ప్రగతికి మార్గదర్శకమని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా దానవాయిపేట చిన్న గాంధీ బొమ్మ, కంబాల చెరువు సమీపంలోని గాంధీ విగ్రహం వద్ద నగర తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొని గాంధీజీకి ఘన నివాళు లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అహింస, శాంతి, సత్యం, ప్రజాస్వామ్య విలువలను గాంధీజీ ప్రపంచానికి అందించిన గొప్ప సందేశాలని, ఆయన స్ఫూర్తితో ప్రజల భాగస్వామ్యంతో దేశ ప్రగతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశం నేడు అభివృద్ధి పథంలో ముందుకు సాగడానికి గాంధీజీ వంటి మహనీయుల త్యాగాలు, ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమన్నారు. ప్రజలను భాగస్వాములను చేస్తూ మంచి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడమే గాంధీజీ చూపిన మార్గమని, అదే స్ఫూర్తితో కూటమి ప్రభుత్వం ప్రజల సహకారంతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తోందన్నారు.

## 34శాతం రిజర్వేషన్ పునరుద్ధరణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

●ఐదేళ్లు బీసీలను అణగదొక్కిన జగన్‌కు బీసీల గురించి మాట్లాడే హక్కే లేదు : వీరంకి గురుమూర్తి



పెనమలూరు (చైతన్యరథం): బీసీలకు 34% రిజర్వేషన్లు కల్పించి వారి అభ్యున్నతకు కట్టుబడి ఉన్నామని ఏపీ గౌడ కార్పొరేషన్ చైర్మన్, మచిలీపట్నం పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు వీరంకి గురుమూర్తి స్పష్టం చేశారు. పెనమలూరులో మీడియా సమావేశం పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... "తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతోనే ఆంధ్రప్రదేశ్‌లో ఒక నవశకానికి నాంది పడింది. జనాభాలో నూటికి 50 శాతానికి పైగా ఉన్న బీసీ సోదరులు దశాబ్దాలుగా అన్ని రంగాల్లో వెనుకబడి, రాజకీయ అవకాశాలకు దూరమై అణిచివేతకు గురయ్యారు. వారి కష్టాలను, ఆవేదనను ప్రత్యక్షంగా చూసిన మహానుభావుడు మన స్వర్గీయ నందమూరి తారక రామారావు. బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూసే ఆనాటి రాజకీయ వ్యవస్థను బద్దలు కొట్టి, వారిని సమాజంలో జనజీవన స్రవంతిలోకి తీసుకువచ్చిన ఏకైక నాయకుడు ఎన్టీఆర్. దేశంలోనే మొట్టమొదటిసారిగా బీసీలకు నిజమైన రాజ్యాధికారాన్ని కట్టబెట్టిన ఘనత ఎన్టీఆర్‌దే. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించి, రాజకీయాల్లో ఒక విప్లవాత్మకమైన మార్పుకు శ్రీకారం చుట్టారు" అని తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం.. ప్రతి అర్జీపై తక్షణ స్పందన

●ప్రజాదర్బార్‌లో తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, విద్యుత్, భూ సమస్యలపై వినతులు

●సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు అక్కడికక్కడే ఆదేశాలు

●ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా సమస్యలు పరిష్కరించాలి: జీ.వీ ఆంజనేయులు



వినుకొండ (చైతన్యరథం): ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి సత్వర పరిష్కారం చూపడమే లక్ష్యంగా వినుకొండలోని ప్రభుత్వ చీఫ్ విప్ కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీ.వి. ఆంజనేయులు ప్రజల నుంచి వినతులు స్వీకరించి, ఆయా సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా దర్బార్‌కు వినుకొండ పట్టణంతో పాటు నూజెండ్ల, బొల్లాపల్లి, వినుకొండ మండలాల నుంచి పలువురు ప్రజలు తరలివచ్చి తమ సమస్యలను చీఫ్ విప్ దృష్టికి తీసుకువచ్చారు. తాగునీటి కనెక్షన్లు, డ్రైనేజీ, రోడ్లు, విద్యుత్, భూ సమస్యలు, పాస్‌బుక్‌లు, భూముల సర్వే, మరుగుదొడ్ల నిర్మాణం, పెన్షన్లు, ఉద్యోగాలు తదితర అంశాలపై వినతులు అందజేశారు. వినుకొండ పట్టణంలో తాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చీఫ్ విప్ అధికారులను ఆదేశించారు. పలు వార్డుల్లో ఇళ్లకు మున్సిపల్ వాటర్ కనెక్షన్లు మంజూరు చేయాలని, వర్షపు నీరు వెళ్లేందుకు సైడ్ డ్రైనేజీలు నిర్మించాలని వచ్చిన వినతులపై మున్సిపల్ కమిషనర్‌కు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. రెడ్డి నగర్ ప్రాంతంలో చాలాకాలంగా ఉన్న మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు. ప్రజల భద్రతకు సంబంధించిన ఫిర్యాదులపై కూడా తక్షణ స్పందించారు. వినుకొండ బస్టాండ్‌లో బంగారం, నగదు చోరీకి సంబంధించిన ఫిర్యాదుపై సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలించి విచారణ చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

**గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం**

భూ సమస్యలపై వచ్చిన వినతులను కూడా సంబంధిత రెవెన్యూ అధికారులకు పంపిస్తూ పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. బొల్లాపల్లి మండలం వెంకటరెడ్డిపురంలో పట్టా భూములకు పాస్‌బుక్‌లు మంజూరు చేయాలని వచ్చిన వినతిపై తహసీల్దార్‌ను పరిశీలించాలని ఆదేశించారు. నూజెండ్ల, వినుకొండ మండలాల్లో భూముల సర్వే, భూ వివాదాలకు సంబంధించిన ఫిర్యాదులపై సర్వేలు నిర్వహించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని చీఫ్ విప్ స్పష్టం చేశారు.

# ప్రజా సమస్యలకు వేగంగా పరిష్కారం : ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



వేమూరు (చైతన్యరథం): ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి వేగవంతమైన పరిష్కారం చూపించేందుకు వేమూరు నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో "మీకోసం)" ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేమూరు నియోజకవర్గ శాసనసభ్యులు, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు పాల్గొని ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు. గ్రామస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి నేరుగా తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి సమన్వయంతో చర్యలు తీసుకునేలా "మీకోసం" కార్యక్రమం ఒక ప్రత్యక్ష ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికగా పనిచేస్తోందన్నారు. ఈ సందర్భంగా ప్రజలు తమ గ్రామాల్లో నెలకొన్న రెవెన్యూ, భూ సమస్యలు, పంచాయతీరాజ్, సీసీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్, రహదారులు, సాగునీరు, వ్యవసాయం, పెన్షన్లు, రేషన్, గృహాలు, వైద్యం, విద్య, సంక్షేమ పథకాలు తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి అర్జీని సంబంధిత శాఖల అధికారులతో పరిశీలించి, సమస్య స్వభావం, అర్హత, నిబంధనలు, పరిష్కరించాల్సిన విధానం వంటి అంశాలను తెలుసుకుని తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే సూచించారు. ప్రజల నుంచి అర్జీ స్వీకరించడం మాత్రమే కాకుండా, ఆ సమస్య ఏ శాఖ పరిధిలోకి వస్తుంది, ఎలాంటి చర్య తీసుకోవాలి, ఎంత త్వరగా పరిష్కరించవచ్చు, పరిష్కారం ఏ దశలో ఉంది అనే అంశాలపై సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని ఫాలోఅప్ చేయాల్సిన అవసరం ఉందని నక్కా ఆనందబాబు అధికారులకు సూచించారు. ప్రజలు ఒక సమస్య కోసం పదేపదే కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా, సంబంధిత శాఖల మధ్య సమన్వయం పెంచి సమస్యకు పరిష్కారం చూపించే దిశగా అధికారులు పనిచేయాలని ఆదేశించారు.

# బీసీ రిజర్వేషన్ల అమలుకు సుప్రీంకోర్టు వరకు పోరాడతాం : ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు (చైతన్యరథం): బీసీ రిజర్వేషన్ల అమలుకు సుప్రీంకోర్టు వరకు వెళ్ళి పోరాడతామని, బడుగు బలహీన వర్గాల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. గురువారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తన క్యాంపు కార్యాలయంలో మహిళా గ్రీవెన్స్ నిర్వహించి మహిళల నుంచి వినతులు స్వీకరించారు. మహిళలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను విని, సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే గళ్ళా మాధవి మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావించి ముందుకు సాగుతోందన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై దాఖలైన పిటిషన్లను కోర్టు కొట్టివేసి ఎన్నికలు యథావిధిగా కొనసాగించాలని స్పష్టం చేసిందని, అయినప్పటికీ బీసీలకు న్యాయం చేయాలనే సంకల్పంతో కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదికలో శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ



సత్తెనపల్లి (చైతన్యరథం): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎమ్మెల్యే లక్ష్మీనారాయణ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. తన దృష్టికి వచ్చిన గృహ, పెన్షన్, వైద్యం, రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నా తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా పలువురు తన దృష్టికి తీసుకొచ్చిన కొన్ని సమస్యలను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అప్పటికప్పుడు పరిష్కరించగా... మరికొన్నింటి వాటిపై విచారణ జరిపి సమస్యలను పరిష్కరించాలని పలువురు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కూటమి పాలనలో రాష్ట్రం వేగంగా అభివృద్ధి సాధిస్తుందని, నియోజకవర్గ వ్యాప్తంగా అభివృద్ధి కార్యక్రమాలు పెద్దఎత్తున చేపడుతున్నామన్నారు. అర్హత కలిగిన పెన్షనర్లకు కొత్త పెన్షన్లు మంజూరు చేస్తున్నామని, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా, అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పల్లె పండుగతో గ్రామాల అభివృద్ధిలో నూతన అధ్యాయం

●బాపూజీ కలలుగన్న గ్రామస్వరాజ్యం కూటమితోనే సాధ్యం

●పల్లె పండుగ 3.0లో శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు



చిలకలూరిపేట (చైతన్యరథం): పల్లె పండుగతో గ్రామాల అభివృద్ధిలో నూతన అధ్యాయం ప్రారంభమైందని, బాపూజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం.. పల్లె సీమల ప్రగతి దిశగా కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన నాదెండ్ల మండలం అప్పాపురంలో నిర్వహించిన పల్లె పండుగ 3.0లో, పేదలసేవలో 2.0 కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో రూ.25 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లకు శంకుస్థాపన చేసిన అనంతరం, గ్రామంలో మొక్కలు నాటారు. ప్రత్తిపాటి గ్రామస్తుల్ని ఉద్దేశించి మాట్లాడారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని కూటమి ప్రభుత్వం ఒక ఉద్యమంలా నిర్వహిస్తోందని, పేదకుటుంబాల్లో నూతన వెలుగులు నింపుతోందని, పేదల సేవలో కార్యక్రమం.. దేశానికే కొత్త స్ఫూర్తిని ఇస్తోందని ప్రత్తిపాటి పేర్కొన్నారు. పేదల సేవలో 2.0కు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రజలతో మమేకం అయ్యేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని ప్రత్తిపాటి చెప్పారు. పల్లె పండుగ సాధారణ కార్యక్రమం కాదని, గత ప్రభుత్వంలో అభివృద్ధికి దూరమైన గ్రామాల రూపురేఖలు మార్చాలన్న సంకల్పంతోనే కూటమి ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అబ్జర్వర్ ఆడక స్వాములు, సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, మండల అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ, జవ్వాజి మధన్ మోహన్, టీడీపీ నాయకులు నెల్లూరి హరిబాబు, గొట్టిపాటి రామారావు, నాయుడు జగదీష్, నాయుడు అయోధ్య, మస్తాన్ వలి, పిల్లి కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తైక్వాండోలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

●ఆంధ్రప్రదేశ్‌లో క్రీడలకు మంచి ప్రోత్సాహం

●డీఎస్సీలోనూ స్పోర్ట్స్ కోటా ద్వారా ఉద్యోగాల కల్పన

●తైక్వాండో పోటీలను ప్రారంభించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



గుంటూరు (చైతన్యరథం): తైక్వాండో క్రీడల ద్వారా శారీరిక దృఢత్వం, మానసిక ఉల్లాసంతోపాటు కెరీర్ ను మలుచుకునే అవకాశం ఉంటుందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. శుక్రవారం స్థానిక బిఆర్ స్టేడియంలో రషీద్ టెక్ వండో అకాడమీ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎమ్మెల్యే నసీర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పోటీలను ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తైక్వాండో క్రీడ ద్వారా అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఏకాగ్రతకు దోహదపడే ఇలాంటి క్రీడల వైపు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రోత్సహించడం అభినందనీయమని అన్నారు. ఆంధ్రప్రదేశ్లో క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని చెప్పారు. గత డీఎస్సీలోనూ స్పోర్ట్స్ కోటాలో మూడు శాతం ఉద్యోగాలు కల్పించి నిరుద్యోగులకు మంచి భవిష్యత్తు అందించినట్లు తెలిపారు. గుంటూరులోని బీఆర్ స్టేడియం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో క్రీడా మైదానం ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు.

# పచ్చదనం పెంచుదాం... భావితరాలకు ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందిద్దాం : ఎమ్మెల్యే బోడే ప్రసాద్



పెనమలూరు (చైతన్యరథం): ప్రధాని నరేంద్ర మోదీ ప్రజాసేవలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా, శుక్రవారం పోరంకి బాలాజీనగర్ కాలనీలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని పెనమలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడే ప్రసాద్ మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు, పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా భావితరాలకు ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించగలమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ వంతుగా మొక్కలు నాటి, వాటిని బాధ్యతగా సంరక్షించాలని ఆయన పిలుపునిచ్చారు. మొక్కలు నాటుదాం... పచ్చదనాన్ని పెంచుదాం... భావితరాలకు మంచి భవిష్యత్తును అందిద్దామని కోరారు.

## స్థానిక ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఖాయం

### టీడీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర



నెల్లూరు (చైతన్యరథం): స్థానిక సంస్థల్లో బీసీలకు 34శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న తమ సంకల్పం మారదని టీడీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర స్పష్టం చేశారు. బీసీలకు రిజర్వేషన్, పదవులు రాకూడదన్న కుట్రతో వైసీపీ నేతలు కోర్టుకు వెళ్లి నిస్సిగ్గుగా అడ్డుకున్నారు దీనిపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని న్యాయపరంగా ఉన్న ప్రతి అవకాశాన్ని ఉపయోగించి బీసీలకు న్యాయం జరిగేలా చూస్తామని పేర్కొన్నారు. బీసీలకు 34% రిజర్వేషన్ ఇస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుని జీవో నెం. 105, 1065 జారీ చేస్తే వైసీపీ నేతలు కోర్టుకు వెళ్లి అడ్డుకున్నారని వెల్లడించారు. ఎన్నికలు జరగకూడదని బీసీలకు రిజర్వేషన్ దక్కకూడదనే కుట్రతో గొడ్డలి పార్టీ నేతలు తెగబడ్డారన్నారు. వైసీపీ హయాంలో 34 శాతం రిజర్వేషన్లను కోర్టు కొట్టివేస్తే సుప్రీంకోర్టుకు వెళ్లకుండా బీసీలకు చారిత్రాత్మక ద్రోహం చేశారని విమర్శించారు. బీజసీలకు 34శాతం రిజర్వేషన్లు ఇస్తే రాజకీయ ప్రాతినిధ్యం పెరుగుతుందనే కుట్రతో గొడ్డలి పార్టీ నేతలు తీరని ద్రోహం చేశారన్నారు. అన్ని వర్గాల హక్కులను కాపాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో 34శాతం రిజర్వేషన్లను బీసీలకు పునరుద్ధరించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తున్నాంని వెల్లడించారు. వెనుకబడిన వర్గాలను ఓటు బ్యాంకులా చూడాలనే కుట్రతో గొడ్డలి పార్టీ నేతలు ఇటువంటి నీచ రాజకీయాలు చేస్తున్నారన్నారు. బీసీలను రాజ్యాధికారంలో భాగస్వాములు చేసేందుకు తెలుగుదేశం పార్టీ కృషి చేస్తుందన్నారు. నాలుగు దశాబ్దాల క్రితమే బీసీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించి 1987లో శాతం, 1995లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించామని గుర్తు చేశారు. వైసీపీ నేతల కుట్రలను బీసీలు, ప్రజలు గమనిస్తున్నారని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.



ఒంగోలు ప్రకాశం భవనంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మదనపల్లిలో నిర్వహించిన "రాయలసీమ ఇంటిగ్రేటెడ్ హార్టీ కల్చర్ డెవలప్మెంట్ ప్లాన్" లైవ్ స్ట్రీమింగ్ లో పాల్గొన్న సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, జిల్లా కలెక్టర్ రాజబాబు, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు, ఒడా చైర్మన్ షేక్ రియాజ్, ఎఎంసీ చైర్మన్ రాచగర్ల వెంకటరావు తదితరులు

## 34 శాతం బీసీ రిజర్వేషన్లతోనే సామాజిక న్యాయం సాధ్యం

### ఏపీ ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ డాక్టర్ జెడ్ శివ ప్రసాద్ వెల్లడి



నెల్లూరు (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో బీసీ నేతలు విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ముదిరాజ్ సాధికార సమితి కన్వీనర్ పి.ఎల్ రావు, ఆప్కాబ్ మాజీ ఛైర్మన్ పాల్ శెట్టి, బాబు గౌడ్, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ జ్ఞానేంద్ర, చెంచు కిషోర్, ఆశం సురేష్, ఈదర శ్రీనివాసులు, షేక్ అమ్ముల్లా, ఖజానా బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ డాక్టర్ జెడ్ శివప్రసాద్ మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో బీసీలకు సామాజిక సమతుల్యత, ప్రాతినిధ్యం కల్పించాలనే మంచి ఉద్దేశంతో 34 శాతం రిజర్వేషన్లను తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం కేటాయించిందన్నారు. వైసీపీ హయాంలో 34 శాతం రిజర్వేషన్లను కోర్టు కొట్టివేస్తే సుప్రీంకోర్టుకు వెళ్లకుండా బీసీలకు జగన్మోహన్ రెడ్డి చారిత్రక ద్రోహం చేశారని ధ్వజమెత్తారు. స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం పెరుగుతుందనే కుట్రతో వైసీపీ నేతలు కోర్టుల్లో పిటిషన్లు వేసి అడ్డుకున్నారన్నారు. వైసీపీ హయాంలో స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్ ఇవ్వకపోవడం వల్ల 16,800 మంది బీసీలు పదవులను కోల్పోయారన్నారు. వైసీపీ ప్రభుత్వం తమ హయాంలో 51 కార్పొరేషన్లను ఏర్పాటుచేసి ఒక్క రూపాయి నిధులు ఇవ్వకుండా బీసీలను ఘోరంగా అవమానించారన్నారు. 5 ఏళ్ల పాలనలో బీసీలపై మానసిక, భౌతిక దాడులు, వేధింపులకు మాత్రమే వైసీపీ ప్రభుత్వం పరిమితం అయిందన్నారు. అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, కళా వెంకట్రావు, చింతకాయల అయ్యన్నపాత్రుడు వంటి బీసీ నేతలను వైసీపీ ప్రభుత్వం హింసించిందని గుర్తు చేశారు. బీసీలు బోడె రామచంద్ర యాదవ్, నందం సుబ్బయ్య, అమర్నాథ్ గౌడ్ తదితరులు వైసీపీ ప్రభుత్వ హయాంలో బాధితులుగా నిలిచారన్నారు. బీసీలకు రాజకీయ ప్రాధాన్యత, సాధికారత తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమన్నారు. బీసీల డిఎన్ఏ తెలుగుదేశం పార్టీతోనే ఉందన్నారు. న్యాయపరంగా ఉన్న ప్రతీ అవకాశాన్ని ఉపయోగించుకొని పోరాడతామన్నారు.



కనిగిరి అమరావతి గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్ లో అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి



ఒంగోలు నగరంలోని ఎమ్మెల్యే పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి వచ్చిన అర్జీలను ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ స్వీకరించారు. ప్రజలు వెల్లడించిన ప్రతీ సమస్యను అత్యంత ప్రాధాన్యంతో పరిశీలించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో వెంటనే చర్చించి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.




కల్లూరు అర్బన్ 29 వ వార్డ్‌లో "సేవ మేర-యోగ్ దాన్" కార్యక్రమంలో భాగంగా పాణ్యం ఎమ్మెల్యే, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరిత రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ చల్లా ఓబులేశు, కూటమి పార్టీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

## 16,800 బీసీ పదవులు దూరం చేసిన ఘాతకుడు జగన్‌రెడ్డి



చిత్తూరు (చైతన్యరథం): జిల్లా టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా టీడీపీ అధ్యక్షులు చెక్కుడుకుప్పం షణ్ముగం రెడ్డి మాట్లాడుతూ, బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంలో టీడీపీ ఆవిర్భావం నుంచే ముందుందని అన్నారు. ఎన్టీఆర్ బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యానికి పునాది వేయగా, నారా చంద్రబాబు నాయుడు హయాంలో 34 శాతం రిజర్వేషన్ అమలు చేసి స్థానిక సంస్థల్లో బీసీలకు విస్తృత రాజకీయ అవకాశాలు కల్పించారని తెలిపారు. "జగన్‌రెడ్డి ప్రభుత్వం బీసీ రిజర్వేషన్‌ను 34 శాతం నుంచి 24.15 శాతానికి తగ్గించి సుమారు 16,800 రాజకీయ పదవులను బీసీలకు దూరం చేసింది. బీసీలపై అంత ప్రేమ, చిత్తశుద్ధి ఉంటే రిజర్వేషన్లు తగ్గించినప్పుడు ఎందుకు అడ్డుకోలేదు? బీసీల రాజకీయ హక్కుల కోసం ఎందుకు గట్టిగా న్యాయపోరాటం చేయలేదు?" అని షణ్ముగం రెడ్డి ప్రశ్నించారు. 16,800 అవకాశాలు కోల్పోయిన అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ప్రస్తావించారు. "బీసీలకు జరిగిన నష్టానికి జగన్‌రెడ్డి సమాధానం చెప్పాలి. అధికారంలో ఉన్నప్పుడు బీసీల రిజర్వేషన్ తగ్గించి, ఇప్పుడు బీసీలపై ప్రేమ ఉన్నట్లు మాట్లాడటం ప్రజలను తప్పుదోవ పట్టించడమే" అని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ హయాంలో బీసీ నాయకులు, కార్యకర్తలపై దాడులు, కేసులు జరిగాయని ఆరోపిస్తూ తోట చంద్రయ్య, అమర్నాథ్ గౌడ్, కంచెర్ల జాలయ్య ఘటనలను ప్రస్తావించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు చర్యలు తీసుకుందని తెలిపారు. అయితే హైకోర్టు తాజాగా 34 శాతం రిజర్వేషన్‌కు సంబంధించిన రెండు ప్రభుత్వ ఉత్తర్వులను రద్దు చేసిన నేపథ్యంలో, సుప్రీంకోర్టులో న్యాయపోరాటం కొనసాగిస్తామని చెప్పారు. "హైకోర్టు తీర్పుతో మా సంకల్పం ఆగదు. సుప్రీంకోర్టు వరకు న్యాయపోరాటం చేస్తూనే స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేందుకు టీడీపీ కట్టుబడి ఉంటుంది. బీసీల పక్షపాతిగా టీడీపీ ఎప్పటికీ కొనసాగుతుంది. బీసీల రాజకీయ హక్కుల కోసం చివరి వరకు పోరాడతాం" అని చెక్కుడుకుప్పం షణ్ముగం రెడ్డి స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు మాట్లాడుతూ, బీసీల రాజకీయ సాధికారతకు టీడీపీ చారిత్రకంగా కృషి చేసిందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సునీల్ కుమార్ చౌదరి మాట్లాడుతూ, బీసీల హక్కుల పరిరక్షణకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ సీఎండీ త్యాగరాజన్ మాట్లాడుతూ, బీసీల అభ్యున్నతికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ కార్యదర్శి మోహనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ‘అభివృద్ధి నిరోధక పార్టీ’గా వైసీపీకి నామకరణం



కర్నూలు (చైతన్యరథం): జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి పి. నాగరాజు యాదవ్, రాష్ట్ర బొందిలి కార్పొరేషన్ చైర్మన్ విక్రం సింగ్, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు కె.ఇ. జగదీష్, బీసీ సెల్ అధ్యక్షులు సత్రం రామకృష్ణుడు, రాష్ట్ర ఉప్పర కార్పొరేషన్ డైరెక్టర్ ఎల్.వి. ప్రసాద్ తదితరులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించకపోవడం వల్ల సుమారు 16,800 రాజకీయ పదవులను బీసీలు కోల్పోయారని పేర్కొన్నారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే వారి రాజకీయ ప్రాతినిధ్యం పెరుగుతుందనే ఉద్దేశంతో వైసీపీ నేతలు న్యాయస్థానాలను ఆశ్రయించి రిజర్వేషన్లకు అడ్డంకులు సృష్టించారని విమర్శించారు. బీసీలకు అవకాశాలు, సముచిత ప్రాతినిధ్యం కల్పించకుండా అడ్డుకునే విధంగా వ్యవహరిస్తున్న వైసీపీకి ఇకపై కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయం వేదికగా ‘ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి నిరోధక పార్టీ’గా నామకరణం చేస్తున్నామని తెలిపారు. బీసీల సామాజిక, రాజకీయ పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు 1987లో బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించారని నాయకులు తెలిపారు. అనంతరం 1995లో బీసీల రిజర్వేషన్లను 20 శాతం నుంచి 34 శాతానికి పెంచిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబుదేనని పేర్కొన్నారు. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో బీసీల రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం ద్వారా బీసీలకు అన్యాయం చేసిందని విమర్శించారు. బడుగు, బలహీన వర్గాలకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు నిర్ణయం తీసుకొని సంబంధిత జీవోలను జారీ చేసిందని తెలిపారు. వైసీపీ నేతలు న్యాయస్థానాలను ఆశ్రయించి ఈ ప్రక్రియకు అడ్డంకులు సృష్టించారని ఆరోపించారు. బీసీలకు న్యాయం జరిగేలా న్యాయపరంగా అందుబాటులో ఉన్న ప్రతి అవకాశాన్ని వినియోగించుకుంటామని, సుప్రీంకోర్టును కూడా ఆశ్రయిస్తామని వారు స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో రాష్ట్ర టీడీపీ వికలాంగుల సంఘం ప్రధాన కార్యదర్శి కె. ఎల్లప్ప, రాష్ట్ర టీడీపీ లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, షేక్ పాల్గొన్నారు.



## ఘనంగా సేవా మేరా యోగ్దాన్ : మొక్కలు నాటిన ఎమ్మెల్యే కోట్ల

డోన్ (చైతన్యరథం): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజాసేవలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్’ లో భాగంగా ‘సేవా మేరా యోగ్దాన్’ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా డోన్ మండలంలోని యు.కొత్తపల్లి గ్రామంలో డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు సందేశాన్ని అందించారు. ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడం, సామాజిక సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, పచ్చదనం పెంపొందించేందుకు తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

### నందికొట్కూరులో...

పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మాట్లాడుతూ సత్యమే మార్గంగా.. అహింసనే ఆయుధంగా.. స్వాతంత్ర్య సమరంలో దేశ ప్రజలకు స్ఫూర్తినిచ్చిన మహాత్మా గాంధీ ఆశయాలు, ఆదర్శాలు నేటికీ ప్రతి ఒక్కరికీ మార్గదర్శకమని త్యాగం, సత్యం, అహింస అనే విలువలతో ప్రపంచానికి శాంతి సందేశాన్ని అందించిన మహాత్ముడి జీవితం సదా స్ఫూర్తిదాయకం అని ఆయన పేర్కొన్నారు. అనంతరం “సేవా మేరా యోగ్దాన్” కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే జయసూర్య మొక్కలు నాటారు. కార్యక్రమంలో నందికొట్కూరు మండల కన్వీనర్ మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, పట్టణ నాయకులు ప్రభుత్వ అధికారులు పాలొన్నారు,





మడకశిర ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యులు, శ్రీ సత్యసాయి జిల్లా టీడీపీ అధ్యక్షుడు రాజు పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

# అర్హులందరికీ పక్కాగా ఇళ్ళు

## కదిరి శాసనసభ్యుడు కందికుంట వెంకటప్రసాద్



కదిరి (చైతన్యరథం): కదిరి పట్టణంలోని 29, 30వ వార్డుల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకొని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునే లక్ష్యంతో కదిరి మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని కదిరి నియోజకవర్గ శాసనసభ్యుడు కందికుంట వెంకటప్రసాద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా వార్డులకు చెందిన ప్రజల నుంచి వినతులను స్వీకరించి, వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. సంబంధిత మున్సిపల్ అధికారులతో మాట్లాడి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమం, అభివృద్ధి అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, పట్టణంలోని ప్రతి వార్డులో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. అనధికార లేఅవుట్ల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. మున్సిపాలిటీ అనుమతి పొందిన లేఅవుట్లలోనే ప్లాట్లు కొనుగోలు చేయాలని సూచించారు. అనుమతులు లేని లేఅవుట్లలో స్థలాలు కొనుగోలు చేయడం వల్ల భవిష్యత్తులో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు వంటి మౌలిక సదుపాయాల విషయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. ఆమోదిత లేఅవుట్లలో ప్రణాళికాబద్ధమైన పట్టణ అభివృద్ధికి అవకాశం ఉంటుందని వివరించారు. ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలాలు మంజూరు చేసే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గతంలో టిడ్కో ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకొని, డీడీలు చెల్లించి, ఇప్పటికీ బ్యాంకులకు వాయిదాలు చెల్లిస్తున్న లబ్ధిదారులకు కూడా శుభవార్త అందించారు. అర్హులైన లబ్ధిదారులకు 2027 మార్చి నెలాఖరులోగా టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, 29, 30వ వార్డుల ప్రజలు పాల్గొన్నారు.




# బీసీ ద్రోహి జగన్‌రెడ్డిని రాజకీయాల నుంచి తరిమికొట్టాలి

## 34 శాతం కోటాపై హైకోర్టులో వైసీపీ పిటిషన్లు, సుప్రీంకోర్టుకు వెళ్లాలనే సీఎం చంద్రబాబు నిర్ణయం హర్షణీయం, టీడీపీ సీనియర్ నాయకుడు లుక్కా సాయిరాం గౌడ్

విజయవాడ (చైతన్యరథం): అధికారంలో ఉన్న ఐదేళ్లలో బీసీ వర్గాలకు తీరని ద్రోహం చేసిన వైసీపీని బీసీలందరూ ఏకమై రాజకీయాల నుంచి శాశ్వతంగా తరిమికొట్టాలని టీడీపీ మాజీ రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్ పిలుపు ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తరువాతనే బీసీలకు రాజకీయంగా గుర్తింపు వచ్చిందన్నారు. 1995 లోనే తెలుగుదేశం పార్టీ బీసీలకు స్థానిక సంస్థలలో 34% రిజర్వేషన్ల తో ఎన్నికలు జరిపిందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక బీసీల రాజకీయ ఎదుగుదలను అడ్డుకుంటూ రిజర్వేషన్లను 10 శాతం తగ్గించి 24 శాతంతో ఎన్నికలు జరిపిందని గుర్తుచేశ్శారు. తెలుగుదేశం పార్టీ స్థాపించిన నాటినుండి ఆనాటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు దగ్గర నుండి ఈనాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వరకు రాష్ట్రంలో రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా చేయూతనిస్తూ, బీసీలకు ఎంతో గౌరవం ఇచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, తమ ‘బీసీ డిక్లరేషన్’ హామీకి కట్టుబడి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు పునరుద్ధరిస్తూ నిర్ణయం తీసుకుంది అని తెలిపారు. జనాభాలో 50శాతం పైగా ఉన్న బీసీ జనాభాకు రాజకీయాలలో 34శాతం రిజర్వేషన్ కల్పించడం నేరమా అని జగన్ రెడ్డిని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇచ్చిన జీవోలను సవాలు చేస్తూ హైకోర్టులో పిటిషన్లు దాఖలు కావడం, దానికి వెనుక ఉన్న వైసీపీ నాయకుల రాజకీయ నేపథ్యాలు బయటపడి బీసీలపై కపటప్రేమ వెల్లడయిందన్నారు. స్థానిక సంస్థల్లో 34 శాతం బీసీ రిజర్వేషన్ల జీవోలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లకు అనుకూలంగా వాదిస్తున్న న్యాయవాది గుండాల శివప్రసాద్ రెడ్డి... గత వైసీపీ పాలనలో ఈయన ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా బాధ్యతలు నిర్వహించారు. వైసీపీ అధినాయకత్వంతోనూ, ఆ పార్టీ ముఖ్య నేతలతోనూ ఆయనకున్న సన్నిహిత సంబంధాలు సామాజిక మాధ్యమాల ద్వారా బహిరంగంగానే కనిపిస్తున్నాయి. ముసుగు వ్యక్తులతో పిటిషన్లు వేయించి బీసీల రిజర్వేషన్లకు అడ్డంకులు సృష్టించడం వెనుక వైసీపీ హస్తం ఉందని తేటతెల్లమైందన్నారు. తమ పార్టీ అనుకూల న్యాయవాదుల ద్వారా కోర్టు మెట్లు ఎక్కించడం చూస్తుంటే జగన్ రెడ్డి బీసీ ద్రోహిగా చరిత్రలో నిలిచిపోయాడన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ లభిస్తే, వేల సంఖ్యలో బీసీ నాయకులు సర్పంచ్‌లుగా, ఎంపీటీసీలుగా, జెడ్పీటీసీలుగా, కౌన్సిలర్లుగా, మున్సిపల్ చైర్మన్లుగా ప్రజాస్వామ్యంలో కీలక స్థానాల్లోకి వస్తారని, కూటమి ప్రభుత్వానికి బీసీల్లో మంచి పేరు వస్తుందనే అసూయతోనే ఇటువంటి పిటిషన్ల ద్వారా ప్రక్రియను చిక్కుముళ్లలో పడేస్తున్నారని విమర్శించారు. చట్టసభలోనే బీసీ లకు జనాభా ప్రాతిపదికన 50శాతం రిజర్వేషన్ కల్పించాలన్న డిమాండ్ ఉన్న నేపథ్యంలో,స్థానిక సంస్థల్లో కేవలం 34శాతం రిజర్వేషన్లు కల్పించడాన్ని అడ్డుకోవడం న్యాయమా అని జగన్ రెడ్డిని ప్రశ్నించారు. ఒకవైపు బయటకు తాము బీసీల పక్షపాతులమని చెప్తూనే, మరోవైపు తమ మాజీ ఏజీపీల ద్వారా కోర్టుల్లో రిజర్వేషన్ జీవోలపై స్టేలు, సస్పెన్షన్లు కోరడం జగన్ రెడ్డి ద్వంద్వ వైఖరికి నిదర్శనం కాదా లుక్కా ప్రశ్నించారు.

రాజ్యాంగబద్ధంగా, శాస్త్రీయ డేటాతో బీసీలకు దక్కాల్సిన 34% ప్రాతినిధ్యం కోసం హైకోర్టు తీర్పు పట్ల వెన్ను చూపకుండా బీసీ లకు పూర్తి న్యాయం చేయడం కోసం సుప్రీం కోర్టులో అప్పీల్ చేయడానికి సిద్ధం అవుతున్నందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు లుక్కా కృతజ్ఞతలు తెలిపారు.

### కాలిఫోర్నియా రెగ్యులేటరీ బోర్డు సభ్యునిగా ప్రవాస భారతీయుడు

# అజయ్ భుటోరియా

### కీలక పదవిలో నియమించిన గవర్నర్ గావిన్ న్యూసమ్



**వాషింగ్టన్:** ప్రవాస భారతీయుడు అజయ్ భుటోరియాను అమెరికాలోని కీలకమైన పదవి వరించింది. ప్రొఫెషనల్ ఇంజినీర్లు, ల్యాండ్ సర్వేయర్లు, జియాలజిస్టులతో కూడిన 'కాలిఫోర్నియా రెగ్యులేటరీ బోర్డు' సభ్యునిగా ఆయన నియమితులయ్యారు. ఈ మేరకు కాలిఫోర్నియా గవర్నర్ గావిన్ న్యూసమ్ అధికారిక నియామక ప్రకటన విడుదల చేశారు. కాలిఫోర్నియా వినియోగదారుల వ్యవహారాల శాఖ ఆధ్వర్యంలో పనిచేసే ఈ బోర్డు... ప్రజల జీవన ప్రమాణాలు, ఆరోగ్యం, ఆస్తులు, ప్రజా సంక్షేమం వంటి కీలక అంశాలపై పర్యవేక్షణ బాధ్యతలను నిర్వహిస్తుంది. తనను ఈ బాధ్యతల్లో నియమించినందుకు గవర్నర్ గావిన్ న్యూసమ్‌కు అజయ్ భుటోరియా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఫ్రీమౌంట్‌లో నివాసముంటున్న భుటోరియా కేరళలోని తిరుచురాపల్లిలో కెమికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. సాంకేతికత, మౌలిక సదుపాయాలు వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ తరుణంలో సహచర బోర్డు సభ్యులతో కలిసి పనిచేయడానికి ఆసక్తిగా ఉన్నానని పేర్కొన్నారు. కృత్రిమ మేధ, అభివృద్ధి చెందుతున్న నూతన సాంకేతికతలను వినియోగించుకుంటూ బోర్డు కార్యకలాపాలను ఆధునికీకరించడానికి, పరిపాలనాపరమైన అడ్డంకులను తొలగించడానికి, ప్రజలందరికీ మరింత ప్రతిస్పందించే పాలనా వ్యవస్థను నిర్మించడానికి శ్రమిస్తానని భుటోరియా వెల్లడించారు.



## గ్లౌస్టర్‌షైర్‌లో వైభవంగా శ్రీవారి కల్యాణ మహోత్సవం

**గ్లౌస్టర్‌షైర్ (లండన్):** గ్లౌస్టర్‌షైర్ ఇంటర్నేషనల్ హిందూ కమ్యూనిటీ అసోసియేషన్ (IHCAG) ఆధ్వర్యంలో శ్రీవారి కళ్యాణ మహోత్సవం అత్యంత ఘనంగా జరిగింది. ఈ పవిత్ర కార్యక్రమాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం వేద పాఠశాల పూర్వ విద్యార్థులైన అర్చకులు వేదోక్తంగా పూర్తి చేశారు. ఈ వేడుకను ఏపీ శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ ఎస్.సతీష్‌రెడ్డి, స్థానిక డిప్యూటీ మేయర్ చంద్ర మువ్వల, పలువురు ప్రముఖ కమ్యూనిటీ నాయకులు తిలకించారు. IHCAG ప్రతినిధి శివరామరెడ్డి గూడూరు మాట్లాడుతూ... గ్లౌస్టర్ షైర్‌లో నిర్మించతలపెట్టిన శ్రీ బాలాజీ ఆలయం ప్రస్తుత, భవిష్యత్ తరాలకు ఆధ్యాత్మిక, సాంస్కృతిక, సామాజిక సేవా కేంద్రంగా నిలవనుందని తెలిపారు. ఈ మహత్తర స్వప్నాన్ని సాకారం చేసేందుకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన చిన్నారుల నృత్య ప్రదర్శనలు అకట్టుకున్నాయి.



### అమెరికాలో తెలుగు సంఘాల ఆధ్వర్యంలో

# 'దీపావళి ఫుడ్ డ్రైవ్'

### రేపు టాంపాలో భారీ విరాళాల సేకరణ

**టాంపా (ఫ్లోరిడా):** రాబోయే దీపావళి పండుగను పురస్కరించుకుని ఫ్లోరిడాలోని టాంపాలో స్థానిక తెలుగు సంఘాలు, యువత కలిసి ఒక గొప్ప సామాజిక కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. వాలంటీర్ హబ్ (Volunteer Hub), మెలోడీ మాక్‌టైల్ (Melody Mocktail), మాటా (మన అమెరికా తెలుగు అసోసియేషన్) సంస్థలు సంయుక్తంగా అక్టోబరు 4న ఒక భారీ "దీపావళి ఫుడ్ డ్రైవ్" తలపెట్టాయి. స్థానిక సమాజంలో ఆహార భద్రత లేని కుటుంబాలకు అండగా నిలవడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. పండుగ సంబరాల మధ్య, ఇబ్బందుల్లో ఉన్నవారికి సాయం చేయడం ద్వారా నిజమైన దీపావళి స్ఫూర్తిని చాటాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

విరాళంగా ఇవ్వదగిన ఆహార పదార్థాలు: ఈ ఫుడ్ డ్రైవ్‌కు ప్రజలు నిల్వ ఉంచదగిన ఆహార పదార్థాలను




విరాళంగా అందించవచ్చు. డబ్బా ఆహార పదార్థాలు (కూరగాయలు, పప్పులు, సూప్‌లు), పాస్తా, నూడుల్స్, బియ్యం, ఇన్‌స్టంట్ ఓట్‌మీల్, పీనట్ బటర్, షెల్ఫ్-స్టేబుల్ పాలు అందజేయవచ్చు.

పాల్గొనే విధానం-వివరాలు:

దాతలు అక్టోబరు 4న కే-బార్ (K-BAR) వద్ద జరిగే ఈవెంట్‌కు వచ్చి విరాళాలను నేరుగా అందజేయవచ్చు. ఈ కార్యక్రమం విజయవంతానికి స్వచ్ఛంద సేవకులు అవసరమని నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు లేదా పెద్దలు రిజిస్ట్రేషన్ లింక్ https://globalstudenthub.org/ ద్వారా లేదా వాలంటీర్ కో-ఆర్డినేటర్ హరికృష్ణ నరుకుళ్లపాటి (813-666-5067)ని సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవచ్చు.

"ఈ దీపావళికి తోటివారికి సాయపడే వెలుగును పంచండి.. మీ చిన్నపాటి సహాయం ఒక కుటుంబానికి ఆకలి తీరుస్తుంది" అని నిర్వాహకులు పేర్కొన్నారు.

## 'టాంటెక్స్' ఆధ్వర్యంలో 24న అట్లతద్ది వేడుకలు

**ఫ్రిస్కో:** తెలుగింటి ఆడపడుచులందరి కోసం ఉత్తర టెక్సాస్ తెలుగు సంఘం (టాంటెక్స్) ఆధ్వర్యంలో 40వ వార్షికోత్సవం సందర్భంగా అట్లతద్ది వేడుక నిర్వహించనున్నారు. ప్రముఖ యాంకర్ బెజవాడ బేబక్క ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. ఈ నెల 24వ తేదీ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఫ్రిస్కో ఫ్లయర్స్ ఈవెంట్ సెంటర్‌లో జరిగే కార్యక్రమంలో భాగంగా ప్రత్యేకంగా గౌరీ పూజ జరుపుతారు. గోరింటాకు పెట్టుకోవడం, ఉయ్యాల ఊగడం, అట్ల వాయనం వంటి సంప్రదాయ కార్యక్రమాలు ఉంటాయి. కోలాట ప్రదర్శనతో పాటు విభిన్న వినోద కార్యక్రమాలు, ఆకర్షణీయమైన బహుమతులు అందించనున్నారు. ప్రవేశం పూర్తిగా ఉచితం. దీపిక పేట (వనిత వేదిక చైర్), దీప్తి సూర్యదేవర (ఈవెంట్ కో-ఆర్డినేటర్), మాధవి లోకిరెడ్డి (టాంటెక్స్ అధ్యక్షురాలు), టాంటెక్స్ గవర్నింగ్ బోర్డు సభ్యులు నాయకత్వం వహిస్తున్నారు.

## చావును గెలిచిన మహిళా ఖైదీ

### రెండు విష ఇంజెక్షన్లు ఇచ్చినా ప్రాణాలతోనే...

### అమెరికాలో ఉత్కంఠ రేపిన మరణశిక్ష అమలు

**వాషింగ్టన్:** అమెరికాలోని టెన్నెసీ రాష్ట్రంలో అరుదైన ఉదంతం చోటుచేసుకుంది. 1995 నాటి హత్య కేసులో దోషిగా తేలి మరణశిక్ష




అనుభవిస్తున్న క్రిస్టా గెయిల్ పైక్‌కు అధికారులు శిక్షను అమలు చేసేందుకు ప్రయత్నించారు. ఇందులో భాగంగా ఆమెకు రెండు ప్రాణాంతక విష ఇంజెక్షన్లు ఇచ్చారు. అయినప్ప టికీ క్రిస్టా శ్వాస తీసుకోవడం కొనసాగడంతో అధికారులు శిక్ష అమలు ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేశారు. అనంతరం ఆమెను అత్యవసర వైద్యం కోసం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం క్రిస్టా ఆరోగ్య పరిస్థితిపై స్పష్టమైన సమాచారం లేదని ఆమె తరపు న్యాయవాది వెల్లడించారు. సదరు ఘటనపై థర్డ్ పార్టీ ద్వారా సమగ్ర సమీక్ష, విచారణ జరిపించాలని టెన్నెసీ గవర్నర్ బిల్ లీ ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఈ ఏడాది చివరి వరకు అన్ని మరణశిక్షల అమలును నిలిపివేస్తున్నట్టు గవర్నర్ అధికారికంగా ప్రకటించారు. కాగా గత 200 ఏళ్ల టెన్నెసీ చరిత్రలో మరణశిక్ష పడిన తొలి మహిళగా క్రిస్టా నిలిచారు.

## ఆల్బని ఆంధ్ర సంఘం ఆధ్వర్యంలో కుట్టు మిషన్ల పంపిణీ

**కొండపల్లి:** ఆల్బని ఆంధ్ర సంఘం ఆధ్వర్యంలో కొండపల్లి గర్ల్స్ హైస్కూల్లోని బాలికలకు పది కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. వీటిని విద్యార్థినులకు చక్కగా వినియోగిస్తున్నారని, అందుకు తాము చాలా సంతోషిస్తున్నామని ఆల్బని ఆంధ్ర సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఆల్బని ఆంధ్ర సంఘం ఆధ్వర్యంలో అక్షయ శక్తి అన్న పథకంలో భాగంగా అక్షయ ధాక సహకారంతో 20 మంది మహిళలకు కూడా కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. తరగతుల నిర్వహణకు నిధులు సమకూర్చారు. ఈ మొత్తం నిధులను అందించింది. మూడు నెలల పాటు కుట్టు మిషన్ల శిక్షణ నిర్వహించారు. కొత్తగా పొందిన ఈ నైపుణ్యాలు, విద్యార్థినులకు కుట్టుపనిలో వృత్తిని చేపట్టడానికి, జీవనోపాధి పొందడానికి ఒక ముందడుగు వేయడానికి సహాయపడుతుందని ఆల్బని ఆంధ్ర సంఘ ప్రతినిధులు పేర్కొన్నారు.







# 'మీ ధైర్యం, సహనం, సమయస్ఫూర్తి ఎంతోమంది ప్రాణాలను కాపాడాయి

## కెప్టెన్ స్మిత్‌కు వీడియో కాల్‌లో ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంస



ఫైదుబాయ్ విమానాన్ని ప్రమాదం నుంచి కాపాడిన కెప్టెన్ స్మిత్ మచ్చర్‌తో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇవాళ (శుక్రవారం) వీడియో కాల్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా కెప్టెన్ ధైర్యం, సహనం, సమయస్ఫూర్తిని ప్రధాని ప్రశంసించారు. గత బుధవారం ఉదయం దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు బయలుదేరిన ఫైదుబాయ్ విమానంలో ఉద్రిక్తతలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. విమానం గాల్లో ఉండగా కెప్టెన్ స్మిత్‌పై సహ పైలట్ కత్తితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడినప్పటికీ ఆయన 173 మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడారు. ఈ నేపథ్యంలో చికిత్స పొందుతున్న కెప్టెన్ స్మిత్‌తో ప్రధాని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆ రోజు జరిగిన ఘటనను వివరిస్తూ ప్రధానికి ఆయన పలు విషయాలు వెల్లడించారు.

'నేను 17 ఏళ్లుగా విమానాలు నడుపుతున్నాను. గత 11 ఏళ్లుగా కెప్టెన్‌గా పనిచేస్తున్నాను. కళ్లు మూసుకున్నా విమానంలో ఏం జరుగుతుందో అర్థం చేసుకోగలను. నేను కింద పడిపోయిన సమయంలో విమానం వేగంగా కిందికి వెళ్తున్నట్లు అనిపించింది. ఆ సమయంలో ఏమీ చేయకుండా ఉంటే అందరి ప్రాణాలు పోతాయని గ్రహించాను. ఇదే చివరి అవకాశం అనుకున్నా. కాక్‌పిట్ తలుపు అక్కడే ఉందని భావించి, ఎలాగోలా తలుపు తెరిచా. ఆ తర్వాత ప్రయాణికులు, సిబ్బంది సహాయం చేశారు. విమానంలోని ఒక్క ప్రాణాన్ని కూడా పోనివ్వలేదు' అని ప్రధానికి కెప్టెన్ స్మిత్ వివరించారు.

### మోదీ ప్రశంసలు..

ఈ సందర్భంగా ప్రధాని మోదీ స్పందిస్తూ.. కెప్టెన్ స్మిత్ ధైర్యాన్ని అభినందించారు. 'మీ ధైర్యం, సహనం, సమయస్ఫూర్తి ఎంతోమంది ప్రాణాలను కాపాడాయి. మీరు ఇంత తీవ్రమైన గాయాలతో ప్రాణాల కోసం పోరాడుతున్నప్పటికీ, ప్రయాణికుల ప్రాణాల గురించి ఆలోచించారు. 140 కోట్ల మంది భారతీయులు మిమ్మల్ని చూసి గర్విస్తున్నారు. మీరు చేసినది అసాధారణమైన పని. ప్రపంచవ్యాప్తంగా ప్రజలు మిమ్మల్ని చూడాలని, మీతో మాట్లాడాలని ఆసక్తిగా ఉన్నారు' అని ప్రధాని మోదీ ప్రశంసించారు

### హనుమాన్ చాలీసా పఠిస్తా..

మరోవైపు, తాను భయపడినప్పుడు హనుమాన్ చాలీసా పఠిస్తానని ప్రధాని మోదీకి కెప్టెన్ స్మిత్ తెలిపారు. ఈ ఘటన జరిగినప్పుడూ తాను హనుమాన్ చాలీసానే జపించానని, దేవుడే కాపాడాడని తనకు తెలుసని చెప్పుకొచ్చారు.

తన రెండేళ్ల కుమారుడికి ప్రతిరోజూ ఉదయం హనుమాన్ చాలీసా చదివి వినిపిస్తానని ఆయన తెలిపారు. తాము దేశానికి దూరంగా ఉన్నప్పటికీ భారతీయ సంస్కృతికి దూరం కాకూడదనే ఉద్దేశంతో ఇలా చేస్తున్నానని కెప్టెన్ పేర్కొన్నారు.

# భారత ఆర్థికాభివృద్ధికి జీఈసీ 3 స్కీం అత్యంత కీలకం

## యూఎన్ క్లైమేట్ చీఫ్ సైమన్ స్టీల్



గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఫేజ్ 3 (జీఈసీ 3) స్కీం భారతదేశ ప్రజలతో పాటు ఆ దేశ ఆర్థిక వ్యవస్థకూ భారీగా లాభాలు తెచ్చిపెడుతుందని యూఎన్ క్లైమేట్ చీఫ్ సైమన్ స్టీల్ అన్నారు. ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిన తరువాత స్టీల్ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. భారత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి జీఈసీ 3 స్కీం అత్యంత కీలకమైన స్కీంగా ఆయన అభివర్ణించారు. 'భారత గ్రిడ్ స్ట్రెంతెనింగ్ అండ్ బ్యాటరీ స్టోరేజీ పథకం ఆ దేశ ఆర్థిక వ్యవస్థను ముందుకు తీసుకెళ్లే కీలక పథకం. ఈ పథకంతో భారత ప్రజలతో పాటు ఆ దేశ ఆర్థిక వ్యవస్థకూ మంచి డివిడెండ్లు వస్తాయి. అలాగే, భారత్‌లో పెరుగుతున్న పునరుత్పాదక ఇంధన సామర్థ్యానికి కూడా ఈ స్కీం మరింత ఉపకరిస్తుంది. ప్రజల రోజువారి ఇంధన అవసరాలు తీరడంతో పాటు భారత ఆర్థిక వృద్ధికి మరింత బూస్ట్ చేకూరుతుంది. మొత్తానికి అంతర్జాతీయ సోలార్ సూపర్‌పవర్‌గా అవతరించడంలో భారత్‌కు జీఈసీ 3 స్కీం దోహదపడుతుంది' అని స్టీల్ పేర్కొన్నారు.

### పవర్ గ్రిడ్లతో మరిన్ని ఉద్యోగావకాశాలు

భారత్ వంటి భారీ ఆర్థిక వ్యవస్థగల దేశాలు ఇంధన భద్రత, ఆర్థిక వృద్ధిని సాధించేందుకు జీఈసీ3 పథకం వ్యూహాత్మక అవకాశాన్ని కల్పిస్తుందని సైమన్ స్టీల్ చెప్పారు. అంతేకాకుండా బలమైన పవర్ గ్రిడ్లు, బ్యాటరీ స్టోరేజీలతో తయారీ, నిర్మాణం, ఎనర్జీ స్టోరేజీ రంగాల్లో మరిన్ని ఉద్యోగావకాశాలు కలుగుతాయన్నారు. కాగా.. వాతావరణ మార్పులపై ఐక్యరాజ్యసమితి ఫ్రేమ్‌వర్క్ కన్వెన్షన్‌కు స్టీల్ కార్యనిర్వాహక సెక్రటరీగా ఉన్నారు. ఇక జీఈసీ 3 స్కీంతో 135 గిగావాట్ల పునరుత్పాదక శక్తిని సరఫరా చేయడానికి, అనుసంధానించడానికి అంతరాష్ట్ర ట్రాన్స్‌మిషన్ సిస్టమ్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయనున్నారు. అలాగే, గ్రిడ్ స్థిరత్వాన్ని కొనసాగించేందుకు పునరుత్పాదక వనరుల నుంచి గ్రిడ్ ఆపరేటర్లు అప్పుడప్పుడు శక్తిని పరిమితం చేస్తుంటారు.

జీఈసీ 3తో భవిష్యత్తులో శక్తిని పరిమితం చేయాల్సిన అవసరం కూడా ఉండదు. జీఈసీ 3 పథకం మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.1.86 లక్షల కోట్లు. అందులో అంతర్రాష్ట్ర ట్రాన్స్‌మిషన్ సిస్టమ్‌కు రూ.1.36 లక్షల కోట్లు, 50 గిగావాట్ల బ్యాటరీ స్టోరేజ్ సిస్టమ్స్‌కు రూ.50 వేల కోట్లు ఖర్చుపెట్టనున్నారు.

# విషాదంగా విహార యాత్ర

## సముద్రంలో మునిగిపోయి 8 మంది మృతి



ఈత సరదా 8 మంది ప్రాణాలను బలి తీసుకుంది. సముద్రంలో సరదాగా ఈత కొడుతున్న విద్యార్థులు ఒక్కసారిగా అలలకు కొట్టుకుపోయారు. చివరకు ప్రాణాలు కోల్పోయారు. మహారాష్ట్రలోని రాయ్‌గఢ్ జిల్లాలో ఈ ప్రమాదం జరిగింది. పుణెలోని అకందిలో ఓ కోచింగ్ సెంటర్‌కు చెందిన 11, 12వ తరగతి విద్యార్థులు.. రాయ్‌గఢ్ జిల్లాలోని దిఘీ సాగరిలో దివేగర్ బీచ్‌కు వెళ్లారు. మొత్తం 48 మంది వచ్చారు. వారిలో 25 మంది బాలురు, 17 మంది బాలికలు, ఆరుగురు టీచర్లు ఉన్నారు. విద్యార్థుల్లో కొంతమంది బీచ్‌లో దిగి ఈత కొట్టడం ప్రారంభించారు. ఈ క్రమంలో ఒక్కసారిగా వచ్చిన అలలు.. 8 మంది విద్యార్థులను సముద్రంలోకి ఈడ్చుకెళ్లాయి. దీంతో భయపడిపోయిన వారి స్నేహితులు బిగ్గరగా కేకలు వేశారు. తమ స్నేహితులు సముద్రంలో కొట్టుకుపోతుండగా నిస్సహాయ స్థితిలో ఉండిపోయారు. వారిని కాపాడాలని బిగ్గరగా అరిచారు. విద్యార్థుల కేకలు విని టూరిస్టులు, స్థానికులు అప్రమత్తమయ్యారు. వాటర్ స్పోర్ట్స్‌కు చెందిన బహు సాలుంకే, ఆయన బృందం వెంటనే రంగంలోకి దిగారు. కొట్టుకుపోయిన విద్యార్థుల కోసం వారు తీవ్రంగా గాలించారు. అయినా కూడా విద్యార్థుల జాడ తెలియరాలేదు. అలాగే పోలీసులు కూడా బీచ్‌కు చేరుకుని స్థానికుల సాయంతో గాలింపు చేపట్టారు. కొన్ని గంటల తర్వాత విద్యార్థుల మృతదేహాలను కనుగొన్నారు. ఆ మృతదేహాలను సముద్రం నుంచి రికవరీ చేశారు. పోస్టుమార్టం కోసం మృతదేహాలను బోర్లి పంచతన్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తమ కళ్ల ముందే స్నేహితులు చనిపోవడంతో విద్యార్థులు తీవ్రంగా విలపించారు. విహారయాత్ర విషాదంగా మారిందంటూ ఆవేదన వ్యక్తం చేశారు.



# భారత్‌కు 114 రఫేల్ యుద్ధ విమానాలు

## కొనుగోలు ప్రక్రియ వేగవంతం : కేంద్ర రక్షణశాఖ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్

భారత వాయుసేనను పటిష్ఠం చేయడంలో భాగంగా 114 రఫేల్ యుద్ధవిమానాల కొనుగోలు ప్రక్రియ ముందుకు సాగుతోంది. ఈ ఆర్థిక సంవత్సరం(2027 మార్చి) ముగిసేలోగా దీనిపై ఓ నిర్ణయానికి వచ్చే అవకాశముందని కేంద్ర రక్షణశాఖ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్ తెలిపారు. రఫేల్ విమానాల తయారీలో అధిక స్థాయిలో స్వదేశీకరణతో పాటు భారతీయ ఆయుధాలు, వ్యవస్థలను అనుసంధానించడంపై దృష్టి పెట్టినట్టు ఆయన వివరించారు.

ఈ కొనుగోలు ప్రక్రియ 'బై అండ్ మేక్' విధానంలో సాగనుందని, ఇందులో అధిక సంఖ్యలో రఫేల్ విమానాలను భారత్‌లోనే అసెంబుల్ చేయనున్నారని రాజేశ్ తెలిపారు. ఇప్పటికే రఫేల్ మెరైన్ విమానాల్లో భారతీయ ఆయుధాల అనుసంధానానికి అంగీకారం లభించిందని ఆయన అన్నారు. 114 రఫేల్ జెట్ల కోసం ఆహ్వానించిన ప్రతిపాదనలపై(ఆర్ఎఫ్‌పీ) బిడ్లు అందాయని, ప్రస్తుతం వాటిని అధికారికంగా పరిశీలిస్తున్నామని చెప్పుకొచ్చారు.

మరోవైపు.. తేజస్ ఎమ్‌కే2 అభివృద్ధి కూడా కొనసాగుతోందని రక్షణశాఖ కార్యదర్శి తెలిపారు. వచ్చే ఏడాది మధ్యలో తొలి విమాన ప్రయోగం నిర్వహించేలా ప్లాన్ చేస్తున్నామన్నారు. ప్రొటోటైప్‌లు సిద్ధమైన తర్వాత భారత వాయుసేన వాటిని పరిశీలించి తదుపరి నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ రంగ సంస్థ హెచ్ఏఎల్ సహా ప్రైవేట్ సంస్థలు, ఎంఎస్ఎంఈలకూ గణనీయమైన భాగస్వామ్యం ఉంటుందని వివరించారు.



ఇక.. ఐదో తరం యుద్ధ విమానాల గురించి రాజేశ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రస్తుతం విదేశీ ప్రాజెక్టును చేపట్టే ఆలోచనలేవీ లేవని స్పష్టం చేశారు. భారత్ స్వయంగా అభివృద్ధి చేస్తున్న అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్(ఏఎమ్‌సీఏ)పైనే దృష్టి ఉందన్నారు. దాని కోసం ఎంపిక చేసిన సంస్థల నుంచి ఆర్ఎఫ్‌పీలను ఆహ్వానించామని, క్లిష్టమైన ప్రాజెక్ట్ కావడంతో సంస్థలు మరింత సమయం కోరాయని ఆయన తెలిపారు.

చైతన్యరథం

# స్వాతంత్ర్య సంబరాల్లో 'ఏనుగు విందు'..

### బోట్స్‌వానా నిర్ణయంపై విస్తుపోతున్న ప్రపంచం



ఆఫ్రికా దేశం బోట్స్‌వానాలో ప్రస్తుతం స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు జరుగుతున్నాయి. బ్రిటన్ నుంచి స్వాతంత్ర్యం పొంది 60 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో, స్థానిక ప్రభుత్వం తీసుకున్న ఒక నిర్ణయం ఇప్పుడు తీవ్ర వివాదంగా మారింది. వేడుకల కోసం 23 ఏనుగులను వేటాడి, వాటి మాంసాన్ని పంచి పెట్టేందుకు పర్యావరణ, టూరిజం శాఖ అనుమతి ఇచ్చింది. ఈ ఆదేశాలపై వన్యప్రాణుల సంరక్షణ అధికారులు, జంతు హక్కుల నేతలు తీవ్రంగా మండిపడుతున్నారు. సంబరాల కోసం ఏనుగు మాంసం పంచడం సరికాదని వారి అభిప్రాయం. ఎలిఫెంట్ ప్రొటెక్షన్ సొసైటీ చైర్మన్ ఓటాసి నవా మాట్లాడుతూ, ఇలాంటి సందేశం దేశంలో తప్పుడు సంకేతాలు పంపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల వన్యప్రాణుల సంరక్షణ కష్టంగా మారుతుందని, ఏనుగుల అక్రమ వేటను ప్రోత్సహించినట్టు అవుతుందని హెచ్చరించారు. మరోవైపు బోట్స్‌వానాలో ప్రస్తుతం ఫూట్ అండ్ మౌత్ వ్యాధి విస్తరిస్తోంది. ఇలాంటి సమయంలో ఏనుగు మాంసం తినేందుకు ప్రభుత్వం అనుమతించడం సమస్యను మరింత పెంచుతుందని నిపుణులు అంటున్నారు. ఏనుగులకు సంస్కృతి, పర్యావరణ పరంగా ప్రత్యేక స్థానం ఉందని, వాటికి బదులు దున్నపోతులను వేటాడి ఉంటే బాగుండేదని ఓ స్థానిక తెగ వ్యక్తి అభిప్రాయపడ్డారు.

దేశంలోని 8 జిల్లాల్లో 23 ఏనుగుల వేటకు అనుమతి లభించింది. ఇప్పటివరకు ఎన్ని ఏనుగులను చంపారన్నది తెలియరాలేదు. అయితే ప్రపంచంలోనే అత్యధిక ఏనుగులు ఉన్న దేశం బోట్స్‌వానానే. అధికారిక లెక్కల ప్రకారం అక్కడ సుమారు 1,30,000 ఏనుగులున్నాయి. ప్రభుత్వ ఆదేశాలు వచ్చాయో లేదో.. అనేక ప్రాంతాల్లో ఏనుగుల కళేబరాల వద్ద మాంసం కోసం జనం ఎదురుచూస్తున్నట్టు సమాచారం.

## అతడు నాపై చాలాసార్లు దాడి చేశాడు

### కాక్‌పిట్‌లో రక్తపాతం.. కెప్టెన్ స్మిత్ మచ్చర్ వీడియో వైరల్




దుబాయ్ నుంచి ఇజ్రాయెల్ బయల్దేరిన ఫ్లైదుబాయ్ విమానంలో జరిగిన హింసాత్మక ఘటనపై ముమ్మర దర్యాప్తు కొనసాగుతోంది. కాక్‌పిట్‌లో జరిగిన దాడికి సంబంధించిన దృశ్యాలు తాజాగా బయటకు వచ్చాయి. ఇజ్రాయెల్‌కు చెందిన పలు మీడియా ఛానళ్లు ప్రసారం చేసిన ఈ వీడియోను నెటిజన్లు విస్తృతంగా షేర్ చేస్తున్నారు. కాక్‌పిట్ సమీపంలోని సీటు నుంచి ప్రయాణికులు దీన్ని రికార్డు చేసినట్లు తెలుస్తోంది. వీడియోలో భారత కెప్టెన్ స్మిత్ మచ్చర్ మాటలు వినిపించాయి. రక్తపు మడుగులో ఉన్న ఆయన, "అతడు నాపై చాలాసార్లు దాడి చేశాడు. సాయం చేయండి. నా చేతికి బలమైన గాయమైంది, కదపలేకపోతున్నా" అని చెప్పారు. కో-పైలట్ తనపై దాడి చేశాడని తెలిపారు. "అతడు విమానాన్ని కూల్చేందుకు ప్రయత్నిస్తున్నాడు" అని ఓ ప్రయాణికుడు హిబ్రూలో అరవడం, "డాక్టర్ ఎవరైనా ఉన్నారా?" అని మరొకరు అడగడం రికార్డయింది. వెంటనే ఇజ్రాయెల్ డెంటిస్ట్ షోటా వచ్చి స్మిత్‌కు చికిత్స ప్రారంభించారు. ఈ ఘటనతో విమానం సౌదీ అరేబియాలో అత్యవసరంగా దిగింది. స్మిత్‌ను వెంటనే స్థానిక మిలిటరీ ఆసుపత్రికి తరలించి, తదుపరి వైద్యం కోసం గురువారం యూఏఈకి ఎయిర్‌లిఫ్ట్ చేశారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని భారత ఎంబసీ వెల్లడించింది. మరోవైపు, దాడి చేసిన కో-పైలట్ ఉగ్రవాది అయి ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనకు ఇరాన్‌తో సంబంధం ఉండొచ్చని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సందేహం వ్యక్తం చేశారు. దర్యాప్తు ప్రారంభించామని, ఇరాన్ హస్తం ఉన్నట్లు తేలితే "చాలా భీకరంగా దాడి చేస్తాం" అని హెచ్చరించారు. అంతకుముందు స్మిత్‌ను ఆయన "హీరో" అని కొనియాడారు.

## ఆకాశంలో 180 ప్రాణాల రక్షకుడు

### కెప్టెన్ స్మిత్ మచ్చర్‌కు 'అశోక చక్ర'?



ఫ్లైదుబాయ్ పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌ను అశోక చక్ర అవార్డుతో సత్కరించే ఆలోచనలో భారత ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. దుబాయ్ నుంచి ఇజ్రాయెల్ వెళ్తున్న విమానాన్ని కోపైలట్ కూల్చేందుకు ప్రయత్నించగా, ఆ కుట్రను భగ్నం చేసి సుమారు 180మంది ప్రాణాలను ఆయన కాపాడారు. ఈ సాహసానికి ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ కూడా ఆయన్ను హీరోగా కీర్తించారు. గుజరాతీ మూలాలున్న మచ్చర్‌కు గుజరాత్ ప్రభుత్వం ఇప్పటికే 'విశిష్ట్ గుజరాత్ గిరిమా' అవార్డును ప్రకటించింది. ఆయన ధైర్యసాహసా లను మెచ్చుకుంటూ సోమనాథ్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన త్వరగా కోలుకోవాలని కాశీ విశ్వనాథ ఆలయంలోనూ పూజలు చేశారు. అత్యంత ధైర్యసాహసాలు ప్రదర్శించిన వారికి అశోక చక్ర ఇస్తారు. మచ్చర్‌కు ఈ పురస్కారం దక్కితే, దాన్ని అందుకున్న రెండో విమానయాన వ్యక్తిగా ఆయన నిలుస్తారు. గతంలో పాన్ ఆమ్ ఫ్లైట్ 73లో సీనియర్ ఫ్లైట్ పర్సన్‌గా పనిచేసిన నీరజ్ భానోత్‌కు ఈ గౌరవం లభించింది. హైజాక్ అయిన విమానంలోని ప్రయాణికులను కాపాడి, ఆమె తన ప్రాణాలను త్యాగం చేశారు.

## నీళ్లు తోడేస్తే నేల కుంగుతుంది..!

### కుంగిపోతున్న మహానగరాలకు 'ఒసాకా' పాఠం



*భూగర్భ జలాలను అతిగా తోడేయడం వల్ల ప్రపంచవ్యాప్తంగా మహానగరాలు నేలలోకి కుంగిపోతున్నాయి. తీర నగరాల్లో ఇది ముంపు ప్రమాదాన్ని మరింత పెంచుతోంది. ఇండోనేసియా రాజధాని జకార్తా ఏడాదికి 10 సెంటీమీటర్లకు పైగా కుంగుతోంది. సముద్రపు నీరు లోపలికి చొచ్చుకురావడంతో నగరంలోని కొన్ని ప్రాంతాలను ప్రభుత్వం ఖాళీ చేయించాల్సి వచ్చింది. చైనాలో కోటిన్నర జనాభా ఉన్న టియాన్జిన్ నగరమూ కుంగిపోతోంది. ఇదే తీరు కొనసాగితే 2120 నాటికి నగర జనాభాలో 15 శాతం ముంపునకు గురవుతారు. అమెరికాలోని శాండియాగో నుంచి ఇరాన్ నగరాల వరకూ ఇదే పరిస్థితి. న్యూజిలాండ్‌లోనూ తీర ప్రాంతం 80 శాతం కుంగిపోయింది, వెల్లింగ్టన్, క్రైస్ట్‌చర్చ్ నగరాలదీ ఇదే కథ.*

*చాలా నగరాలు భూగర్భ నీటి బుగ్గలపై నిర్మితమయ్యాయి. ఈ బుగ్గలను ఒక బెలూన్‌లా ఊహించుకోండి. అదే పనిగా నీళ్లు తోడేస్తే ఆ బెలూన్ చిక్కిపోయి, పైన ఉన్న నగరం కుంగిపోతుంది. అయితే జపాన్‌లోని ఒసాకా నగరం ఈ ముప్పు నుంచి బయటపడి ఆశ చూపిస్తోంది. 1920--60 మధ్య భారీగా నీటిని తోడేయడంతో అక్కడ భూగర్భ నీటి మట్టాలు 30 మీటర్ల మేర పడిపోయాయి, కొన్ని చోట్ల భూమి రెండు మీటర్లకు పైగా కుంగింది. దీంతో జపాన్ ప్రభుత్వం భూగర్భ జల వినియోగంపై కఠిన నియంత్రణ విధించింది. ఫలితంగా ఒసాకాలో నీటి మట్టాలు కోలుకుంటున్నాయి, భూమి మళ్లీ పైకి లేస్తోంది. కొన్ని చోట్ల ఏడాదికి సగటున 4 మిల్లీమీటర్లు, మరికొన్ని చోట్ల 12 మిల్లీమీటర్ల చొప్పున నేల పైకి వస్తోంది. దీనికి కారణం భూగర్భంలోని పగుళ్లేనని వెల్లింగ్టన్‌లోని విక్టోరియా విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు చెప్పారు. ఈ పగుళ్లు భూకంపాలకు దారితీస్తాయని ఇంతవరకు అనుకునేవారమని, కానీ అవి భూగర్భ జలాలకు ఆనకట్టలా పనిచేస్తాయని పరిశోధనలో తేలిందని వివరించారు.*

## కవ్విస్తే.. అణ్వాయుధ ప్రయోగమే!

### ఐరోపాకు పుతిన్ హెచ్చరిక.. రష్యాకు దాడి ఆలోచన లేదని



ఐరోపా దేశాలపై దాడి చేసే ఉద్దేశం తమకు లేదని రష్యా అధ్యక్షుడు పుతిన్ స్పష్టంచేశారు. ఉక్రెయిన్ విషయంలో ఉద్రిక్తతలను పెంచొద్దని ఆయా దేశాలను కోరారు. మాస్కోలోని వాల్డాయ్ ఫోరంలో మాట్లాడుతూ.. "ఏ ఐరోపా దేశంపైనా దాడి చేసే ప్రణాళికలు రష్యాకు లేవు. వాటితో శాంతియుత సంబంధాలు కొనసాగించాలనుకుంటున్నాం. అయితే, కలినిన్రాడ్ సహా ఇతర రష్యా భూభాగంపై ఐరోపా దేశాలు ప్రత్యక్ష దాడి చేస్తే మాత్రం ఊరుకునేది లేదు. అదే జరిగితే మావద్ద ఉన్న అన్ని ఆయుధాలతో పాటు అణ్వాయుధాలనూ ప్రయోగిస్తాం" అని నాటో దేశాలను పుతిన్ హెచ్చరించారు. అదే సమయంలో తమపై ఉక్రెయిన్ జరిపే దాడులకు ఐరోపా దేశాలు మద్దతిచ్చినా.. తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు.

నాటో సభ్య దేశాలైన పోలాండ్, లిథువేనియా మధ్య ఉన్న కలినిన్రాడ్.. రష్యాకు వ్యూహాత్మకంగా కీలకమని పుతిన్ పేర్కొన్నారు. ఈ ప్రాంతాన్ని దిగ్బంధించడానికి కూటమి ప్రయత్నిస్తే.. తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. అది ప్రపంచ దేశాలకే ప్రమాదమన్నారు. సైనికపరంగా నాటో రష్యాకంటే రెండింతలు పెద్దదని పుతిన్ గుర్తు చేశారు. ఫ్రాన్స్, బ్రిటన్ల వద్ద ఉన్న అణు సామర్థ్యాలపై తమకు పూర్తి అవగాహన ఉందన్నారు. అయినప్పటికీ ఈ పోటీలో తామే ఆధిక్యత సాధిస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు.

నల్ల సముద్ర ప్రాంతంలోని ఉక్రెయిన్ లక్ష్యాలపై దాడులను నిలిపివేసే ప్రసక్తే లేదని పుతిన్ స్పష్టం చేశారు. మాస్కోలోని చమురు శుద్ధి కర్మాగారాలపై ఉక్రెయిన్ జరిపిన దాడుల వల్ల తమ జీడీపీలో సుమారు ఒక శాతం నష్టం వాటిల్లిందన్నారు. నాటో విస్తరణ, ఐరోపా దేశాల జోక్యం వల్లే ఉక్రెయిన్ యుద్ధం కొనసాగుతోందన్నారు.

### శాంతి మంత్రం మోదీ దగ్గరుంది: పుతిన్

భారత ప్రధాని నరేంద్ర మోదీపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రశంసల వర్షం కురిపించారు. ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని ముగించే విషయంలో మోదీ వద్ద మంచి ఆలోచనలు ఉన్నాయని అన్నారు. వాల్డాయ్ ఇంటర్నేషనల్ డిస్కషన్ క్లబ్ సమావేశంలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరుపక్షాలూ అంగీకరించేలా యుద్ధాన్ని ఆపే మార్గాలు మోదీ దగ్గర చాలా ఉన్నాయని పుతిన్ తెలిపారు. తామిద్దరూ ఎక్కడ కలిసినా, ప్రతిసారీ యుద్ధం ముగింపు గురించే మోదీ చర్చిస్తారని చెప్పారు. యుద్ధాలను ఆపడంలో మోదీ వ్యూహం ప్రత్యేకమైనదని, ప్రపంచ నేతల్లో ఆయన ఒకరని కొనియాడారు. మోదీతో తనకు స్నేహపూర్వక సంబంధాలున్నాయని, వ్యక్తిగతంగానూ మంచి అనుబంధం ఉందని వెల్లడించారు. ఢిల్లీలో జరిగిన బ్రిక్స్ సమావేశాల సమయంలోనూ ఉక్రెయిన్ యుద్ధం గురించి మోదీ అడిగారని గుర్తు చేశారు. మరోవైపు, భారత్ చేపట్టే శాంతి ప్రయత్నాలను స్వాగతిస్తామని క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ స్పష్టం చేశారు. చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే ఉక్రెయిన్ సంక్షోభాన్ని పరిష్కరించుకోవాలన్న భారత్ సూచనలను తాము కూడా అంగీకరిస్తున్నామని ఆయన తెలిపారు.

# స్వర్ణ సమరానికి సై!




- **పాక్‌తో ఫైనల్లో టీమిండియాకు అసలైన పరీక్ష..**
- **బ్యాటింగ్, స్పిన్‌పైనే ఆశలు...**




ఆసియా క్రీడల్లో భారత క్రికెట్ జట్టు స్వర్ణ పతకానికి అడుగు దూరంలో ఉంది. అంచనాలకు తగ్గట్టుగానే ఫైనల్‌కు చేరిన టీమ్ఇండియా.. శనివారం జరిగే తుది పోరులో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. రెండు దేశాల మధ్య క్రికెట్ మ్యాచ్ అంటేనే అభిమానుల్లో ఉండే ఉత్కంఠ వేరు. అలాంటిది ఆసియా క్రీడల్లో పసిడి పతకం కోసం పోటీ పడుతుండటంతో.. మ్యాచ్‌పై ఆసక్తి మరింత పెరిగింది. భారత జట్టు పటిష్ఠంగా కనిపిస్తున్నా.. మైదానంలో పాకిస్థాన్‌ను తక్కువ అంచనా వేయడానికి వీల్లేదు. అనిశ్చితికి మారుపేరైన ఆ జట్టు.. భారత్‌తో మ్యాచ్ అనగానే అసాధారణంగా పోరాడేందుకు సిద్ధమవుతుంది. ఈ నేపథ్యంలో భారత ఆటగాళ్లు తమ సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో ప్రదర్శిస్తేనే స్వర్ణ పతకం సొంతమవుతుంది.

**బ్యాటింగే అసలు పరీక్ష**

శ్రీలంకతో జరిగిన సెమీఫైనల్ భారత జట్టుకు కొన్ని కీలక పాఠాలు నేర్పింది. ముఖ్యంగా నిషిన్ మైదానంలోని పిచ్‌పై బ్యాటింగ్ చేయడం సులభం కాదనే విషయం స్పష్టమైంది. ఇషాన్ కిషన్, వైభవ్ సూర్యవంశీ రాణించడంతో భారత్ పోటీలో నిలవగలిగింది. అయితే మిగతా బ్యాటర్ల నుంచి ఆశించిన స్థాయిలో సహకారం లభించలేదు. కీలక సమయంలో వికెట్లు కోల్పోవడం జట్టు ఆందోళన చెందాల్సిన అంశం. ఫైనల్ కూడా ఇదే మైదానంలో జరగనుండటంతో భారత బ్యాటర్లు తమ వ్యూహాలను మార్చుకోవాల్సిన అవసరముంది. అయితే ఫైనల్‌లో పిచ్‌ను ఉపయోగిస్తారనే దానిపై స్పష్టత లేదు. మైదానంలోని పిచ్‌లన్నీ ఒకే స్వభావంతో ఉంటాయని భారత ఆటగాడు అక్షర్ పటేల్ పేర్కొన్న నేపథ్యంలో.. పరిస్థితులను ముందుగానే అంచనా వేసి ఆడటం కీలకం. పవర్‌ప్లేలో వికెట్లు కాపాడుకుంటూనే పరుగులు సాధించడం, మధ్య ఓవర్లలో స్పిన్నర్లను సమర్థంగా ఎదుర్కోవడం, చివరి ఓవర్లలో వేగం పెంచడం భారత బ్యాటింగ్ ప్రణాళికలో ప్రధానాంశాలు కావాలి. ఒక్కరిద్దరిపై ఆధారపడకుండా టాప్ ఆర్డర్ నుంచి మిడిల్ ఆర్డర్ వరకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాల్సి ఉంటుంది.

**స్పిన్‌ను ఎదుర్కొంటేనే..**

నిషిన్ పిచ్‌పై స్పిన్నర్ల ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. శ్రీలంకతో సెమీస్‌లో భారత బౌలింగ్ విభాగం దీనిని మరోసారి నిరూపించింది. ప్రధాన పేసర్‌గా జస్‌ప్రీత్ బుమ్రాను మాత్రమే బరిలోకి దించిన భారత్.. స్పిన్నర్ల సహకారంతో ప్రత్యర్థి బ్యాటర్లను కట్టడి చేసింది. స్పిన్‌కు అనుకూలించే పరిస్థితుల్లోనూ బుమ్రా వికెట్లు సాధించడం జట్టుకు సానుకూలాంశం. ఇక పార్ట్‌టైమ్ స్పిన్నర్ అభిషేక్ శర్మ కూడా రెండు వికెట్లు పడగొట్టి తన సత్తా చాటుకున్నాడు. శ్రీలంక ఇన్నింగ్స్ చివర్లో వరుస బంతుల్లో రెండు వికెట్లు తీసి ప్రత్యర్థి తోకను కత్తిరించాడు. అతడి బౌలింగ్ భారత్‌కు అదనపు ఆయుధంగా మారింది. అయితే ఫైనల్లో పాకిస్థాన్ బ్యాటర్లు కూడా స్పిన్‌ను ఎదుర్కొనేందుకు ప్రత్యేకంగా సిద్ధమయ్యే అవకాశముంది. అందువల్ల భారత స్పిన్నర్లు కేవలం పరుగులను నియంత్రించడమే కాకుండా వికెట్లు తీసే దిశగా బౌలింగ్ చేయాలి. బుమ్రా కొత్త బంతితో ఇచ్చే ఆరంభం, మధ్య ఓవర్లలో స్పిన్నర్లు సృష్టించే ఒత్తిడి, డెత్ ఓవర్లలో బౌలర్ల సంయమనం.. ఈ మూడు అంశాలు భారత విజయానికి కీలకం కానున్నాయి.

**పాక్‌ను అంచనా వేయడం కష్టమే!**

ప్రస్తుత భారత జట్టును చూస్తే అనుభవం, ప్రతిభ కలగలిసిన సమతూకం కనిపిస్తోంది. అయితే ఆసియా క్రీడల బరిలోకి దిగిన పాకిస్థాన్ జట్టులో కొత్త ఆటగాళ్లే ఎక్కువగా ఉండటంతో వారి సామర్థ్యాన్ని ముందుగానే అంచనా వేయడం కష్టం. ప్రత్యర్థి ఆటతీరును నిశితంగా గమనిస్తూ భారత ఆటగాళ్లు వ్యూహాలు అమలు చేయాల్సి ఉంటుంది. పాకిస్థాన్ జట్టులో సైమ్ అయూబ్, అరాఫత్ మిన్హాస్‌వంటి ఆటగాళ్లు పార్ట్‌టైమ్ స్పిన్‌తోనూ ప్రభావం చూపగలరు. ఆబ్రార్ అహ్మద్, సుఫియాన్ మోకింవంటి స్పిన్నర్లను భారత బ్యాటర్లు ఎలా ఎదుర్కొంటారనేది ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా మధ్య ఓవర్లలో వికెట్లు కోల్పోకుండా పరుగుల వేగాన్ని కొనసాగించడం భారత్‌కు పరీక్షగా నిలవనుంది. భారత్‌తో మ్యాచ్ కావడంతో పాకిస్థాన్ ఆటగాళ్లు సహజంగానే అదనపు ఉత్సాహంతో బరిలోకి దిగుతారు. అలాంటి సమయంలో భారత ఆటగాళ్లు ప్రత్యర్థి ప్రేరేపణలకు స్పందించకుండా తమ ఆటపైనే దృష్టి పెట్టాలి. భావోద్వేగాల కంటే వ్యూహాలకు ప్రాధాన్యం ఇస్తేనే ఒత్తిడిని అధిగమించగలరు.

**కీలక ఆటగాళ్లు కుదురుకుంటే..**

సెమీఫైనల్లో అభిషేక్ శర్మ, సంజు శాంసన్ ఆశించిన స్థాయిలో పరుగులు చేయలేకపోయారు. ఫైనల్లో వీరిద్దరూ రాణించడం భారత్‌కు అత్యంత అవసరం. ముఖ్యంగా అభిషేక్ తన దూకుడైన బ్యాటింగ్‌తో ప్రత్యర్థి బౌలర్లపై ఒత్తిడి పెంచగలడు. అయితే ఆ దూకుడులో వికెట్‌ను పారేసుకోకుండా జాగ్రత్త పడాలి. మరోవైపు సంజు శాంసన్ తన అనుభవాన్ని ఉపయోగించి ఇన్నింగ్స్‌ను నిర్మించాల్సి ఉంటుంది. తిలక్ వర్మ, శివమ్ దూబే కూడా సెమీస్‌లో పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. మిడిల్ ఆర్డర్‌లో వీరిద్దరూ కుదురుకుంటే భారత్ భారీ స్కోరు సాధించేందుకు అవకాశం ఉంటుంది. ఒకవేళ టాప్ ఆర్డర్ విఫలమైనా ఇన్నింగ్స్‌ను నిలబెట్టే బాధ్యత మిడిల్ ఆర్డర్‌పై ఉంటుంది. భారత జట్టులోని బ్యాటింగ్ లోతు ఒక సానుకూలాంశం. అయితే ఆ సామర్థ్యం కాగితాలకే పరిమితం కాకుండా ఫైనల్లో మైదానంలోనూ కనిపించాలి. ప్రత్యర్థి బౌలర్లను ఎదుర్కొనే క్రమంలో సింగిల్స్, డబుల్స్ ద్వారా స్కోరు బోర్డును కదిలిస్తూ చెత్త బంతులను మాత్రమే బౌండరీలకు తరలించే విధానం ఉపయోగపడుతుంది.

**ఒత్తిడిని జయిస్తే పసిడి మనదే!**

భారత్-పాకిస్థాన్ మ్యాచ్‌లో ప్రతిభతో పాటు ఒత్తిడిని తట్టుకునే సామర్థ్యమూ కీలక పాత్ర పోషిస్తుంది. ఫైనల్ కావడం, ప్రత్యర్థి పాకిస్థాన్ కావడంతో ప్రతి ఓవర్, ప్రతి వికెట్ మ్యాచ్ గమనాన్ని మార్చే అవకాశం ఉంది. అందుకే ఆరంభంలోనే ఆధిపత్యం సాధించాలనే తొందర కంటే పరిస్థితులకు అనుగుణంగా ఆడటం ముఖ్యం. టాస్, పిచ్ స్వభావం, తొలి పది ఓవర్ల ఆటతీరు వంటి అంశాలు కూడా వ్యూహాలను ప్రభావితం చేయనున్నాయి. భారత్ ముందుగా బ్యాటింగ్ చేసినా, లక్ష్య ఛేదనకు దిగినా.. భాగస్వామ్యాలే విజయానికి పునాది కావాలి. బౌలింగ్‌లోనూ ఒకే ఆటగాడిపై ఆధారపడకుండా సమష్టిగా రాణించాల్సి ఉంటుంది.

ఇప్పటివరకు సాగిన ప్రయాణం భారత జట్టులో స్వర్ణంపై ఆశలు పెంచింది. అయితే తుది పోరులో ఆ అంచనాలను నిజం చేసుకోవాలంటే సెమీఫైనల్లో కనిపించిన లోపాలను సరిదిద్దుకోవాలి. బ్యాటింగ్‌లో నిలకడ, స్పిన్‌ను సమర్థంగా ఎదుర్కోవడం, బౌలింగ్‌లో క్రమశిక్షణ, మైదానంలో సంయమనం.. ఈ నాలుగు అంశాలు భారత విజయానికి కీలకంగా మారనున్నాయి. దాయాదుల సమరంలో గెలుపు కేవలం మరో మ్యాచ్ విజయం కాదు.. ఆసియా క్రీడల్లో దేశానికి స్వర్ణ కిరీటం అందించే అవకాశం. ఆ లక్ష్యంతోనే టీమిండియా బరిలోకి దిగుతోంది. ఇప్పుడు అభిమానుల ఎదురుచూపు ఒక్కటే.. నిషిన్ మైదానంలో భారత త్రివర్ణ పతాకం స్వర్ణ విజయంతో రెపరెపలాడాలి!

# 44 ఏళ్ల నిరీక్షణకు తెర!




**చైనాను చిత్తు చేసి ఆసియా హాకీ రాణులుగా భారత్..**

**2028 ఒలింపిక్స్‌కు అర్హత**

నగోయా: నాలుగు దశాబ్దాలుగా ఊరిస్తున్న స్వర్ణ పతకాన్ని భారత మహిళల హాకీ జట్టు ఎట్టకేలకు సొంతం చేసుకుంది. ఆసియా క్రీడల ఫైనల్లో ఆతిథ్య చైనాపై 1-0 తేడాతో విజయం సాధించి పసిడి పతకాన్ని కైవసం చేసుకుంది. ఉత్కంఠభరితంగా సాగిన తుది పోరులో లాలెమి సియామి సాధించిన కీలక గోల్ భారత్‌కు విజయాన్ని అందించింది. ఒక్క గోల్ ఆధిక్యాన్ని చివరి వరకు కాపాడుకున్న భారత అమ్మాయిలు.. 44 ఏళ్ల స్వర్ణ నిరీక్షణకు తెరదించారు. అదే సమయంలో 2028 ఒలింపిక్స్‌కు కూడా నేరుగా అర్హత సాధించి ద్వంద్వ విజయాన్ని అందుకున్నారు.

**సియామి గోల్.. స్వర్ణానికి బాట**

ఫైనల్లో ఇరు జట్లూ హోరాహోరీగా తలపడ్డాయి. ఒక్క గోల్ కూడా మ్యాచ్ గమనాన్ని పూర్తిగా మార్చే పరిస్థితి ఉండటంతో ప్రతి దాడి, ప్రతి రక్షణ చర్య కీలకంగా మారింది. ఈ క్రమంలో లాలెమి సియామి సాధించిన గోల్ భారత శిబిరంలో ఆనందాన్ని నింపింది. భారత్‌కు 1-0 ఆధిక్యం లభించడంతో చైనాపై ఒత్తిడి పెరిగింది. అయితే ఆ తర్వాత భారత జట్టుకు అసలైన పరీక్ష ఎదురైంది. ఒక్క గోల్ ఆధిక్యాన్ని కాపాడుకోవడం అంత తేలిక కాదు. ముఖ్యంగా చైనావంటి బలమైన ప్రత్యర్థి నుంచి వరుస దాడులు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. దీంతో భారత రక్షణ విభాగం అప్రమత్తంగా వ్యవహరించింది. ప్రత్యర్థికి లభించిన అవకాశాలను అడ్డుకుంటూ.. ఆధిక్యాన్ని నిలబెట్టుకునేందుకు ఆటగాళ్లు సమష్టిగా పోరాడారు. చివరి నిమిషాల వరకు ఉత్కంఠ కొనసాగినా.. భారత్ ఆధిక్యాన్ని కోల్పోలేదు. చివరి సైరన్ మోగడంతో భారత శిబిరంలో సంబరాలు మొదలయ్యాయి. ఆటగాళ్లు ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ విజయాన్ని ఆస్వాదించారు. నాలుగు దశాబ్దాలకు పైగా ఎదురుచూసిన స్వర్ణం తమ చేతుల్లోకి రావడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

**ఒలింపిక్స్ బెర్త్ కూడా ఖాయం**

ఆసియా క్రీడల్లో స్వర్ణం సాధించడంతో భారత మహిళల హాకీ జట్టుకు మరో భారీ ప్రయోజనం లభించింది. 2028 లాస్‌ఏంజెలెస్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించింది. దీంతో ఆసియా క్రీడల స్వర్ణ పతకంతో పాటు ఒలింపిక్స్ బెర్తును కూడా భారత అమ్మాయిలు ఖాయం చేసుకున్నారు. ఒలింపిక్స్‌కు అర్హత సాధించడం జట్టుకు ఎంతో కీలకం. ప్రపంచ క్రీడా వేదికపై తమ ప్రతిభను ప్రదర్శించేందుకు మరో అవకాశం దక్కింది. ఆసియా స్థాయిలో స్వర్ణం సాధించడం ద్వారా భారత జట్టు ఆత్మవిశ్వాసం కూడా పెరగనుంది. ఇప్పుడు 2028 ఒలింపిక్స్‌ను లక్ష్యంగా చేసుకుని మరింత పటిష్ఠంగా సిద్ధమయ్యే అవకాశం ఉంది.

**కొత్త లక్ష్యాలకు శ్రీకారం**

ఆసియా క్రీడల్లో స్వర్ణం సాధించడంతో భారత మహిళల హాకీ జట్టుకు ఇప్పుడు కొత్త లక్ష్యాలు కనిపిస్తున్నాయి. సుదీర్ఘకాలం తర్వాత ఆసియా చాంపియన్‌గా నిలిచిన జట్టు.. ఇదే జోరును కొనసాగిస్తూ అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని అభిమానులు ఆశిస్తున్నారు. చైనాపై ఫైనల్లో సాధించిన 1-0 విజయం స్కోర్‌బోర్డుపై చిన్నదిగా కనిపించినా.. దాని వెనుక ఉన్న పోరాటం మాత్రం ఎంతో పెద్దది. ఒక గోల్ సాధించడం, ఆ ఆధిక్యాన్ని చివరి వరకు కాపాడుకోవడం, 44 ఏళ్ల నిరీక్షణకు ముగింపు పలకడం.. అన్నీ ఒకే మ్యాచ్‌లో జరిగాయి. ఆసియా క్రీడల్లో పసిడి పతకాన్ని అందుకున్న భారత మహిళల హాకీ జట్టు ఇప్పుడు 2028 ఒలింపిక్స్ వైపు అడుగులు వేస్తోంది. నాలుగు దశాబ్దాల నిరీక్షణకు ముగింపు పలికిన ఈ విజయం.. భారత మహిళల హాకీకి కొత్త అధ్యాయానికి నాంది పలికింది. ఆసియా పసిడితో చరిత్ర సృష్టించిన అమ్మాయిలు.. ఇక ఒలింపిక్స్ వేదికపై తమ సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు.

# ఇంటింటికీ 'కుటుంబ' సందడి!

నివిన్ పౌలీ, యంగ్ హీరోయిన్ మమితా బైజు ప్రధాన పాత్రల్లో నటించిన రొమాంటిక్ కామెడీ డ్రామా 'బెత్లెహెమ్ కుటుంబ యూనిట్' ఇప్పుడు ఓటీటీలోకి వచ్చేసింది. గిరీష్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం థియేటర్లలో సంచలనం సృష్టించింది. రూ.300 కోట్లకు పైగా వసూళ్లు సాధించి, మలయాళ పరిశ్రమలో కొత్త ఇండస్ట్రీ హిట్‌గా నిలిచింది. ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను జియో హాట్‌స్టార్ దక్కించుకుంది. శుక్రవారం నుంచే పాన్ ఇండియా భాషల్లో స్ట్రీమింగ్ మొదలైంది. థియేటర్లలో చూడలేకపోయినవారికి ఇప్పుడు ఇంటినుంచే చూసే అవకాశం దొరికినట్టే. నివిన్ కామెడీ టైమింగ్, మమితా స్క్రీన్ ప్రెజెన్స్, కుటుంబ భావోద్వేగాలతో సాగే కథనం ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణలు. సినిమా ఓటీటీ విడుదలకు సంబంధించి గత రెండు రోజులుగా సోషల్



మీడియాలో అభిమానుల సందడి కనిపిస్తోంది. ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ డిజిటల్ ప్రేక్షకులను ఏ మేరకు ఆకట్టుకుంటుందో చూడాలి.

## రామాయణం వైపు.. నవ్వుల రావిపూడి?



టాలీవుడ్‌లో వరుస విజయాలతో దూసుకుపోతున్న దర్శకుడు అనిల్ రావిపూడి గురించి ఇప్పుడు ఆసక్తికర వార్త వినిపిస్తోంది. కామెడీ, కమర్షియల్ ఎంటర్‌టైన్‌మెంట్‌కు పేరుగాంచిన ఆయన, ఈసారి తన రెగ్యులర్ ఫార్మాట్‌కు భిన్నంగా యానిమేషన్ సినిమా చేయాలని భావిస్తున్నారట. అది కూడా భారతీయ ఇతిహాసం 'రామాయణం' నేపథ్యంలో ఉంటుందని ఇండస్ట్రీ టాక్. ఇదే నిజమైతే అనిల్ కెరీర్‌లో ఇది పూర్తిగా కొత్త ప్రయత్నం అవుతుంది. ఇప్పటికే 'భగవంత్ కేసరి' లాంటి సీరియస్ ఎమోషనల్ డ్రామాతో తనలోని మరో కోణాన్ని చూపించారు. అయితే ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ప్రస్తుతం ఆయన తన తదుపరి సినిమా పనుల్లో బిజీగా ఉన్నారు. వెంకటేశ్, నందమూరి కల్యాణ్ రామ్‌లతో ఆయన సినిమాలు చేయనున్నారనే ప్రచారం కూడా ఉంది. ఈ నేపథ్యంలో రామాయణం యానిమేషన్ వార్తల్లో నిజమెంత? అనిల్ నిజంగానే తన రెగ్యులర్ జోన్ దాటి కొత్త ప్రపంచంలోకి అడుగుపెడతారా? దీనికి సమాధానం కావాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే.

## తెలుగు తెరపైకి 'హనుమాన్ అంశ్'..



చిన్న సినిమాగా, ఎలాంటి అంచనాలు లేకుండా విడుదలై నిర్మాతకు కాసుల వర్షం కురిపించిన చిత్రం 'హనుమాన్ అంశ్'. ఇప్పుడు ఇది తెలుగులో విడుదలకు సిద్ధమైంది. అక్టోబర్ 9న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ కానుంది. మొదట సెప్టెంబర్ 18న విడుదల చేయాలని అనుకున్నారు. ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్ ఈ సినిమా బాధ్యతలు తీసుకున్నట్టు కూడా ప్రకటించారు. అయితే చివరి నిమిషంలో వాయిదా వేశారు. తాజాగా హోంబలే ఫిల్మ్స్ కొత్త తేదీతో పోస్టర్ షేర్ చేసింది. 1900–1973 మధ్య జీవించిన ఆధ్యాత్మిక గురువు, హనుమాన్ భక్తుడు నీమ్ కరోలి బాబా (మహరాజ్) జీవితం, బోధనల ఆధారంగా విశాల్ చతుర్వేది ఈ సినిమాను తెరకెక్కించారు. రూ.2 కోట్లతో తీసిన ఈ చిత్రం ఏకంగా రూ.400 కోట్లు వసూలు చేసింది, సినీ ప్రముఖుల ప్రశంసలూ అందుకుంది. అక్టోబర్ 9న తెలుగులో మరో రెండు సినిమాలు కూడా వస్తున్నాయి. వెంకటేశ్--త్రివిక్రమ్ కాంబినేషన్‌లోని 'ఆదర్శ కుటుంబం', శ్రీవిష్ణు నటించిన 'కామ్రేడ్ కళ్యాణ' అదే రోజు ప్రేక్షకుల ముందుకు రానున్నాయి.



## నాకు చేతగాకపోతే నో చెప్తా

ఇతర భాషల్లో నటించేటప్పుడు యాస విషయంలో వచ్చే ఇబ్బందులు, సోషల్ మీడియాలో జరిగే ట్రోలింగ్‌పై నటి పార్వతి తిరువోతు స్పందించారు. ఒక భాషను నేర్చుకుని అందులో సహజంగా మాట్లాడటం అంత సులభం కాదని ఆమె అన్నారు.

ప్రేక్షకులు సహజమైన నటన ఆశించడం సమంజసమే అయినా, దాని కోసం నటీనటులు చేసే ప్రయత్నాన్ని కూడా గుర్తించాలని కోరారు. తనకు నచ్చిన కథలు, పాత్రలకే ఇప్పటివరకు ప్రాధాన్యం ఇచ్చానని చెప్పారు. కొత్త భాషలు నేర్చుకోవడం ఆమెకు ఇష్టం. అందుకే ఇతర భాషల్లో అవకాశాలు వస్తే స్వీకరిస్తారు, అవసరమైన శిక్షణ కూడా తీసుకుంటారు.

"ఒక భాషలో నటించే అవకాశం వస్తే ఆ భాష నేర్చుకుంటాను. కానీ ఆ పాత్రను సరిగ్గా చేయలేనని అనిపిస్తే వెంటనే నో చెప్పేస్తాను. నా స్థానంలో డైలాగులను మరింత సహజంగా చెప్పగలిగే డబ్బింగ్ ఆర్టిస్ట్‌ను తీసుకున్నా సంతోషిస్తాను" అని ఆమె వెల్లడించారు. ఈ కారణంతో కొన్ని సినిమాలను వదులుకున్నానని కూడా తెలిపారు. భాషా పరిజ్ఞానం లేకపోయినా అవకాశాన్ని వదలకుండా నటించడం కంటే, ఆ పాత్రకు న్యాయం చేయగలిగే వారిని ఎంపిక చేయడమే ముఖ్యమన్నది ఆమె అభిప్రాయం.

## పది రెట్లు పారితోషికమా.. ఇస్తారా?

త్రివిక్రమ్ దర్శకత్వంలో వస్తున్న 'ఆదర్శ కుటుంబం: హౌస్ నెం.47'లో వెంకటేశ్ సరసన శ్రీనిధి శెట్టి స్వర్ణగా కనిపించనున్నారు. ఇద్దరూ భార్యాభర్తలుగా నటించారు. అక్టోబర్ 9న సినిమా విడుదల కానున్న నేపథ్యంలో ఓ ఇంటర్వ్యూలో శ్రీనిధి పలు విషయాలు పంచుకున్నారు. వెంకటేశ్ చాలా సరదాగా ఉంటారని, అన్నీ సమయానికి జరగాలని కోరుకుంటారని, ఆయన నుంచి చాలా నేర్చుకున్నానని చెప్పారు. ఆయన సింగిల్ టేక్‌లోనే డైలాగ్ చెప్పేస్తారట. ఈ సినిమాకు ఆమె స్వయంగా డబ్బింగ్ చెప్పారు, ప్రతి పదాన్ని రాసుకుని ప్రాక్టీస్ చేశారు. సాఫ్ట్‌వేర్ జాబ్ వదిలి నటనపై ఆసక్తితో వచ్చానని, ఇష్టంతో వచ్చినప్పుడు కష్టాలకు సిద్ధంగా ఉండాలని అన్నారు. తల్లి పాత్ర చేయడం వల్ల కెరీర్‌పై ప్రభావం పడుతుందని అనుకోనని, కథ బాగుంటే ఏ పాత్ర అయినా చేస్తానని చెప్పారు. 15 ఏళ్ల తర్వాత తన సినిమాలు చూసుకున్నప్పుడు గర్వంగా అనిపించాలన్నారు. భారీ రెమ్యునరేషన్ తీసుకుంటున్నారన్న రూమర్లపై స్పందిస్తూ, అంత తీసుకునేన్ని సినిమాలు తాను చేయలేదని, 10 రెట్లు ఎక్కువ తీసుకున్నారన్న వార్తలు చూసి నవ్వుకున్నానని తెలిపారు.



## మలయాళ తెరపై భాగ్యశ్రీ తొలి అడుగు..

టాలీవుడ్‌లో గుర్తింపు తెచ్చుకుంటున్న హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే ఇప్పుడు మాలీవుడ్‌లోకి అడుగుపెడుతున్నారు. మలయాళ సూపర్‌స్టార్ మోహన్‌లాల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న 'ఆపరేషన్ గంగా'తో ఆమె మలయాళ పరిశ్రమలోకి ఎంట్రీ ఇస్తున్నారు. మోహన్‌లాల్‌తో దిగిన ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ, ఆయనతో పనిచేయడం తనకు ఆశీర్వాదమని అన్నారు. షూటింగ్‌లో ప్రతిరోజూ ఆయన నుంచి కొత్త విషయాలు నేర్చుకుంటున్నానని, సినిమాను చూసే ఆయన దృష్టికోణం తనకు ఎంతో ఉపయోగపడుతోందని చెప్పారు. ఆయన ప్రతిభ, అనుభవాన్ని ప్రశంసిస్తూ, ఇది ప్రత్యేకమైన అనుభవమని పేర్కొన్నారు. విష్ణు మోహన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు అర్జున్ రాంపాల్ కూడా కీలక పాత్రలో కనిపించనున్నారు. ఇటీవలే జార్జియా షెడ్యూల్ పూర్తయింది. 2022 రష్యా--ఉక్రెయిన్ యుద్ధ సమయంలో ఉక్రెయిన్‌లో చిక్కుకున్న భారతీయులను సురక్షితంగా స్వదేశానికి తీసుకొచ్చిన భారీ తరలింపు కార్యక్రమం నేపథ్యంలో ఈ సినిమా రూపొందుతోంది. భాగ్యశ్రీ కెరీర్‌కు ఇది మరో కీలక అవకాశంగా నిలవనుంది.

